



# శ్రీ నాన్న ప్రేమామృత స్రవంతి

సంకలనం

సాగిరాజు రామకృష్ణం రాజు
అర్ధవరం

ఓం శ్రీ అరుణాచలేశ్వరాయ నమః

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

శ్రీనాన్న పరమాత్మనే నమః



# శ్రీ నాన్న ప్రేమామృత స్రవంతి

సంకలనం

**సాగిరాజు రామకృష్ణంరాజు**

**అర్థవరం**

# శ్రీ నాన్న ప్రేమామృత స్రవంతి

ప్రధమ ముద్రణ : **నవంబరు, 2020**

కాపీలు : **1000**

వెల : **అమూల్యము**

**సర్వ హక్కులు :**

**సాగిరాజు రామకృష్ణంరాజు**

శ్రీ రమణ నిలయం

అర్ధవరం – 534 197

**సలహాలు సంప్రదింపులకు :**

**సాగిరాజు రామకృష్ణంరాజు**

సెల్ : 9491968966

**రూపకల్పన :**

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్, పాలకొల్లు

సెల్ : 9397151342

**సంకలనం :**

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

సెల్ : 9491968966

# అంకితం



పశ్చిమ గోదావరి జిల్లా, చింతపల్లి గ్రామ కాపురస్తులు

కీ॥శే॥ **వేములమండ సత్యనారాయణరాజు**గారు

వృత్తి వ్యవసాయమైనా ప్రవృత్తి సంఘసేవ.

ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ సేవ ఉంటుంది, సేవాతత్పరులు, నిష్కపటి. గ్రామ తగువుల్లో మునసబుగా, పెద్దగా, నిష్పక్షపాతంగా, ధర్మానికి నిలువెత్తు నిదర్శనంగా తీర్పులు చెబుతూ అందరి మన్ననలను పొందుతారు. చాలా గ్రామాల ప్రజలకు తీర్పు చెబుతారు. ముఖ్యంగా శ్రీ నాన్నగారి ప్రేమను సంపూర్ణంగా పొందిన బహుకొద్దిమందిలో వారు ఒకరు. గుండుగొలనులో అపూర్వమైన, భవ్యమైన భవంతి **"శ్రీ రమణ నిలయం"**లో తరచుగా శ్రీనాన్నగారికి, భక్తులకు విడిది. యాబది లక్షలతో సత్యనారాయణ స్వామి ఆలయం నిర్మించారు. అక్కడా, ఇంటి వద్ద శ్రీనాన్నగారి ప్రవచనాలు జరిగేవి. వారి ధర్మపత్ని **సావిత్రమ్మ**గారు అనగా నా సోదరి శ్రీనాన్నగారి పట్ల అనన్య భక్తి. వారి గురించి ఈ గ్రంథంలో వివరంగా పొందుపరటమైనది.

# కృతజ్ఞతలు

గ్రంథ సమీక్ష వ్రాసిన సామంతపూడి భీమరాజు,
విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గారికి, భీమవరం
సీతాపతి మాష్టారు గారికి, ఉండి భీమరాజు గారికి,
జయ గారికి, పుస్తకానికి రూపకల్పన చేసిన అనన్య
జిరాక్స్ నెట్ సెంటర్ నందిగామ శేషసాయి గారికి,
నన్ను ప్రోత్సహించిన అర్థవరం రామాలు గారికి,
సాగిరాజు దుర్గ గారికి, కొవ్వూరు సయ్యపరాజు
సత్యనారాయణ రాజు (నా బావ అనగా
సయ్యపరాజు సీతమ్మగారి మనుమడు)
గారికి నా కృతజ్ఞతలు.

# గ్రంధ సమీక్ష

శ్రీ సాగిరాజు రామకృష్ణంరాజుగారు తన మనోభావాలను వ్యక్తీకరించిన "శ్రీ నాన్న ప్రేమామృత స్రవంతి" ఆసాంతం చదివాను. ఈ పుస్తకరాజంలో అనేక విశిష్ఠ భావాలతో కూడిన "భగవంతునికి భక్తునికి అనుసంధానం" అనే యెడి ఒక చక్కటి హృదయ స్పందన మనకు దృగ్గోచరమవుచున్నది. ఒక నిర్దిష్ట లక్ష్యంతో, చక్కటి కార్యాచరణ ప్రణాళికతో ఆ దైవాని చేరాలన్న భావన, ప్రేరణ, స్పందన, ఇత్యాది మృదుమధురమైన అమృతధారలు మనకు విశదమగుచున్నవి. వారీ వయస్సులో సమాజంలో గల మానవాళి దైవచింతన కల్గి తద్వారా ముక్తి మార్గాన్ని పొందుటకు దారి చూపు ఒక బాటయే ఈ గ్రంధరాజం "శ్రీ నాన్న ప్రేమామృత స్రవంతి". మనకు పనిచేయాలన్న ఒక లక్ష్యం, ఒక గమ్యం, అందుకు సాధనగా ఒక గురువు అవసరం. ఆ గురువే మనకు ముక్తిమార్గాన్ని ప్రసాదించగలడు. ఆ గురువే దైవం. అట్టి విశిష్ఠ భావాల మేలుకలయికయే "శ్రీ నాన్నగారు". వారి భావాలు, భోదనలు మనకు ఒక అనుభవాల సంపుటిని మనకు అందించిన "శ్రీ సాగిరాజు రామకృష్ణం రాజు"గారు ధన్యజీవి. వీరి భావాలు సమాజంలో నిద్రాణమై పోతున్న మానవ విలువలను తట్టి లేపి తద్వారా చక్కటి సమాజ పునఃనిర్మాణమునకు దోహదమగును. ధన్యజీవి మన "శ్రీ రామకృష్ణం రాజు" గారు.

ఇందులో మనకు కావలసినది నమ్మకం. నమ్మకమే ఒక గురువు. ఆ గురువే దైవం. ఇందులో భగవంతునికి, భక్తునికి అనుసంధానమే అత్యంత కీలకమయినది. డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ చెప్పిన ఒక వివరణ "మనిషి ఒక పని చేసేదానికన్నా ఆ పని వెనుక వుండే భావన ఎంతో విలువైనది". అసలు నిర్మల హృదయంతో ఓ పని చేసినప్పుడు ఆ పని ఎంత చిన్నదిగా కనిపించినా దాని తాలూకు మంచి ఫలితాలు మాత్రం ఎంతో అద్భుతంగా ఉంటాయి. భుజకీర్తులూ, చంద్రహారాలు మనిషికి అలంకారాలు కావు. పన్నీటి స్నానంతో,

సుగంధ విలేపనాలతోనూ, పువ్వులతోనూ, కేశాలంకరణలతోనూ మనిషి అందచందాలు పెరగవు. నిజానికి మనిషికి చెరగని అలంకారంగా భాసిల్లకలిగేది ఒక్క "వాగ్భూషణం" మాత్రమే. ఎందుకంటే తక్కిన అలంకారాలన్నీ ఏదో ఒకరోజున నశించిపోయే నగలు. అన్నింటికీ నిలిచి వుండగలిగేది మనిషి "వాక్కు" అనే నగ మాత్రమే. రామకృష్ణ పరమహంస చెప్పినట్లు మనిషి మనసు చంచలముగానూ, అస్థిరంగానూ ఉన్నంతవరకూ అతనికి ఎంత గొప్ప గురువు లభించినా, ఎంత మంచివారితో సజ్జనసాంగత్యం లభించినా ఎటువంటి ఉపయోగం ఉండదు. గమ్యం తెలియని బాటసారిలా, దిక్సూచి లేని నావలా, తెరచాపలేని ఓడలా, లక్ష్యం లేని ఒంటరి ప్రయాణం చేయు మానవాళికి ఈ గ్రంధరాజం ఒక గమ్యాన్ని తెలుపుతుంది. మహాపురుషులైన వారిని ప్రపంచమే వెతుక్కుంటుంది. ప్రపంచాన్ని వారు వెతకరు. అటి మహాపురుషులే "శ్రీ నాన్నగారు". వారి భావాలను మనకు అందించిన శ్రీ సాగిరాజు రామకృష్ణంరాజుగారు మనందరికీ మార్గదర్శకులు.

విద్యాబుద్ధులు, ధైర్యసాహసాలు, కార్యదక్షత, బలం, శౌర్యపరాక్రమాలు, ఈ ఐదూ ఏ మనిషికైనా ఎప్పుడూ కలిగివుండే సహజ మిత్రులు. బుద్ధిమంతుడైన వాడు సదా వీటి సారాన్ని కోరుకుంటారు. అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడు మానవాళికి ఈ విశిష్ఠ భావాలు మంచి పురోగతికి మార్గమవును. శ్రీ నాన్నగారి ప్రేమామృత భావాలు మానవాళిని ముక్తి మార్గంలో పయనించుటకు ఉపకరించును. సదా శ్రీరామకృష్ణంరాజు గారికి మరింత శక్తినిచ్చి మరిన్ని గ్రంధరాజాలు మనకందించు శక్తిని వారికి భగవంతుడు ఇవ్వాలని మనమందరమూ కోరుకుందాం.

**సర్వేజనాస్సుఖినోభవన్తు**

ప్రేమతో...

మీ ఆత్మీయుడు..

**సామంతపూడి భీమరాజు**, M.A., M.A., M.A., B.Ed.,

Retd. H.M.,

# ప్రార్థన

## 'ఉన్నది నలుబది'లో భగవాన్ మంగళకరమైన శోకాన్ని పోగొట్టే శ్లోకం

**తా॥**

మరణ భయమధికమైన యా పురుషులు భవ మరణ రహితమగు మహేశ్వరుని చరణరణములనే శరణముఁగ బొందఁగలరు. తమ సంగములతోఁ దామును జచ్చి అనగా మమతాహంకారములు నశించి చావులేక స్వరూపమై వెలుఁగువారు మరల మరణ చింతనొందఁగలరా?

## గురుగీత

బ్రహ్మానందం పరమ సఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం, గగన సదృశం, తత్వమస్యాది లక్ష్యం
ఏకం, నిత్యం, విమలమచలం, సర్వధేసాక్షిభూతం,
భావాతీతం, త్రిగుణరహితం,
సంతతమ్తంసమామి.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# శ్రీనాన్న ప్రేమామృత ప్రవంతి



"వినీలాకాశంలో వింత కాంతి" రచించిన అత్యం సూర్య గారి గ్రంధానికి శ్రీనాన్నగారు వ్యాఖ్యానిస్తూ "ఇది కథలాగే ఉంటుంది - కథ కాదు. ఒక నవ లాగే ఉంటుంది కాని నవల కాదు. ఒక చరిత్రలాగే ఉంటుంది కాని చరిత్ర కాదు. మరి యిదేమిటి? రామాయణ, భారత, భాగవతాదులవలె ఒక పారాయణ గ్రంథం. ముక్తికి బంగారు బాట వేసిన గ్రంథరాజం" అన్నారు. Indian Express "This book is to be read, re read and digested" ఇలా ఎన్నో పత్రికలు ప్రశంసల వర్షం కురిపించాయి.

రచనకు స్థిరత్వం ఉంటుంది. సుదీర్ఘకాలం మానవజాతికి గొప్పమేలు చేస్తుంది. తాను చూచి శ్రీనాన్నగారి వాక్కులను విన్నవి, విన్న వాటిని వెంటనే రాసిపెట్టటం ప్రథమ శ్రేణి ప్రయాణం. తదుపరి కాలంలో రాయడం ద్వితీయ శ్రేణి ప్రయాణం. సంఘటనలు భక్తులు కల్పితం లేకుండా చెప్పగా వ్రాయటం తృతీయ శ్రేణి ప్రయాణం. తాను చూచాను, ఇతరులు కూడా ఆ మాటలు విన్నారు అని చెప్పగా వ్రాయటం చతుర్థ శ్రేణి ప్రయాణం. పై ప్రమాణాలను నేను ఎన్నుకొన్నాను.

వ్యక్తుల గురించి శ్రీనాన్నగారి వివరణలు వారి గ్రామీణ నిరాడంబరత, హాస్యం, సామెతలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు, మహాత్ముల జీవన సరళి, ప్రముఖ రాజకీయ నాయకుల సంభాషణలు, వారి కల్యాణ గుణాలు, పుణ్యక్షేత్రాల వర్ణనలు, ఆ క్షేత్ర పాలకుల స్వప్న దర్శనాల వైషిష్ట్యాలు. శ్రీ నాన్నగారి భాషా శైలి మృదుమధురంగా ఆ తేనెలొలికే పలుకులు మనస్సును ఉత్తేజ పరుస్తాయి, అవి

అన్నీ అనుభవైకవేద్యాలే. ఆ తండ్రిని ప్రేమించటమే భక్తిసారం. జ్ఞాన విచారణ ద్వారా సత్యాన్ని తెలుసుకోవటం ఎంతో కష్టం.

భగవాన్ శ్రీ రమణుల ముద్దుబిడ్డ సద్గురు శ్రీనాన్నగారు కూడా ఇదే ప్రేమ స్వరూపులే కదా, వారి వైభవాన్ని వారితో నాకు ఉన్న అనుబంధాన్ని ఆణిముత్యాల్లాంటి సంఘటనలను ఏర్చికూర్చి ఎందుకు రాయకూడదు అని ఒక దివ్యశక్తి నన్ను ప్రేరేపించటమే తడవుగా శ్రీనాన్నగారిని 2008 సంవత్సరంలో ఈ ప్రతిపాదనను వారికి మనవి చేసాను. శ్రీవారు చిరునవ్వుతో "అలాగే - అలాగే చేద్దురుగాని, చెబుతాను - చెబుతాను" అని సెలవిచ్చారు. తక్షణం అంటే వారికి ప్రచారం అంటే గిట్టదుకదా! అని సమాధానపడ్డాను. చిత్తు ప్రతి నా మనో సంకల్పంలో మెదులుతూనే ఉంది. దేనికైనా సమయం, సందర్భం రావాలి కదా! వారి ఆశీస్సులు ఉన్నాయనే అంతరాత్మ ప్రేరణతో భక్త పాఠకలోకం ముందు వినమ్రతతో ఈ గ్రంథాన్ని యిలా ప్రారంభించాను. అనుకరణ ఆత్మహత్యా సదృశ్యము నా పంథాలో శ్రీవారి వైభవాన్ని ఇలా ఉపక్రమిస్తున్నాను.

మానవ జన్మ లభించటం అతి దుర్లభమైనది; లభించాక సద్గురు పాదాలపై అచంచలమైన భక్తి ఒక్కటే తేలికైన ఉపాయం. దానితో మన యోగక్షేమాలు చూడాలనే మాతృ హృదయం వికసించాలనే ఇచ్ఛ వారికి కలుగుతుంది. మనలను చూడకుండా వారు ఎలా ఉండగలరు? గత జన్మలలో వారి సన్నిహితమైన వారమని వారికి తెలుస్తుంది. ఎలా అంటే గాజు సీసాలో వస్తువులు చూచినట్లు మన కళ్ళగుండా మన అంతరంగంలోని భావాలన్నీ చూస్తారు. సముచిత కాలం ఆసన్నం కాకుండా దేన్నీ సాధించలేము. మన కృషే కృపగా మారుతుంది. మనం ఆర్తితో వారిని సేవిస్తే కృతార్థులు కావటం నల్లేరు మీద నడకలా సాగుతుంది. నాన్నగారు అంటే ఒట్టి నాన్నగారు కాదు, సద్గురు శ్రీనాన్నగారు. ఈ నా లేఖావళిలో శ్రీనాన్నగారు అనే కల్యాణ నామాన్నే ఎన్నుకొన్నాను అని మనవి చేసుకొంటున్నాను.

# 1. భక్తి లేదా ఆత్మ నివేదన

శ్రీనాన్నగారికి రామకృష్ణ పరమహంసగారు అంటే చాలా ఇష్టం. కపటం లేని వారు అని ప్రవచనంలో ఆయన ఉదాహరణలు కోకొల్లలు. రామకృష్ణులు "అమ్మా నేను నీ శరణాగతుడను, దేహ సుఖం నాకు అక్కరలేదు, పేరు ప్రతిష్ఠలు, అష్టసిద్ధులు అక్కరలేదు. కామినీ, కాంచనలపై ప్రీతి లేకుండా చెయ్యి. నీ పాద పద్మములయందు శుద్ధభక్తిని అనుగ్రహించు. నీకంటే నాకు దిక్కు ఎవరు ఉన్నారు? సాధనా హీనుడను, భక్తి హీనుడను, నీ పాద పద్మముల యందు భక్తి ప్రసాదించు" అన్నారు. అలాగే శంకర భగవత్పాదుడు పరమశివుని అనేక రకాలుగా వెటకారంతో ప్రార్థిస్తూ "నీ పాద పద్మములందు భక్తిని ప్రసాదించు" అన్నారు.

రామకృష్ణుల శిష్యులు శారదానంద ఆర్య సమాజం వారి ప్రార్థనను ఇలా తెలిపారు.

సర్వము నీవే శర్వేస్వరా - నా స్వరము నీవే సర్వేస్వరా
నా ఉనికి నీలోనే - నాయను వారు లేరు లేనే లేరు
నా శాంతి సౌఖ్యములు నీవే - నా అండ దండలు నీవే
కలిమి బలిమి నీవే - నా జ్ఞాన, విజ్ఞానములు నీవే
నా హాయి, స్థాయి నీవే - నా బంధుమిత్రులు నీవే
నాడు రేపూ నీవే - నా స్వర్గము, గమ్యము నీవే
నా విధులూ నీవే, శాస్త్రమూ నీవే - నా తోడు నీడా నీవే
నాదగు అవ్యయానందము నీవే
నా మార్గము, గమ్యము నీవే - నా కర్తవు, భర్తవు, దైవము నీవే
శిక్షణ సేయు తండ్రి నీవే - లాలన చేసే తల్లివీ నీవే
ప్రపంచమను నీ సాగరమందున - నావను నడిపే ప్రభువు నీవే

ఇన్‌స్టీన్ శారదానంద ఈ భావాలను చదువుకొనేవారు. శ్రీనాన్నగారు ఎంత 'ఆర్తి' గల పాట అనేవారు. ఈ కీర్తనను శ్రీనాన్నగారిపై అన్వయించుకొంటే అంతకన్నా సాధన ఏముంది? ఈ ఉపాసన వల్ల దేహం నేను కాను ఏదీ నేను కాను అని గ్రహిస్తాము. అజ్ఞానంలో మనిషి ఇది బంగారం - ఇది ఇత్తడి అంటాము. సద్గురు దృష్టిలో అంతా బంగారమే. ఈ కీర్తనను నాన్నగారి దృష్టిలో పెడితే "అంతా గురువే" అన్నారు. ప్రేమించే మాతృహృదయాన్ని వికశింపచేయటంలోనే నిజమైన ఆనందం అనుకొంటారు. గోపికల ప్రేమ ఎలాంటిది? అంటే శ్రీకృష్ణుని బొమ్మగీసి కాళ్ళను చిత్రించలేదు, కాళ్ళు ఉంటే మధురకు పారిపోతాడని భయం.

భక్తులను చూడకపోతే శ్రీనాన్నగారు తల్లడిల్లిపోతారు. వారి ప్రేమామృత చూపులను, ఆయన కల్యాణ గుణాలను కొలిచే తూకం రాళ్ళు మన దగ్గర లేవు. వారి రూపాన్ని ఎలా వర్ణించాలో మధురాష్టకంలో వల్లభాచార్య ఇలా వర్ణించారు పరమాత్మను.

**అధరం మధురం - వదనం మధురం**
**గమనం మధురం - హృదయం మధురం**
**నయనం మధురం - వచనం మధురం**
**చరితం మధురం - సఖ్యం మధురం**
**రూపం మధురం - కరుణ మధురం**
**మధురాధిపతే - రఖిలం మధురం**

అంటూ ఎన్నో అష్టకాలను వ్రాసారు వల్లభాచార్యులు.

గురు దేవులు శ్రీనాన్నగార్కి పైవన్నీ ఎందుకు వర్తించవు? అలా ఆర్తితో తన్మయులైతే భ్రమర కీటక న్యాయంలా వారిలా ఎందుకు కాలేము? నాన్నగారి సాధన ఇదే అని సన్నిహితులు చెపుతారు. రాత్రి ఎనిమిది గంటలకు వీధి గదిలో తలుపులు వేసుకొని రాత్రి రెండు గంటల వరకూ భగవాన్ కళ్ళల్లోకి చూస్తూ ఏకధారగా

కన్నీరు కార్చేవారు. ఆ 'ఆర్తి'కి కర్మవాసనలు అన్నీ నశించాయి. భగవాన్ శ్రీనాన్నగారిని కృతార్థులను చేసారు. అనేక సమావేశాలలో వారు "ఈ మార్గం సులభమైనది – అది నా అనుభవం. దాన్ని అనుసరించండి" అన్నారు. భగవాన్ "బ్రహ్మానుభవానికి ఆర్తి మార్గము" అన్నారు. అక్షరమణమాలను ఆలంబనంగా చేసుకొని ప్రతీ ద్విపదలోనూ వారి మధురమైన నయనాలను ఆర్తితో చూస్తూ ఉంటే చాలు – దీనికి శ్రద్ధ కావాలి. అంటే గురువు మీద నమ్మకం. ఆయన వేదాంత వాక్యాలపై విశ్వాసం కావాలి. ఇది నా అనుభవం నమ్మితే సొమ్ము – నమ్మకపోతే దుమ్ము.

ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించాక రామకృష్ణుని సాహిత్యం చదివి నేను దుర్గామాత కళ్ళలోకి చూస్తూ వారి పాదాలపై దృష్టి నిలిపి ఆర్తితో కన్నీళ్ళు వచ్చేవి. 'అమ్మా నీలో కలుపుకో' అనేవాడిని. ఆ ఆర్తి శ్రీనాన్నగారిని 1987 మార్చిలో ఒక సమావేశంలో కలిసాను. కౌగిలించుకొని "ఈశ్వర నిర్ణయం ఇప్పుడు కుదిరింది. మీ ఇల్లే మా ఇల్లు – మా ఇల్లే మీ ఇల్లు, మీకు మాకు భేదం లేదు" అని హామీ ఇచ్చారు. వారి పాదాలను తాకగానే నా నాడీమండలం యావత్తు శుద్ధి అయినది. జీవితానికి ఇది చాలు అనిపించింది. ఇక్కడ మరో విషయం పొందుపరచాలి అని మనవి చేస్తున్నాను. భగవాన్ ఆశ్రమంలో గోవు లక్ష్మి భగవాన్ పాదాలను నాకుతూ ఉండగా భగవాన్ నవ్వుతున్న ఫొటో భగవాన్ భక్తులు అందరకీ తెలుసు. ఈ దృశ్యం నన్ను అమితంగా ఆకర్షించింది. దీనిపై ఒక వాక్యాన్ని రాయాలని ఆ భక్తిభావన ఆ 'ఆర్తి' అందరినీ పులకరింపచేస్తుంది. ఇలా రాస్తున్నాను "ఈశ్వరుని పాదాలు చూడగానే సంసారమును మరచి ఆనంద పరవసుడు అవుతాడు భాగవుతుడు" పదాన్ని నాన్నగారికి చూపుదామని అనుకొన్నా అవకాశం దొరకలేదు. పోనీ వారి భక్తులతో పంచుకుందామని ఇలా మనవి చేసుకొంటున్నాను. అలాగే వైష్ణవులు "ఆండాళ్ తిరువరగళే శరణం" అంటూ రెచ్చిపోతూ అంటారు. అంటే ఆండాళ్‌ను శరణు పొందితే ఆమె విష్ణు దర్శనం చేయిస్తుంది.

# 2. గురు గీత

**గురువు యొక్క దేహమే ధ్యానమునకు కారణము.**

**గురుము యొక్క పాదమే పూజించుటకు కారణము.**

**గురు వాక్యమే - మంత్రమునకు కారణము.**

**గురు కృపే - మోక్షమునకు కారణము.**

**సహ ఓ బాయి**

సద్గురువు సహాయం లేని వ్యక్తి చీకటిలో మగ్గుతాడు. నేను భగవంతున్ని వదులుకొంటాను గానీ గురువును వదులుకోను. భగవంతుడు విశ్వాసాన్ని సృష్టించి నన్ను అందులోకి పంపించాడు. సద్గురువు జనన మరణాల చక్రం నుంచి బయటికి తీస్తాడు. భగవంతుడు కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలనే బందిపోటు దొంగలను నా మీదకు ఉసిగొలిపాడు. నన్ను సద్గురువు వారి నుండి తప్పించాడు. భగవంతుడు నన్ను కుటుంబ బంధనాల్లో చిక్కుకునేలా చేసాడు. గురువు అందుండి తప్పించాడు. అలాగే భగవంతుడు ఇంద్రియ వ్యామోహాల్లో ఉంచగా గురువు అందుండి తప్పించాడు. ఆయన నేనెవరో నాకు తెలియకుండా మాయలో పడేస్తే నా గురువు నా నిజ స్థితిని నాకు తెలిపారు. భగవంతుడు నాకు తెలియకుండా దాగి ఉండగా నా గురువు నాకు ప్రత్యక్షంగా ఉన్నారు. నేను మానసికంగా, శారీరకంగా సద్గురు చరణదాసుడను. నేను భగవంతుణ్ణి విడిచిపెడతాను కానీ సద్గురువును ఎన్నటికీ వదలను. భాగవతంతో అన్ని దోషాలకు మొత్తంగా ఒక నివారణ సూచించబడింది అది “సద్గురు పాదాల మీద అచంచల భక్తి”. గురునానక్ “గురు స్వరూపాన్ని మనస్సులో ధ్యానం చేసుకో. గురు ధ్యానం తప్ప ముక్తికి మరో మార్గం లేదు” అన్నారు. క్రీస్తు “నేను పరమాత్మను చూచాను. నువ్వు నన్ను చూచావు. ఇందుమూలంగా నువ్వు పరమాత్మను చూచినట్లే”. అంటే గురు

స్వరూపం మూలం, దానితో పరమాత్మవు అవుతావని అర్థం. వేమన "గురు శిక్ష లేక గురుతెట్లు కలుగునే, అజునికైన వాని యబ్బకైన, తాళం చెవిలేక తలుపెట్లూడున్" అన్నారు. అంటే అంతులేని సంపదతో ఉన్న ఇనుప పెట్టి మనదైనా, తాళం చెవి గురువు దగ్గర ఉంది. మనం పరమపవిత్రులమైతే తాళం ఇస్తారు. అక్కడ అంతా ఆనందమే, సుఖమే. పై గురువైభవం అంతా శ్రీనాన్నగారిలో ఉన్నాయి.

రామకృష్ణ పరమహంసగారి అక్క పరమహంసగారిని చందన పుష్పాదులతో పాద పూజ చేసేవారు. ఒకరోజున వారు ఆమె తలమీద పాదాలు మోపి "నీవు కాశీలో మరణిస్తావు" అన్నారు. మా అక్కగారైన గుండుగొలను సావిత్రి అమ్మగారు శ్రీనాన్నగారిని కూర్చున్నా, లేచినా ఏ పనిలో ఉన్నా రామనామంలా 'నాన్నగారు - నాన్నగారు' అంటూ నిత్యం స్మరణే. ఒకరోజు ఆమె పరుండే గదిలోకి వెళ్ళి 'మీరు ఒక్కరే పడుకుంటారా?' అనగా ఎదురుగా ఉన్న అభయ హస్థాలు గల వారి ఫొటోను చూపిస్తూ మీరు ఉన్నారు కదా! నేను ఒంటరిని ఎలా ఔతాను అనగా నాన్నగారు మాట్లాడలేకపోయారు. శ్రీనాన్నగారు "గురువును నీవు స్మరించలేకుండా ఉన్నప్పుడు గురువు నిన్ను ప్రేమిస్తున్నాడని కొలబద్ద" అన్నారు. ఆ మాటను ప్రమాణంగా ఒక చిన్న సమావేశంలో సావిత్రి అమ్మగారు శ్రీనాన్నగారి పాదాలకు నమస్కరించగా రెండు కాళ్ళు ఆమె తలపై ఉంచి ఆశీర్వదించారు. అరుదైన ఈ సంఘటన భక్తుల హృదయాలను కదిలించింది. మరో అక్కగారు పిప్పర అనసూయమ్మగారు రెండు చేతులు చాచగా ఆ చేతులపై పాదాలు ఉంచారు. శ్రీనాన్నగారు "మీ సాధన నిజమైతే అందరూ భక్తులైన కుటుంబంలో ఉంచుతాడు" అన్నారు. మా అమ్మమ్మగారు సయ్యపరాజు సీతమ్మగారు జ్ఞాని. వారు రమణాశ్రమంలో భోజనశాలలో ఉండగా దగ్గరకు రమ్మని భగవాన్ పిలిచి ప్రక్కన కూర్చోబెట్టుకొని ఆమె విస్తరిలో ఒకు ముద్ద ఉంచారు. శ్రీనాన్నగారుపై ప్రమాణ నిజమనిపిస్తున్నది. మా అమ్మమ్మగారి అవ్యక్త ప్రభావం మా కుటుంబంపై నిండుగా ఉంది. మా గ్రామవాసి అయిలూరి

రామశాస్త్రిగారు మహాజ్ఞాని. ఆంధ్రదేశంలో వారిని దర్శించని పెద్దలు లేరు. రోజూ అర్థవరంలో మా అరుగుమీద సత్సంగం జరుగుతూ ఉండేది. అప్పుడు నా వయస్సు మూడు నాలుగు సంవత్సరాలు మాత్రమే. 1946 సంవత్సరంలో గాంధీ మహాత్ముడు జిన్నూరు నుంచి అర్థవరం రాగా మా తండ్రిగారు నన్ను భుజాలపై పెట్టుకొని దగ్గరగా దర్శనం కలిగించారు. మా గ్రామంలో రామభక్తురాలు మహాజ్ఞాని పూర్వ మాశమ్మగారు ఉండేవారు. ఆ ప్రదేశంలోనే నా పినతండ్రి గారికి రాముడు స్వప్న దర్శనంలో "నాకు ఇక్కడ గుడి కట్టించు" అనగా చందాలు ప్రోగుచేసి గుడి కట్టించారు. శ్రీరామనవమికి అంగరంగ వైభవంగా 108 సారి కావిళ్ళతో పిల్లలతో ఊరంతా తిప్పి ప్రసాదంగా అందరికీ పంచే ఏర్పాట్లు గ్రామ భక్తులు అంతా అన్నప్రసాద వితరణ కూడా ఉంది. అలాగే రామశాస్త్రి నివసించిన శివాలయంలో శివకల్యాణం, కోటి దీపోత్సవం పదివేల మందితో పొరుగూరు గ్రామాల నుంచి వచ్చిన వారికి టేబుల్స్, కుర్చీలు వేసి అరకిలోమీటరు పొడుగులో ఏర్పాట్లు చేసింది మా గ్రామవాసి ఆదినారాయణరాజు నిష్కామంగా పేరు లేకుండా పదిలక్షలు ఖర్చు చేస్తున్నాడు. నాకు పది సంవత్సరాలు వయస్సులో ఆకాశం వంక చూడగా ఈ దేహమేమిటి? ఈ ఇంద్రియాలు ఏమిటి? దేని సహాయంతో ఈ సృష్టిని చూస్తున్నా అసలు 'నేను ఎవడను?' అనే ప్రశ్నలు తరచుగా వచ్చేవి. 1983 సం॥లో ఒక లాయరుగారి ద్వారా భగవాన్ మాట వినిపించింది. నా కుటుంబ సభ్యులు "నేనెవడను?" గ్రంథం చూపారు. భగవాన్ ఫొటో చూచాను. తనువు పులకరించింది. తరువాత శ్రీనాన్నగారు దొరికారు. ఇది మా ఇంటి, గ్రామం యొక్క ఆధ్యాత్మిక కథ.

# స్వవిషయం

3 సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలో ఉండగా ఆయనతో "జ్యోతిష్యం ప్రయోజనం ఏమిటి?" అనగా "ప్రయోజనం ఏమీ లేదు, తీరం ఒకటి ఉందని చెబుతుంది" అన్నారు. అంటే ఈ దుఃఖాలు కూడా తొలగిపోతాయని అర్థం. అరవింద్ "గురువు లభించిన తరువాత జాతకరీత్యా జరిగేవి జరగవు" అన్నారు. ద్రిగ్ గణితం (శంకరాచార్య సాంప్రదాయం) పూర్వ పద్ధతి వైష్ణవ సాంప్రదాయం. అలాగే 'జైమిని' రాముగారి పంచాంగం, శంకరాచార్య లాగర్‌దమ్ లాంటివి సమన్వయం చేసి సెకనులో ఫలితాలను ఖచ్చితంగా చెప్పగలవారు మా దగ్గర గ్రామంలో ఉండేవారు. బంధువులు మరియు మంత్రులు, ముఖ్యమంత్రుల జాతకాలలో నా కుటుంబ సభ్యుల జీవితాలు వారు తేల్చిన లెక్కకు సెకను కూడా తేడా రాలేదు. ఈ జాతకాల పిచ్చ అంటే మొదటలో రోతగా ఉండేది. శ్రీనాన్నగారు అన్నట్లు "రెండుసార్లు ఏడవటం ఎందుకు? వచ్చిన తరువాత ఎలాగూ ఏడుస్తారు కదా! మనకు ఏడుపే పని" అన్నారు. ఫలితాలు ఖచ్చితంగా రావటం ఆసక్తి కలిగింది. మా పెద్ద మనుమడు ఆంజనేయరాజు జాతకం వేయించాను, ఫలితం ఇలా ఉంది "మూడు సంవత్సరాల్లో జలగండం వల్ల మరణిస్తాడు, కానీ గురు అనుగ్రహం మిణుకుమిణుకుమంటూ కనబడుతున్నది, బ్రతికి బయటపడటానికి అవకాశాలు కనిపిస్తున్నాయి అన్నారు. మూడు సంవత్సరాలు రానే వచ్చాయి. భగవాన్ అనుగ్రహ వైభవం గల ఒక గ్రంథం చూసాను, అదే భగవాన్ గురించి తెలిపే గ్రంథం. అందులో అంశం బొంబాయిలో పుణ్యదంపతులకు లేక లేక ఒక అమ్మాయి కలిగింది. అనతికాలంలోనే రెండు కాళ్ళు పోలియోతో చచ్చుబడిపోయాయి, సంపన్నులు ఎంతో వైద్యం చేసినా ఫలితం శూన్యం. ఆవేదనలో ప్రక్క ఇంటి ఆవిడ "రమణమహర్షికి ఉత్తరం రాయండి తగ్గుతుంది" అన్నారు. ఆయన ఏమి చెయ్యగలరు అని నిరాశతో అన్నది కానీ పేగుబంధం కదా! ఒక కార్డు వ్రాస్తూ

మీ అనుగ్రహంతో మా పాప బాగుపడాలని అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను అంది. నాలుగు రోజులకు భగవాన్‌కు అందింది. భగవాన్‌కు వ్రాసే ఉత్తరాంశం వారికి ఒకరు తెలపడం అక్కడ రివాజు. కార్డులోని విషయాలు చదువగా భగవాన్ "సరి సరి" అన్నారు. సరిగా ఆ రాత్రి బొంబాయిలో ఉన్న పాపం మంచం దగ్గర ప్రత్యక్షమై పాపను లేపి "మీ అమ్మ దగ్గరకు వెడదామని చేయి పట్టుకొని నడిపించి తీసుకొని వెళ్ళి అమ్మను లేపగా అలా చేయగా తల్లికి పట్టరాని అమితాశ్చర్యం 'నీవు ఎలా నడచి వచ్చావమ్మా' అనగా గోచీ పెట్టుకొన్న ఒకాయన తీసుకొని వచ్చారు అనగా లైటు వెయ్యగా ఎవరూ లేరు. కార్డులో ప్రార్థన ఫలితమే. భక్తి ప్రపత్తులతో తిరువణ్ణామలై వెళ్ళి భగవాన్‌కు నమస్కరించారు. పూర్వ జన్మ సంబంధం ఏమిటో భగవాన్‌కే ఎరుక. నేను ఈ అంశం చదువగా కళ్ళ నుండి ధారగా కన్నీళ్ళు రాలాయి. మరో పేజీ చదవేక ఇక ఈ దయచాలు రేపు మరో పేజీ చదువుదామని భగవాన్ ఫొటో చూస్తూ మరల కన్నీళ్ళు కార్చాను. బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్ళాను. పెద్ద నీళ్ళ గోలెంలో నా మనుమడు మునిగి తల క్రింద, కాళ్ళు పైన ఆడిస్తున్నాడ. ఒక్క పది సెకనులు ఉంటే ప్రాణం పోయేదే. బయటకు తీసి తాగిన నీళ్ళు కక్కించగా స్థిమిత పడ్డాడు. కారణం లేకుండా బాత్‌రూమ్‌కి వెళ్ళే ప్రేరణ ఎవరు నాకు కలుగజేసారు? భగవాన్ కరుణ కాదా! మగ పిల్లలు లేని ఆ దౌహిత్రుడు ఆంజనేయరాజు బ్రతికించారు అని కుంటుబం అంతా ఆనందపడ్డాము. సాధారణంగా జ్యోతిష్కులు చెడ్డ చెప్పరు కాని నాకు అది మరింత విశ్వాసాన్ని కలిగించింది భగవాన్‌పై. తదుపరి అతనికి తిరుగు లేదు. అంతటితో ఆగలేదు కరుణ. శ్రీనాన్నగారి ద్వారా జరిగేవి ఎన్నో ఉన్నాయి చూడండని మనవి.

4 కృష్ణానది మొదట ప్రవహించే భాగంలో మేకాదాటులో దత్తాత్రేయ మఠంకు చెందిన ఒక మహాగురువు పూర్వకాలంలో ఆశ్రమం నిర్మించుకొని వుండేవారు. ఒక ఇల్లాలు అనారోగ్యంతో చావుకు సిద్ధంగా ఉన్న ముప్పది

సంవత్సరాల వయస్సు గల భర్తను తీసుకొని వచ్చి స్వామితో అయ్యా నా భర్త రోగాన్ని నయం చేసి నా పశుపు కుంకుమలు నిలబెట్టమని కాళ్ళపై పడి ప్రాధేయపడగా... స్వామి డాక్టర్లు ఏమన్నారు అనగా 'బ్రతుకడు. ఈ రోగానికి వైద్యం లేదు' అన్నారు. అయితే నేను మాత్రం ఏమి చెయ్యగలను అని అంటుండగానే భర్త మరణించగా స్వామి ఆమెతో నీవే నదీ తీరంలో అంతిమ సంస్కారం జరిపించు అని వస్తుసంభారాలు అన్నీ సమకూర్చగా అగ్నిహోత్రం అంటిస్తూ ఉండగా చనిపోయిన వ్యక్తి లేచి కూర్చున్నాడు 'స్వామీ! ఎందుకు బ్రతికించారు' అనగా "ఖర్మను ఎవ్వరూ తప్పించలేరు. ఆది ఈశ్వర చట్టం. ఈ జన్మలో ముప్పది సంవత్సరాలు బ్రతకాలి, వచ్చే జన్మలో అతడు డభై సంవత్సరాలు బ్రతకాలి. ఈ జన్మ వయస్సు పై జన్మ వయస్సులోకి మార్చాను అంతే" అన్నారు. మరి ఈ ప్రక్రియ వల్ల అతనికి ఏమి ప్రయోజనం అంటే అనుభవజ్ఞులు, పెద్దలు 'అన్ని జన్మలలోను సద్గురువు లభించటం కష్టం, అంతే కాదు సద్గురువుకు జన్మను పొడిగించే అధికారం ఉంది' అంటారు.

నా ధర్మపత్ని రంగమ్మ జీవితం జాతకరీత్యా నాకు యాబది సంవత్సరాలు వయస్సులో మరణించాలి. కానీ నాన్నగారు నా విషయవాసనలు అంతరించటానికి ఎనిమిది సంవత్సరాలు పడుతుందని ఎనిమిది సంవత్సరాలు పొడిగించారు. జాతకంలో ఆమె రక్తసంబంధమైన వ్యాధి వల్ల మరణిస్తుందని తెలిపింది యదార్థమైనది. అలాగే నా చిన్న కుమార్తె శాంతకుమారి పసుపూ కుంకుమ ఐదు సంవత్సరాలే అని నేను నాన్నగారికి విన్నవించగా హృదయంపై చేయి వేసి అది జరుగదులెండి అన్నారు. సరిగ్గా ఐదు సంవత్సరాలు నిండగా యజమాని రోడ్డు ప్రమమాదంలో తలపెంకు లేచిపోగా సమీప పట్టణానికి తీసుకొని వెళ్ళగా ఆపరేషన్ చేసే డాక్టరుని నేను అడిగాను పరిస్థితి ఏమిటి? అనగా ఆయన 99.99% బ్రతకటం కష్టం. తుమ్ము, దగ్గు రాకపోతే ఈ రాత్రికి, రేపు హైదరాబాద్ తీసుకొని

వెళ్ళండి అనగా ఆ రాత్రి గడిచింది. ఈ వార్త నా కుమార్తె అతని భార్యకు భీమవరం వెళ్ళి చెప్పగా ఆమె అంది నాకు రాత్రి ఒక కల వచ్చింది, ప్రమాదంలో ఈయన రక్తపు మడుగులో ఉన్నట్లు భీకరనమైన కలకు నేను ఎంతో కలవరించాను, రాత్రి మూడుసార్లు శ్రీనాన్నగారు కలలో కనిపించి అభయహస్తాలతో "నేను ఉన్నాను, అమ్మా నీకు ఏ కీడు రాదు" అన్నారు. ఆమె చెప్పిన వార్త నాకు, ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. జాతకరీత్యా జరిగేదానిని కాలదన్నారు, నాకు ఇచ్చిన మాటను గురుదేవులు నిలబెట్టుకున్నారు. చిన్న వయస్సు గల కొడుకు తన జీవితం ఏమి కావాలి ఇది జరిగి పాతిక సంవత్సరాలు కన్నా ఎక్కువ కాలంలోనే జరిగింది. అలా జాతక రీత్యా నా ఆయుష్య డబ్బది ఐదు సంవత్సరాలు. దాన్ని పొడిగిస్తున్నారు. ప్రతిఫలాపేక్ష లేని పవిత్రమైన ఉపాసకులు మీరు తొంభై లేదా వంద సంవత్సరాలు జీవిస్తారు అంటున్నారు. అలాగే మరో కుటుంబ సభ్యుల జీవితాలను పొడిగిస్తున్నారు. కంటికి రెప్పలా కాపాడుతున్న ఈ సంఘటనలు కోకొల్లలు. గురుదేవులు సత్యపాలకులు కదా!

5 నా జాతకరీత్యా 'సరిహద్దులలో ఎప్పుడూ తగువులు ఉంటాయి' అని ఉంది. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న భక్తులకే కష్టాలు. కుంతీదేవి పరమాత్మతో "నిన్ను స్మరించుకోవాలి అంటే ఎప్పుడూ కష్టాలు పెట్టు" అంది. అరవింద్ "కష్టాలు నీవు కోరుకోనక్కరలేదు వచ్చిన కష్టాలు ప్రశాంతంగా అనుభవించండి" అన్నారు. వివేకానంద "హంసతూలికా తల్పం మీద కూర్చుని కష్టం అంటే ఏమీ తెలియని వానికి సత్యానుభవం ఎన్నటికీ తెలియదు" అన్నారు. శ్రీనాన్నగారు "కష్టాలు - వరాలే" అన్నారు. రామకృష్ణుడు "సమాజంలో కొందరు భల్లూకాలు, మేకవన్నె పులులు, కపటనారాయణులు ఉంటారు. వీరు భక్తుల మీద పడి పీడిస్తారు. ప్రారబ్ధాన్ని క్షయం చెయ్యటానికే ఆ ప్రయత్నంలో కరవకూడదు 'బస్' అని అనాలి" అన్నారు. నా పొలం సరిహద్దుల్లో ఒక కపటి కొంత కొంత స్థలాన్ని ఆక్రమించటం

కోసం కత్తులతో వచ్చాడు. నేను, నా మనుషులు ఎదుర్కొన్నాము. ఆ గలాటాలో నా శరీరంపై చిన్నపాటి గాయాలు అయినవి. గ్రామపెద్దలు రాళ్ళు వేశారు, తదుపరి జిన్నూరు వెళ్ళాను, శ్రీనాన్నగారు స్నానం చేసి హాలులో లుంగీ కట్టుకోబోతున్నారు. నన్ను చూసి ఆత్రంగా లుంగీ తాత్కాలికంగా చుట్టుకొని "రామకృష్ణంరాజుగారు మీ గురించే ఆలోచిస్తున్నాను, మీరు వచ్చారు సంతోషమని శరీరాన్ని తడిమారు. పై సంఘటన ఎలా గ్రహించారు అంటే విశ్వ మనస్సు ద్వారా. అలాగే మరో ప్రాంతంలో ఉడుకుమోతు తనంతో తమ ఆటసాగలేదని దూషణపర్వాలు మొదలుపెట్టి వెళ్ళిపోయారు. అధికారులు తమ పనిని సాఫీగా పూర్తిచేసారు. ఆ సందర్భంలో వాళ్ళు ఎంత కవ్వించినా సహనం వహించాను అని గొప్పగా భావించాను. జిన్నూరులో సత్సంగములో "మీరు ఎంతో సహనం వహించాను అని గొప్పలకు పోతారు, ఆ సహనం వహించే శక్తి మీ గురువే కల్పించాడు. వాళ్ళ దూషణ పర్వం కూడా మీ గురువే కల్పించాడు" అనగా ఇంటికి వచ్చాక వారి పాదాలను ఆశ్రయించాను. తిట్టించానంటారా? రేపు కొట్టిస్తారా? అని మనస్తాపం కలిగింది. తదుపరి సమావేశంలో "అబ్బే తిట్టించను, కొట్టించను అని అంటూ గత జన్మలలో సంస్కారాలతో జీవించటం జరిగింది కాబట్టి అవి రహితం చెయ్యటానికే అని అభయమిచ్చారు. గురువు శిక్షించేది ఆయనే – లాలించేది ఆయనే అనేది సత్యమైనది నా విషయంలో. 1995 సంవత్సరం రెండవ పంట విరామం ప్రశాంతంగా ఉంది. రోజూ 12 గంటలు ధ్యానంలో గడిపాను. అబ్బా ఇన్ని గంటలు ధ్యానంలో ఉన్నాను అనుకొన్నాను. తదుపరి సమావేశంలో "రోజూ 12 గంటలు ధ్యానంలో ఉంటున్నాను అనుకొంటారు మీరు ఏమీ చెయ్యలేరు. మీ గురువే చేయిస్తాడు మీరు చేసారని మురిసిపోతారు" అన్నారు. ఇక నేను ఎక్కడ ఉన్నాను? అందుకే పెద్దలు అంటారు "సద్గురువు పరిధిలోకి రావటమే మన పని, తరువాత గురువే సాధన – గురువే సాధ్యం" అంటారు. శాంతి ఆశ్రమంలో ఒక పండిత అహం

బ్రహ్మర్షి శ్రీనాన్నగారితో "మీ భక్తులకు ధ్యానం చెయ్యటం అలవాటు చెయ్యండి" అని సలహా ఇయ్యగా "వాళ్ళు ఏమి చేస్తారులెండి, వాళ్ళ తరపున నేనే చేస్తాను" అన్నారు. శ్రీనాన్నగారు "ఆధ్యాత్మిక మార్గంలో శిష్యుడి కన్నా గురువే ఎక్కువ కృషి చేయాలి. గురువు శిష్యునిచే కొద్ది సాధన చేయిస్తాడు, అంతా గురువే చేయిస్తాడు. పెద్ద వటవృక్షం నరుకుతున్నప్పుడు దాదాపు నరికిన తరువాత కాస్త దూరంగా నిలబడితే వృక్షం ఫెళఫెళమనే శబ్దం చేస్తూ దానంతట అదే కూలిపోతుంది. గురువు మీ అహంకారమనే వృక్షాన్ని నిర్ణీతకాలంలో నరుకుతూ కూల్చివేస్తాడు" అన్నారు. ఒక గురువు వద్ద శిష్యుడు "అయ్యా! ధ్యానం చెయ్యలేకపోతున్నాను" అంటే "ఆ తప్పు నాది నీది కాదు" అని కన్నీరు పెట్టుకొనే ప్రేమ గురువులు ఉన్నారు. ఆ కోవకు చెందినవారే శ్రీనాన్నగారు. శంకరాచార్యులవారు "24 గంటలు శిష్యుని క్షేమాన్ని చూచేవాడే నిజమైన గురువు" అన్నారు. శ్రీనాన్నగారు "మీ గురువును రోజుకు ఐదు నిమిషాలు తలచుకోండి ప్రేమగా 24 గంటలు మిమ్ములను తలచుకొంటాడు". 1956 సంవత్సరానికి పూర్వం చెన్నైలో మనుషులు లాగే రిక్షాలు ఉండవి. ఒక సినిమా సంఘటన ఉపమానంగా మీ ముందు ఉంచుతున్నాను. ఉపమానం అంటే చీకటిలో ఉన్న వస్తువు టార్చిలైటు వెయ్యగా వస్తువు లభ్యమవుతుంది. ఒక సినిమాలో నేను చూచిన సన్నివేశాన్ని మీకు తెలుపుతున్నాను మన్నించండి, సినిమా గొడవ ఏమిటి అనుకోకండి. కథాంశం రేలంగి వెంకట రామయ్య, గిరిజ హాస్యనటులు. గిరిజ లాగే రిక్షాలో కూర్చుని చెరుకుగడ తింటూ గమ్యం "ఎంతెంత దూరం – ఎంతెంత దూరం" అనగా రిక్షా లాగే రేలంగి రొప్పుతూ చెమటలు కక్కుకొని గునుపు పరుగులో లాగుతూ "క్రోసుడు క్రోసుడు దూరం" అంటారు. అలాగే శ్రీనాన్నగారి తీపి అమృత వచనాలు తలచుకొంటూ ఆత్మానుభవం ఎప్పుడు? ఇంకా ఇంకెంతదూరం అనుకొంటాము. గురుదేవులు కూడా "ఈ సమావేశంలో అందరూ తరిస్తారు, ఈ జన్మ లేదా పై జన్మ అంటూ ఊరిస్తారు.

మన సమయాన్ని అంతా ప్రకృతి విషయాలలో గడిపితే తప్పు ఎవరిది? ఐదు నిమిషాలైనా తండ్రిని తలచాలి కదా!

6 ఒక స్వామిని ఒక ఇల్లాలు "అయ్యా మా ఇంటికి వచ్చి మీ పాదం మోపాలి" అని ప్రార్థించగా వెళ్ళారు. (ఇదే మాటను శ్రీనాన్నగారిని చాలామంది తరచుగా ప్రార్థించినదే). స్వామి వెళ్ళి అరుగు మీద కూర్చున్నారు. వారికి పాలు కాద్దామని ఇల్లాలు పాలు కాచి, ఒక గ్లాసులో పోస్తూ ఉండగా మీగడ గ్లాసులో పడింది. దానికి ఆమె 'అయ్యో' మీగడ పడిందనే వేదన పడింది. గ్లాసును స్వామి వద్ద పెట్టింది. వేడిగా ఉందని తీసుకోవటం లేదనుకొంది. కొంత సమయానికి "అయ్యా పాలు త్రాగి నన్ను అనుగ్రహించండి" అనగా "అమ్మా ఈ పాలలో చక్కెర కలిపావు, అయ్యో కూడా కలిపావు, సాధువు ఈ పాలను తీసుకోరు" అని వెళ్ళిపోయారు. 1986 సంవత్సరం శ్రీనాన్నగారికి పళ్ళు ఇద్దామని మార్టేరులో ఒక అత్తం చక్కెరకేళి పళ్ళు కొన్నాను. రేటు ఎంత? అనగా 30 రూపాయలు అన్నాడు. 'అయ్యో' మొన్న వారం 15 రూపాయలే కదా! అనగా గాలి వాన వల్ల చెట్లు కూలాయి అన్నాడు. సాధారణంగా నేను ఇచ్చిన పళ్ళు ప్రేమతో తీసుకొని కొన్ని ప్రసాదంగా ఇస్తారు. ఆరోజు ముట్టుకోకుండా "భగవాన్ ఫొటోవద్ద పెట్టండి" అన్నారు. ఏమిటి ఈ మార్పు? ఎక్కడ పొరపాటు జరిగింది? అని పశ్చాత్తాపం పొందగా "అయ్యో" గుర్తుకు వచ్చి సమాధానపడ్డాను. విశ్వ మనస్సు ద్వారా అన్నీ గ్రహిస్తారు. తదుపరి కాలంలో నేను పళ్ళు ఇయ్యకపోయినా సంచులతో ఎన్నో పళ్ళు ఇచ్చేవారు. ఆ ప్రేమను వెలగట్టలేము.

సూరి నాగమ్మగారు భగవాన్‌ని మొదట దర్శించినప్పుడు కళ్ళు మూసుకుని ఒక నిమిషం తరువాత ఆమె వంక చూచారు. అది ఉన్మీలత సమాధితో చూచే చూపు. అటే చెల్లాచెదురుగా ఉన్న మనసు ఆత్మవైపు కేంద్రీకరించి చూచే చూపు.

వెంకటేశ్వర స్వామి స్తోత్రంలో 'ఉన్నీల నేత్రాయ' అని ఉంది. ఆశ్రమంలో నన్ను శ్రీనాన్నగారు అలా చూచి వెన్నుతట్టి రామకృష్ణంరాజుగారు బాగున్నారా? అనేవారు. అది మరపురాని మరువలేని ఆనందం. ఒకో సమయంలో భక్తులను అలాగే చూస్తారు.

మార్టేరులో రెడ్డిగారి ఇంటి వద్ద సమావేశంలో నా కళ్ళలోకి తీవ్రంగా చూస్తున్నారు నాన్నగారు. నా కంటిలో సూదులు గుచ్చుకొని బాధించి వారి పాదాలనే ఆశ్రయించాను. అది బహుశా శక్తిపాతం కావచ్చు. రెండవ సత్సంగంలో "మీ గురువు మీ నేత్రాల వంక చూస్తే మీరు తట్టుకోలేరు, కంటిలో సూదులు గుచ్చినట్లు ఉంటాయి. పాదాల మీదే మీ దృష్టి పెట్టాలి" అన్నారు. అర్హత లేనప్పుడు శక్తిపాతం భరించలేము.

1988 సంవత్సరంలో పదిహేను రోజులు రాత్రి పగలు నిద్రలేదు. శ్రీనాన్నగారితో విషయం చెప్పి మంత్రదీక్షను కోరాను. నా మనస్సులో భగవాన్ లేదా అరుణాచల శివ లేదా నాన్నగారి నామం చెబుదామనుకొంటూ ఉంటే 'ఆగండి' అని తన హృదయంపై చేయి వేసి ఒక నిమిషం తరువాత అనండి "ఓం నమో వేంకటేశాయ" అని ముమ్మారు పలికించి రాత్రి 9 గంటలకు నిద్ర పట్టేస్తుంది అన్నారు. ఆ మంత్రం నా గత జన్మ అనుబంధమా, శక్తివంతమైనదా! స్వామికే తెలియాలి. ఆ రాత్రి తెల్లవారే వరకూ మెలకువ రాకుండా గాఢనిద్ర పట్టింది.

1989 సంవత్సరం ఆకీవీడులో ఒక ఆడిటోరియంలో శ్రీనాన్నగారి ప్రవచనం జరుగుతోంది. పెద్ద మబ్బులతో గాలి విపరీతంగా వీస్తున్నది. బయటకు వస్తే మా గ్రామం దిశగా అది వెళుతోంది. అబ్బా పది ఎకరాలు కోసి ఆరిన వరి పంట నేలపాలైనదనే దిగులుగా తిరిగి హాలులో ప్రవేశించాను. శ్రీనాన్నగారు అన్నారు 'కొందరు మబ్బులు, గాలి చూచి భయపడతారు, అక్కడ ఏమీ జరుగదు' అన్నారు.

ఇంటికి వెళితే చుక్క వాన లేదు.

శ్రీనాన్నగారు 'రుణం ఉంటే మనస్సు చలిస్తుంది' అన్నారు. శ్రీనాన్నగారితో అయ్యా రుణభారం ఎక్కువగా ఉంది ఒక ఎకరం అమ్మాలి అనుకొంటున్నాను అనగా 'అవసరం లేదు తీరిపోతుంది' అన్నారు. నాలుగు పంటలు అధిక దిగుబడితో రుణం తీరిపోయింది. శ్రీనాన్నగారు 'గురువు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కాపాడాలి శిష్యుడను' అన్నారు. అది నిజమైనది. ఇది చాలామందికి అనుభవ విషయమే. సిరిసంపదలు ఒసగే చిన్మయరూపులు కదా!

7 శ్రీనాన్నగారికి 1957వ సంవత్సరంలో ఒక రాత్రి ఒక స్వప్నం వచ్చింది. ఇది శ్రీనాన్నగారి జీవిత చరిత్రలోనిదే. "చేతిలో కర్ర వున్న వృద్ధ వ్యక్తి వచ్చి నన్ను మంచం మీద నుంచి లేపి కుడి బుగ్గపై మూడుసార్లు ముద్దు పెట్టుకొన్నారు. నేను వద్దని వారించినా నా వంక జాలిగా చూచి 'ప్రస్తుతానికి సరిపోతుందిలే' అని వెళ్ళిపోయారు. కలలో కనిపించిన వ్యక్తి భగవాన్ అని తదుపరి పరిణామాల్లో గుర్తించాను. నన్ను కావాలనే తీసుకొన్నారు" అన్నారు.

నాకు దిll 26-08-2019 తేదీ ఉదయం 5 గంటల నుండి 6-30 గంటల వరకూ భగవాన్ రమణులు నాకు స్వప్న దర్శనంలో మొదట కుడిచేయి పట్టుకొని నడిపిస్తూ ఎన్నో జ్ఞాన విషయాలు తెలిపారు. ఎలా ఉన్నారు? ఏమి చేస్తున్నారు? సావిత్రి అమ్మగారు (మా గుండుగొలను అక్క) బాగా ఉన్నారా? అంటూ ఉండగా పెద్ద ఏనుగుల గుంపు భగవాన్‌ని సమీపిస్తున్నాయి. భక్తులు పారిపోయారు. నేను భగవాన్‌ని అంటిపెట్టుకునే ఉన్నాను. ఏనుగులపై భగవాన్ చేయి అడ్డం పెట్టగా గుంపు ఆగి వెనుకకు వెళ్ళిపోయినాయి. ఒక ఏనుగు పిల్లను పెద్ద ఏనుగు హింసపెడుతూ ఉంటే 'అలా చెయ్యకు భవిష్యత్తులో నీకు దానితో దగ్గ బంధుత్వం ఉంటుంది' అనగా ఆగిపోయింది. ఇక్కడ పెద్ద చెట్టు ఉండేదే, ఈ

గూటిలో పుస్తకాలు ఉన్నవి' అని ఒక మార్గాన్ని చూపించారు. ఏ జ్ఞాని అందరి భక్తులను దగ్గరకు తీసుకోడు. చైతన్యాన్ని చైతన్యం దగ్గరకు తీసుకోవటం ఏమిటి? అది సహజంగా పరిణామ స్రవంతిలో దగ్గర అవుతారు?" అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వెంటబడ్డారు, నేను భగవాన్ నడకను అందుకోలేకపోయాను. ఎలాగో వారి సమీపానికి వెళ్ళి 'అయ్యా! మీ అనుగ్రహం నాకు ఎప్పుడు కలుగుతుంది?' అనగా దానికి మౌనంగా ఉండిపోయారు. శ్రీనాన్నగారు "అనుగ్రహం ఇచ్చేప్పుడు చెప్పటం దేనికి?" అన్నారు. బహుశా అదే కావచ్చు. భక్తులకు భగవాన్ ఉపదేశం ఇస్తూనే ఉన్నారు. బహుశా అది స్కందాశ్రమం ప్రాంతం కావచ్చు, అంతా కలయ దిరుగుతూనే మాట్లాడారు. ఇలా గంటన్నర సమయం వారి దివ్యదర్శనం, భాషణలను విన్నాను. తిథి సర్వఏకాదశి. తెల్లవారుజామున వచ్చే కలల్లో కొన్ని ఫలిస్తాయంటారు పెద్దలు. ఇది అంతా నా మైండ్ యొక్క క్రియేషనా? అనుగ్రహం ఉందా? అని సమాధానం కోసం శ్రీనాన్నగారిని ప్రార్థించాను. అది ఎలా సాధ్యం? ఆయన శరీరంలో లేరు కదా! అనుకోవచ్చు. దానికి అరవింద్ 'మనస్సు కంప్లీట్ సైలెన్సు అయితే గైడెన్సు మీకు లోపలి నుంచే వస్తుంది' అన్నారు. అవధాన ప్రక్రియకు ఇదే మూలం. 1987 సంవత్సరంలో శ్రీనాన్నగారు "మీరు నిర్మల స్థితిలో ఉంటే నీ గురువే నీకు సందేశం ఇస్తాడు. అది సమగ్రంగా ఉంటుంది, స్పష్టంగా ఉంటుంది" అన్నారు. శ్రీనాన్నగారి దయవల్ల ఇది నాకు అనుభవైకవేద్యమైనది. వారు శరీరం ఉన్నప్పుడు, లేనప్పుడు మా ఇంటి వద్ద నిత్య జీవితంలో సంకటాలను వారికి నివేదించటం వారు ధర్మబద్ధమైన సందేశమియ్యటం మామూలే. ఇది కొందరు కాదనుకొన్న నా స్థితి వచ్చినప్పుడు మీరు కాదనలేరు. పై స్వప్నం నుంచి శ్రీనాన్నగారిని అడిగాను దానిపై "ఇది ముమ్మాటికీ అనుగ్రహమే. దాని గురించి ఉబ్బితబ్బిబ్బు అవ్వకండి" అన్నారు. 'క్వైట్'గా ఉండమని తెలిపారు.

పాపం వల్ల ఏమిటో సందేహాలు ఇంకా తరుముతూనే ఉండగా సమాధానం

కోసం వేల్పూరు యోగి గారికి ఈ విషయం నివేదించాను. పలకపై ఇలా వ్రాసారు "గత జన్మలో మీరు భగవాన్ దర్బారుకు చెందినవారే. మీలో అంతర్యామి భగవాన్. భగవాన్ కృపావీక్షణం మీపై పూర్తిగా ఉంది. స్వప్నంలో ఏనుగుల గుంపు అన్నారు దాని అంతరార్థం మీ ప్రారబ్ధం ఎంత బలీయమైనా మీ మీద విజృంభించినా వారి కృపావీక్షణంతో ఆపేయగలదని అందులో భావన. భగవాన్ బిడ్డలను ఆయన ఎన్నటికీ వదలరు. ఇది మీ అనుభవ దర్శనం" అన్నారు.

సంశయాలు పటాపంచలమైనవి. 1987 సంవత్సరం మార్చిలో నాన్నగారిని ఇంటి వద్ద కలిసాను. వారంతట వారు ఇలా "మీరు తరిస్తారండి" అన్నారు. ఇంటికి వచ్చాక అందరం తరించే వాళ్ళమే ఈ జన్మలోనా అని అడగలేక మరలా అడిగితే బాగోదని సతమతమైపోయి పది రోజుల తరువాత వారి ఇంటికి వెళ్ళగా శ్రీనాన్నగారు నన్ను ఉద్దేశించి "మీరు ఏ జన్మలోనో అనుకోకండి ఈ జన్మలోనే తరిస్తారు" అన్నారు. వారికి విశ్వమనస్సు ఉందని మొదటిసారిగా గుర్తించాను.

అదే కాలంలో వేల్పూరు యోగిగారు నేను అడగకుండానే మీరు ఈ జన్మలోనే తరిస్తారు. మీ జీవిత చరమాంకంలో మీ శరీరం ఎంత కృంగదీసినా ఇసుమంత అయినా చలించరు" అన్నారు. వ్యవసాయ కూలీలు ఇబ్బందుల వల్ల అమరకం ఇచ్చేస్తాను నాన్నగారు అంటే "ఆపని చెయ్యకండి మరుజన్మ వస్తుంది" బుగ్గలో చేయి వేసి మరీ హెచ్చరించారు. "ఒంటరి జీవితంలో ప్రారబ్ధము ఎన్ని దెబ్బలు కొడుతుందో తెలియదు" అంటారు శ్రీనాన్నగారు. ఆ క్రమంలోనే శ్రీనాన్నగారు శరీరం వదిలిన తరువాత రావులపాలెం మండలం గోపాలపురంలో తాతయ్యగారి ఆశ్రమంలో పాకలపాటి గురువుగారి తన ప్రతినిధిగా ఎన్నుకొని ఆశ్రమం నడుపుతున్న వారిని కలుద్దామని భక్తులు భాస్కర్‌రాజుగారి ప్రోత్సాహంతో వెళ్ళాను. స్వామి చరిత్ర చదివాను. గతంలో ఎంతో ప్రభావితం అయ్యా. భగవాన్ అన్నారు

"మహాత్ముల చరిత్రలు చదవటం వల్ల వారి అనుగ్రహానికి పాత్రులు అవుతారు" అని. స్వామిని "అయ్యా ఈ మనో పరిధి నుండి ఎప్పుడు బయటపడి స్వేచ్ఛా మండలంలో ఎప్పుడు ప్రవేసిస్తాను" అనగా మూడు సంవత్సరాలు అన్నారు. అది 2021 జూన్ నెలలో వచ్చే పౌర్ణమినాటికి సంభవమవుతుంది. పంచెజామారు ప్రసాదం డబ్బు ఇచ్చి అక్షింతలు వేసారు. పై భగవాన్ మాట యదార్థమైనదని అనిపించింది. పతివ్రతా స్త్రీ - భర్త, బంధువులను, స్నేహితులను అందరినీ గౌరవిస్తుంది. కానీ తన భర్తకు ఇచ్చే స్థానం ఎవ్వరికీ ఇయ్యదు. అలాగే మహాత్ములు అందుబాటులో ఉన్నప్పుడు దర్శించటం తప్పు లేదు. మన గురు దేవులకు ఇచ్చే ప్రాధాన్యతను ఎవ్వరికీ ఇయ్యలేము. మన గురువు మన గురువే. పద్మపాదులు దేశయాత్రకు వెళుతూ ఆదిశంకరాచార్యులకు విన్నవించగా "వెళ్ళు. ఎక్కడైనా మహాత్ములు ఉంటే దర్శించు" అన్నారు. ఆయనే మహాత్ముడు ఆ మాట అర్థం జ్ఞానుల దర్శనం ఊరికే పోదు. రామచంద్రమూర్తి అడవికి వెళుతూ తల్లితో 'వనవాసం వల్ల మహాత్ముల దర్శనమౌతుంది కదా!' అన్నారు.

## స్వవిషయం

8 నా చిన్న కూతురు శాంతకుమారికి మగపిల్లవాడు కలిగాడు. శ్రీనాన్నగారిని ఏ పేరు పెట్టమంటారు అని అడిగాను. "మొదట తండ్రికి ఇష్టమైన వారి పేరు పెట్టుకొని చివర 'కుమార్' అని చేర్చండి" అన్నారు. కుమార్ అంటే చెడ్డను తొలగించేవాడని అర్థం. కుమారస్వామి అని. ఎదిగి స్కూలుకు వెడుతున్నాడు. చిరాకు, పరాకు, కోపం. శ్రీనాన్నగారి సమక్షంలోకి తీసుకొనివెళ్ళి 'ఎంత చెప్పినా చదువు రావటం లేదు' అని తల్లి అనగా కుమార్ తలపై చేయి పెట్టి "వీడు మహామేధావి అవుతాడు. చూస్తూ ఉండండి" అన్నారు. మరుసటి రోజు తల్లి పాఠం చెప్పగా ఏకసంతాగ్రాహిగా అప్పచెప్పాడు. తల్లి "ఏమిటిరా! రోజూ ఎన్ని సార్లు చెప్పినా తిరిగి

చెప్పలేకపోయావు. ఈ రోజు ఏమిటి? ఒకేసారి చెప్పావు" అనగా "భగవాన్ తాతయ్య (శ్రీనాన్నగారు) నిన్న నెత్తిమీద చేయి వేసారు" అన్నాడు. గడుగ్గాయి ఆ రోజు నుంచి స్కూలు వార్షికోత్సవాల్లో 'ఓ గాడ్ బ్యూటీఫుల్' పాట పాడి మొదటి బహుమతి పొందాడు. నాట్యవిన్యాసాల్లో, చదువుల్లోను ఫస్టు మార్కులు వచ్చేవి. ప్రస్తుతం విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా బాగా రాణిస్తున్నాడు. ఇండియా వచ్చిన వెంటనే శ్రీనాన్నగారిని దర్శిస్తాడు కృతజ్ఞతలతో. ఆ సమయంలో శ్రీనాన్నగారు "అర్థవరం మీ తాతయ్యను కలిసావా?" అనగా "ఫోన్ చేసాను. మీరు ముఖ్యం కదా అని ఇలా వచ్చాను". ఈ విషయంలో శ్రీనాన్నగారు ప్రవచనంలో ప్రస్తావిస్తూ "అది అతని పూర్వజన్మ పుణ్య సంస్కారం" అన్నారు. నా మునిమనుమడు రఘువీర వర్మ అన్నప్రాసనలో మొదట గీతను పట్టుకోవటంతో శ్రీనాన్నగారు 'వెరీగుడ్' అని మూడు సార్లు అని మంచివాడవు అవుతావు అనగా శ్రీనాన్నగారి పాదాలను కళ్ళకద్దుకోవటం, చేతులతో తలను పట్టుకోవటం అదేపనిగా చేస్తున్నాడు మానటంలేదు దానిపై ఆయన "చాలు లేరా. చాలు" అని అన్నారు. వారి పాదాలను ముద్దు పెట్టుకోవటం ఎవరు నేర్పారు? పూర్వజన్మ సంస్కారం అనుకోవాలి. గురుగీతలో శివుడు పార్వతికి తెలిపినది "గురు పాద పంచకంపై దృష్టి నిలపకపోతే ఎంత యశస్సు ఉన్నా ఎంత ధనమున్నా ఏమిటి ప్రయోజనం?" అని ముమ్మాటు అంటారు. ప్రతీరోజూ కొందరు ఈ అష్టకాన్ని పారాయణం చేస్తారు పూజలో. నా అనుభవం కొన్ని సమయాల్లో శ్రీనాన్నగారి అరిపాదాలు లేత గులాబీ రంగులో ఉండేవి. ప్రతీ భక్తుల పూజా మందిరాలలో ఈ పాదుక ఫొటోలు ఉంచుకొంటాకు. ఇదే ప్రపత్తి మార్గం.

శ్రీనాన్నగారి ప్రవచనంలో "సూరదాసు ఒక భక్తుని సాయంతో అడవి మార్గం గుండా ప్రయాణం చేస్తూ ఉండగా చీకటి పడటం వల్ల శిష్యుడు సూరదాసును ఒక కొండ గుహలో ఉంచి ద్వారం రాళ్ళతో మూసి తాను బయట ఉన్నాడు. ఉదయం రాళ్ళు తియ్యగా "సూరదాసు రాత్రి అంతా ఎక్కడ ఉన్నావు" అనగా "వృత్తాకారంలో

ఒక గీతను గీసి కృష్ణునికి విన్నవించాను పులులు రాకుండా చూడమని" అనగా సూరదాసు ఎందుకు కృష్ణుడిని నిద్రలేకుండా శ్రమపెట్టావు. మన రక్షణలో మనం ఉండటం ధర్మం కదా!" అన్నారు. "అది మధురమైన ప్రేమ" అన్నారు శ్రీనాన్నగారు.

గుండుగొలను మా అక్కగారి ఇంటికి వెళ్ళినప్పుడు నా పరసు బీరువాలో పెట్టమని మరుసటి రోజు పరసు అడిగితే 'ఉండు అర తాళం ఎక్కడ పెట్టానో గుర్తు రావటం లేదు' అని ఒక పావుగంట శ్రమపడి నాన్నగారి ఫొటో వంక చూస్తూ 'తండ్రీ! తాళం ఎక్కడ పెట్టానో గుర్తు చేయరా' అనగా వెంటనే గుర్తుకు వచ్చి పరసు తీసి ఇస్తూ ఉంటే 'ఎందుకమ్మ నాన్నగారిని శ్రమ పెట్టటం' అన్నాను.

అక్షరమణమాలలో 78 ద్విపదలో నిస్సహాయుణ్ణి అయినప్పుడు మాత్రమే నిన్ను వేడుకొనే మూర్ఖుణ్ణి నన్ను వంచింపక కరుణించు అరుణాచలా!

కానీ సంకటంలోనే వెంకట రమణుడు సాయం అన్నట్లు నేను ఒక వృద్ధాశ్రమంలో ఉండగా తేలు (పెద్ద మండ్రకప్ప అది కుడితే మనిషి చనిపోవటమే) నా గదిలో దూరింది. కర్ర తెచ్చే లోపలే ఎలా వెళ్ళిందో కనబడలేదు. తోటివారు అంతా వచ్చి ఈ రాత్రి మా గదిలో పడుకోండి అన్నారు. ససేమిరా అని వాళ్ళను పంపి నాన్నగారి అభయ హస్తాలు ఉన్న ఫొటో చూస్తూ 'అయ్యా! తేలు జాడ తెలియటం లేదు బయటకు రానియ్యండి' అనగా ఒక్క అరనిమిషంలో టేబుల్ లోపల నుంచి బయటకు వచ్చింది. చెప్పు దెబ్బ దట్టించగా అది చనిపోయింది. నిత్య జీవితంలో తండ్రిని ఇలా శ్రమపెట్టటం అప్పుడప్పుడూ తప్పటం లేదు వయస్సు కావటం వల్ల జ్ఞాపకశక్తి తగ్గటం వల్ల.

9 మా అర్థవరం గ్రామంలో శ్రీరమణ కేంద్రం 1956 సం॥లో రమణ భక్తులు సీతమ్మగారు (విశాఖ సుజాత గారి అమ్మమ్మగారు) స్థాపించారు. నేను 1987 సం॥లో శ్రీనాన్నగారి ప్రవచనాలు గల కేసెట్లు ఎన్నో అక్కడ

భక్తులకు వినిపించాను. ఆర్తిగల శ్రీమతి జి. సీతారత్నంగారు భక్తురాలు, రచయిత, గాయకురాలు మా గ్రామంలో నాన్నగారి సత్‌సంఘంలో శ్రీనాన్నగారిపై పాట పాడారు. శ్రీనాన్నగారిపై మొదట మధురస్మృతులతో ఇంపుగా పాడారు. ఈ పాట శ్రీనాన్నగారికి ఆనందం కలుగజేసింది. ఆ మధుర స్మృతులను ఇందు పొందుపరుచుచున్నాను. శ్రీనాన్నగారిపై మొదటి పాట ఇది.

శ్రీనాన్నగారు - మా నాన్నగారు
జోహార్లు మీకు - జోహార్లు మీకు

1. కన్న బిడ్డలను - దిద్దుకొనంగా
భువికేతెంచిన - శ్రీనాన్నగారు
మీ నోటి మాట - రతనాల మూట
మీరు చూపే బాట - మరుమల్లెబాట ॥శ్రీనాన్నగారు॥

2. అజ్ఞాన తిమిరాన - జగ మెల్ల నిండ
విజ్ఞాన కిరణాలు - ఉదయించె నేడు
మీ కీర్తి వర్ణింప - నేనెంత దాన
మన్నించి మమ్మేలు - శరణంటి నేను ॥శ్రీనాన్నగారు॥

3. యుగయుగంబున - అవతరించిన
రమణుని మారుగ - శ్రీనాన్నగారు
ఏ నోము వరమో - ఏ పుణ్య ఫలమో
మన ముందు కదలాడే - మా నాన్నగారు ॥శ్రీనాన్నగారు॥

ఒక వర్తక ప్రముఖురాలికి ఒక కొడుకు సుమారు ఎనిమిది సంవత్సరాల వయస్సులో డాబాపై ఉన్న ప్రమాదకరమైన హైటెన్షన్ వైరు తగిలి శరీరమంతా మైనపు ముద్ద అయి మరణించాడు. అమ్మమ్మ, తల్లి బాధ వర్ణనాతీతం. సంవత్సరం

గడిచిన తరువాత శ్రీనాన్నగారు వారి ఇంటికి వెళ్ళి వారితో "మీ అబ్బాయి మీ ఇంటికే వచ్చేస్తాడు వేదన పడకండి" అన్నారు. పోయిన వ్యక్తి మరలా మనింటికే ఎలా వస్తాడు. ఇలలో ఎక్కడైనా ఉందా? ఆశ్చర్యం, నమ్మదగ్గమాట కాదు అనుకొన్నారు. రెండు సంవత్సరాలకు ఒక డాక్టరు "ఒక అమ్మ కని అజ్ఞాతంలోకి వెళ్ళిపోయింది, మీరు పెంచుకుంటారా?" అనగా సరేనని ఇంటికి తీసుకొని కన్నబిడ్డలాగే పెంచుకొంటున్నారు. తల్లి నాతో అంది 'అబ్బాయికి పేరు ఏమి పెట్టమంటారు?' అని. 'నాన్నగారినే అడుగమ్మా' అనగా శ్రీనాన్నగారిని అడుగగా 'చనిపోయిన వాడే కదా! వాడి పేరే పెట్టండి' అన్నారు. సరే పెట్టారు. ఎదుగుతున్నాడు. చనిపోయిన వానిలో చరుకుతనం, అల్లరి. ప్రతీదానికీ మనం హేతువును కోరుతాము వాడి గుణాలే హేతువుగా తేలింది. శ్రీనాన్నగారు "మీరు మరణించినా మీరు ఏ జన్మలో ఎక్కడ జన్మించారో గురువుకు బాగా తెలుసు, కానీ మీ గురువు అడ్రస్ మీకు తెలియదు" అన్నారు. మాస్టర్ సి.వి.వి. గార్కి ఆరు సంవత్సరాల కుమారుడు మరణించగా ఏంజిల్స్ (దైవ దూతలను) పంపి జీవుణ్ణి తీసుకొని రాగా చనిపోయిన వాని శరీరంలో ప్రవేశపెట్టగా బ్రతికాడు. తిరిగి ఆరు నెలలకు మరణించాడు. తిరిగి అలాగే బ్రతికించటం అలా ఆరుసార్లు జరిగింది. డివైన్ లాను అతిక్రమించ లేమని ఆ ప్రక్రియను వదులుకున్నారు.

ఒక యోగి కథలో బాబాజీ మహారాజ్‌గారి శిష్యుడు కుమారుడు మరణించగా కొంతకాలానికి శిష్యుడు గురువుతో 'అయ్యా నా కుమారుడు ఎక్కడ పుట్టాడో చూపించండి" అనగా ఎనభై మైళ్ళ దూరంలో ఒక గుడిసెలో ఉన్న శిశువును చూపి 'వీడే నీ కొడుకు' అన్నారు. కొందరి శిశువులకు పూర్వ జన్మ స్మృతులు తెలుస్తాయి. ఆ తండ్రిని రెప్పవాల్చకుండా చూడటం జరిగింది. పూర్వజన్మ స్మృతులు తెలిపినవారు చాలామంది ఉన్నట్లు పత్రికల్లో చూచాము. మన గత జన్మ ఈ జన్మ రాబోయే జన్మల రహస్యం శ్రీనాన్నగారికి తెలుసు. ఈ విషయం తదుపరి

అంశాలలో విస్తారంగా గుర్తించగలరు.

భగవాన్ ఒక అమెరికన్ భక్తుని విషయంలో "మన దేశం వాడే కారణాంతరాల వల్ల అక్కడ జన్మ తీసుకున్నాడు" అన్నారు.

మైసూర్ దత్త స్వామి రెండు ఆబోతులు తీవ్రంగా పోట్లాడుకొంటున్న వాటి దగ్గరకు వెళ్ళి ఏడు జన్మల నుండి ఇలా కొట్టుకుంటున్నారు ఇకనైనా ఆపరా అనగా గత స్మృతులు తెలిసి కంటినుంచి కన్నీరు కార్చుకొని వెళ్ళిపోయాయి. జీవుని ప్రాణ ప్రయాణ ప్రవాహ గమనాన్ని సాధారణ మానవుడు గుర్తించలేడు.

# వేద ప్రమాణాలు

వేదం ఎనిమిది ప్రమాణాలను ఎన్నుకొని ఆమోదించింది. అవి

1. **అనుభవం** అంటే ఆత్మానుభవంతో తెలపగలగటం. భగవాన్, నాన్నగారు ఆ ప్రమాణాలకు సరితూగేలా అతికినట్లు తెలపటం.

2. **దృష్టాంతరం** అంటే ఉపమానం చీకటిలో ఉన్న వస్తువును తెలుసు కోవటానికి లైట్‌ను ఉపయోగిస్తే వస్తువు తెలియబడుతుంది. ఉపాయం వల్ల ఉపేయ వస్తువు తెలియబడుతుంది.

3. **యుక్తి** అంటే విషయాన్ని సాధకుని బుద్ధికి తేలికగా అవగాహన కలిగేలా నేర్పుతో చెప్పటం.

4. **స్మృతి ప్రమాణం** అంటే శాస్త్రారణ్యంలో కొట్టుకుపోయే వ్యక్తి ఆప్రమాణాన్నే నమ్ముతారు. ఎంత చెప్పినా ఆ బుద్ధికి జ్ఞానుల ప్రమాణాన్ని ఆమోదించరు. ఉపనిషత్తులు, గీత గీతలో అంశాలను తెలిపి సమాధానపడేలా చెయ్యటం. భగవాన్, నాన్నగారు ఆ ప్రమాణాలను పొందుపరచి చెప్పటం జరిగేది.

5. **విషయం** అంటే ఆత్మ తత్వాన్ని పరిపరివిధాలుగా విశదీకరించి తెలపటం.

6. **ప్రయోజనం** అంటే పరమశాంతిలో ఓలలాడటం.

7. **సంబంధం** అంటే సాధకుడు తన తన మార్గంలో ఎన్నుకొంటే అంటే భక్తిమార్గం, జ్ఞానమార్గం, కర్మమార్గం, యోగ మార్గంలో ప్రయాణం చేస్తూ ఉంటే అందులో ప్రయోజనాలను వివరంగా విశదీకరించి తెలుపుట అంటే టు ది ప్రోపర్ చానల్ తెలపటం.

8. **అధికారి** అంటే ఆత్మానుభవం "ఏకమక్షరం, హృదినిరంతరం, భాషతో స్వం, విష్యతోకథం" అంటారు. కానీ వాక్కు సూచిస్తుంది అన్నారు భగవాన్ అంటే ఇలా వెళ్ళు, అలా వెళ్ళు అంటూ తెలుపుతుంది. అంటే మైలు రాళ్ళు మన గమ్యాన్ని సూచిస్తాయి. అవి అక్కడే ఉంటూ దూరం తెలుపుతాయి.

ఆత్మానుభవంలో వైభవాన్ని అరవింద్ డివైన్ లైఫ్‌లో ఇలా సూచించారు : ది ఫ్రీడమ్, ది బ్యూటీ, ది బ్లిస్, ది పీస్, ది ఎవేర్‌నెస్, ది నాలడ్జ్ అంటూ చెప్పుకుపోతారు. వాటి అంతరార్థాలను శ్రీనాన్నగారు మనకు చెబుతూ ఉంటారు. ఉదాహరణకు ది బ్లిస్ ఆనందమే ఆనందాన్ని అనుభవిస్తుంది. మనకు క్షణికావేశాలు కలుగుతాయి. భార్యాభర్తలు కలిసినప్పుడు కొన్ని క్షణాల ఆనందం. మన గర్భశత్రువు కుళ్ళి కుళ్ళి చనిపోతున్నప్పుడు, లాటరీ వచ్చినప్పుడు, అధికార పదవి పొందినప్పుడు అలా ఏదో ఒక ఆబ్జక్టు కావాలి కానీ స్వతంత్రమైన ఆనందానికి ఆబ్జక్టు అవసరం లేదు. అది స్వతంత్రమైనది. భగవాన్ పొందేది, నాన్నగారు పొందేది స్వతంత్రమైన ఆనందం. ఇలా ప్రతీ పదానికి అర్థం చెప్పాలంటే అది ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. నాన్నగారి ప్రవచనంలో ఈ విషయాలన్నీ తేటతెల్లంగా వివరిస్తారు.

పైవి కాకుండా **అర్థాపత్తి** ఉంది. అంటే భావం ముందు వెళుతుంది, అర్థాలు వెనుక వస్తాయి. అంటే సాధకుడు అపార్థాలు చేసుకోకుండా వివరించటం.

ఇది బాబూజీ సాహిత్యంలోనూ, ఓషో సాహిత్యంలోనూ, నాన్నగారి ప్రవచనంలోనూ కనబడుతుంది. వారి మాటల్లో సాంద్రత ఉంటుంది. అభివ్యక్తంలో అంత సరళంగా ఉంటుంది. మాటల్లో డోలాయమానం ఉండదు, స్పష్టత ఉంటుంది. నిఖార్సయిన నిజం కట్టెదుట కనిపిస్తుంది. ఇది అంతా అర్థాపత్తిలోకే వస్తుంది.

ఆధ్యాత్మిక మార్గంలో మహాత్ములను హేతువులు అడగటం హీనమైన బుద్ధి. తర్కం వల్ల సత్యం తెలియదు, ఆయాసం మిగులుతుంది. అవగాహనాబుద్ధి వల్ల పరిశీలనా బుద్ధివల్ల సత్యం తెలుస్తుంది.

# జ్ఞాని వైభవం

10 శ్రీనాన్నగారు "మరణానంతరం మనకు తోడుగా వచ్చేది గురువు మాత్రమే. యమభటులు తీసుకొనిపోరు. ఆ సమయంలో సద్గురువే స్వయంగా వచ్చి శిష్యుని ఆత్మను స్వాధీనం చేసుకొంటారు" అన్నారు. ఆ మాటల ప్రమాణంగానే శ్రీనాన్నగారు ఆచరించారు. మరో సందర్భంలో "జన్మాంతరం అనుబంధం ఉంది కాబట్టే మీరు నాన్నగారి దగ్గరకు వచ్చారు. దేశంలో కోట్లాది ఉన్నారు. అందరూ నాన్నగారి దగ్గరికి రారు" అన్నారు.

చింతపర్రు గ్రామవాసి అప్పలరాజుగారు శ్రీ నాన్నగారి శిష్యులలో అగ్రగామి. గ్రామ సర్పంచిగా ఇరువది సంవత్సరాలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. 1983లో రమణ కేంద్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. వారి కుమార్తె భీమవరం వాస్తవ్యులు నరసింహరాజు, భార్య సరస్వతమ్మల కుమార్తె కుమారి. శ్రీ నాన్నగార్కి అత్యంత సన్నిహిత భక్తులు అప్పలరాజుగారు ఆ రోజుల్లోనే కాలం చేసారు. వారి సంతాప సభలో శ్రీనాన్నగారు "అప్పలరాజుగారు నా హృదయానికి అత్యంత సన్నిహితంగా, నా హృదయంలో శాంతిగా ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకన్నా

ఇంటి పరిసరాలు, ఆస్తుల కన్నా నాకు నా హృదయంలో సుఖంగా ఉన్నారు. నా లోనే కలిసారు" అన్నారు. పరమపవిత్రులు కావటం వల్ల.

జిడ్డు కృష్ణమూర్తిగారితో ఇందిరాగాంధీ ఇంటర్వ్యూ కోసం సంవత్సరం నిరీక్షించారు. జె.కె. ఆశ్రమం చిత్తూరు జిల్లా రుషివ్యాలీలో వారి ఆశ్రమంలో సకుటుంబంగా దర్శించి ఇలా అన్నారు "గెడ్డం ఉన్న వ్యక్తి నన్ను చంపటానికి వస్తున్నట్లు పీడకలలు వస్తున్నాయి" అని ఆవేదనతో అనగా "అయితే సైన్యంలో సిక్కులను నీ అంగరక్షకులైన వారిని తీసేయి" అనగా "వాళ్ళే నా ప్రాణ రక్షకులు" అనగా ఆ అంశం అంతటితో విదిలి జె.కె. అనుచరురాలు పూపుల్ జయంకర్ ఆమె ఇందిరకు కూడా అత్యంత సన్నిహితురాలు ఆమెతో "ఇందిరకు కష్టకాలం వచ్చింది. అప్పుడు నాకు టెలీగ్రామ్ ఇయ్యి" అనగా స్వర్ణ దేవాలయంలో ఇందిరాగాంధీ కలుగజేసుకోవటం సహించలేని ఆ సిక్కు రక్షక భటున్ని రైఫిల్‌తో కాల్చగా ప్రాణాలు వదిలింది. దేశమంతా అతలాకుతలమైనది. ఈ విషయం అమెరికాలో ఓహైలో ఉన్న జె.కె. గారికి తెలుపగా మూడు రోజుల తరువాత జె.కె. రెండు చేతులు పైకెత్తి "ఇందిరా నిన్ను స్వేచ్ఛా మండలం విడిచి పెడుతున్నాను" అన్నారు. మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ కూడా జె.కె. శిష్యులే.

వేమన "కుండను తయారు చేసి ఒక సంవత్సరం పాటు దానిపై అనేక రంగులతో చిత్రించి నగిషీలతో అలరారుతుంది. ఆ కుండను ఒక తన్ను తన్నితే చెల్లాచెదురై నామరూపాలు లేకుండా నాశనమౌతుంది. గురువు మనలోని కోటాను కోట్ల కర్మ వాసనలు, నగిషీ లాంటి సంస్కారాలు ఒక కరుణా పూరితమైన చూపు చూస్తే అన్ని వాసనలు, సంస్కారాలు నశించిపోతాయి" అన్నారు.

**అంతరించెనట - భయభ్రాంతులు**

**మంచి కార్యములు - నియమ నిష్టలు**

**అంతరించెనట - నియమ నిష్ఠలు**

**అంతరించెనట - జాత్యాభిమానాలు**

**అంతరించెనట - నా కుల గౌరవములు**

ఆ స్టేట్ యొక్క వైభవమది. అదే గురువు యొక్క వైభవం. వరాహోపనిషత్తు ఇలా అంటోంది.

**యస్యాను భవపర్యన్తా బుద్ధిస్తత్త్వేపరివర్తతే**
**తద్దృష్టి గోచరాస్సర్వేముచన్తే సర్వపాతకై (4-43)**

తా॥ ఎవని బుద్ధి అనుభవ పర్యంతము, ఆత్మతత్త్వమునందు వర్తించునో అట్టి వానికి దృష్టిగోచరమైన వారెల్లరు సమస్తపాపముల నుండి విముక్తి పొందుదురు. ఇది శ్రీనాన్నగారికి వర్తిస్తుంది, భగవాన్‌కి వర్తిస్తుంది. గుడిపాటి వెంకటా చలం ప్రపంచ నాస్తికులకు చక్రవర్తి. 'మైదానం' నవలతో ఆ రోజుల్లో యుతను ఉర్రూత లూగించారు. కొండ మీద నుంచి దిగుతూ భవాన్ ఆయనవైపు ఒక్క చూపుతో సాయంకాలానికి భగవాన్ భక్తునిగా మారారు. ఆయన ఏమిటో నాకు తెలియదు, ఆయన ఎందుకో తెలియదు నాకు ఆనంద సముద్రుడు అన్నారు. దృష్టి వైభవం అది.

## 11

శ్రీనాన్నగారి భక్తులలో చాలా భాగం మధ్యతరగతికి చెందినవారే. వారు ఆర్.టి.సి. బస్సులో ప్రయాణం చేస్తూ ఉంటారు. నేను, భక్తులు పాలకొల్లు నుండి భీమవరం వెళ్ళే బస్సు ప్రయాణం చేస్తున్నాము. భక్తులు మొదలు పెట్టారు "ఈ రోజు శ్రీనాన్నగారు ప్రవచనంలో ఎంత మంచి సబ్జక్టు వచ్చింది" అని మురిసిపోయి మాట్లాడుకుంటూ, ఆనందంగా అనుకొంటున్నారు. ఇంతలో ఆధ్యాత్మిక విషయాలు కిట్టనివారు, మల్లెపూలవంటి ఆ వాసన కిట్టనివారు, ఎండుచేపల వాసనకు అలవాటు పడ్డ ఒక ఆవిడ ముందు

సీట్లో కూర్చుని వెనుకకు తిరిగి ఇలా అంది "మొన్నటి వరకూ శుభప్రదమైన అమ్మగారు అని నగలు మాణ్యాలు సమర్పించి ఆమె వెంట వెళ్ళి తిరిగి తిరిగి ఇప్పుడు నాన్నగారు అంటూ వీరు వెంట పడ్డారు. వీళ్ళకు ఏమీ పనిలేదు. ఇంటి పక్క భోజనానికి లేక మాడిపోతున్నా జాలి చూపి ఒక కుంచెడు బియ్యం ఇయ్యరు. వీళ్ళకు సత్సంగాలంట" అని కళ్ళు ఎర్రచేసి దూషణల పర్వం మొదలుపెట్టింది. నాన్నగారి భక్తులు ఎదురు తిరగక అంతా నిర్మలంగా ఉన్నారు. ఆ దూషణ అమ్మగారు వాళ్ళ స్టేజ్ వచ్చాక ఆమె దిగింది. మా స్టేజీలో మేము దిగాము. అలాగే మా గ్రామంలో తొలి సమావేశంలో శ్రీనాన్నగారి మాటలు ఎలా ఉన్నాయి అని నేను ఒక వ్యక్తిని అడిగాను "ఆయన ఏమి చెబుతున్నాడో ఆయనకే తెలియదు" అన్నాడు. కుతర్కవాది తేలు స్వభావం గల వ్యక్తి ఆ మాట. ఆనాడు మనస్సు చివుక్కుమంది. ఈ మాటలను శ్రీనాన్నగారు విశ్వమనస్సు ద్వారా విషయం గ్రహించి తదుపరి సమావేశంలో ఇలా అన్నారు "జ్ఞాని యొక్క బోధామృతం కొంతమందికే తెలుస్తుంది. వాళ్ళ వెటకారం మాటలను పరిగణనలోకి తీసుకోకూడదు. జగడమే ఇష్టం గల వారి మాటలను మూట కట్టి ఒక ప్రక్కన పెట్టకపోతే వారిపై ప్రతీకారం తీర్చుకోవాలనే బుద్ధి పుట్టి మనస్సు బహిర్ముఖమై పోతుంది" అన్నారు. భగవాన్ సమక్షంలో ఒకరు "అయ్యా తమరిని ఇన్నిన్ని మాటలు అన్నారు. ఎదురు తిరగలేదు. క్షమించండి" అనగా "సహనం మరింత సహనం, ఓర్పు మరింత ఓర్పు" అన్నారు. బాపూజీని జాతిపిత అన్నవారు ఉన్నారు, జాతిపీత అన్నవారు ఉన్నారు. దీనిపై వేమన

**ముద్దుగుమ్మకేల – ముసలి మొగుడు**
**ముది వశమున – విటుని వల్ల దోక్క**
**వెట్టి మొద్దుకేల – వేద శాస్త్రము** అన్నారు.

శారదామాత "ఈ భూమికి ఎంత ఓర్పు ఉందో అంత నీకు ఉంటే నీవు ఆత్మను తెలుసుకోగల్గుతావు. లౌకికులు, దుష్టుల యొక్క దుర్మార్గాలు నీవు సహించాలి.

లేకపోతే నీకు ఆత్మదర్శనం కలుగదు" అన్నారు. ఇదే విషయంలో శ్రీనాన్నగారు "గదిలో నాలుగు గోడల మధ్య కూర్చుని సాధనలో మునిగిపోతున్నాను అనుకోకండి. బయట మనుషుల మొట్టికాయలు తింటే మరింత వివేకం సంతరించుకొంటేనే నీవు పూర్ణత్వాన్ని పొందగలవు. ఈ పాడులోకం మెప్పులకోసం ఎదురుచూడకండి. రాళ్ళతో కొడతారు, అవమానాలు చేస్తారు" అన్నారు.

12 కలకత్తాలో గిరీష్‌చంద్ర ఘోష్ హద్దుఅదుపులే లేకుండా జీవితాన్ని గడిపారు. అతను శ్రీరామకృష్ణుని దర్శనానికి వచ్చాడు. తాగుబోతు, తిరుగుబోతు అయిన అతన్ని చూసి స్త్రీలంతా దూరంగా వెళ్ళిపోయారు. పరమహంసగారు గిరీష్ కళ్ళలోకి పరీక్షగా చూసి "గిరీష్ నీ కళ్ళలో ఎంత బంగారం దాచుకున్నావో నీకు తెలియదు. నన్ను చూచిన తరువాత అది బయటపడింది" అనగా అతను "అయ్యా! నేను తాగుబోతును, తిరుగుబోతును. తాగుడు మానమంటారా?" అనగా "అవసరం లేదు, తాగు" అన్నారు. తదుపరి "నేను నిషిద్ధ ప్రదేశాలకు వెళ్ళటం నాకు అలవాటు. అది మానమంటారా?" అనగా "అక్కరలేదు, వెళ్ళు" అన్నారు. శ్రీనాన్నగారు "ఏ జ్ఞాని అలవాట్లను మానమని చెప్పడు. తగిన సమయంలో వాటి వాసనలను తీసేస్తాడు" అన్నారు. అలాగే గిరీష్ ఇంటికి వెళ్ళి బ్రాంది గ్లాసులో పోసుకొన్నాడు. ఆ గ్లాసులో పరమహంసగారు కనిపించారు. ఆ తాగుడు అలవాటు మానేసాడు. మరుసటిరోజు ఒక వ్యభిచార గృహానికి వెళ్ళాడు, ఆ స్త్రీని చూడగా ఆమెలో దేవి కనిపించింది. అన్ని అలవాట్లు బంద్. చివరిదశలో వివేకానందలా సంచరించాడు.

ఆ రీతిగానే నిడదవోలు సమీపంలో శింగవరం గ్రామంలో గాయత్రిరాజు, భాస్కర్‌రాజులు ఉన్నారు. గిరీష్‌లాంటి గుణాలు పుష్కలంగా ఉన్నాయి. నేను శింగవరం వెళితే 'బావగారు మీరు ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నారట. పరమహంస

గారి సాహిత్యం పంపరా!' అని ప్రాధేయపడ్డారు. 'అలాగే' అన్నాను. ఈ తాగుబోతులకు ఈ విలువైన సాహిత్యం ఇస్తే తిరిగి ఇయ్యరు అని పంపలేదు. ఆధ్యాత్మిక మలుపుకి వాళ్ళకు కాలం కలసి వచ్చింది. ఇద్దరూ మా ఇంటికి వచ్చేసారు. నేను వాళ్ళను వెంప గ్రామంలో శ్రీనాన్నగారి సమావేశానికి తీసుకొనివెళ్ళి "వీళ్ళ ఆధ్యాత్మిక చింతన ఇదండి" అని తెలిపాను. వెంటనే భాస్కరరాజుగారి భుజంపై చేయివేసి "మీ రాక నాకు సంతోషం కలిగిస్తున్నది. ప్రవచనాలకు వస్తూ ఉండండి" అన్నారు. ఆ రోజు లగాయతు గిరీష్‌లానే అన్ని చెడు వాసనలు పూర్తిగా వదిలారు. పూర్ణ శరణాగతి పొందారు. రోజులు గడుస్తున్నాయి, వాళ్ళలో పరిణితి బాగా వచ్చింది. ఒక పండిత అహంబ్రహ్మాస్మి తగిలి "వెధవల్లారా! దీనికోసం జిన్నూరు వెళ్ళాలా? నేను సరిపోనా? నాన్నగారు ఏమి చెబుతారు 'నేనెవడనంటూ' ఎత్తుకుంటాడు. ముక్కులో గాలి పోతే 'నేను' ఏమౌతుంది? నేను ఎవడను, ఏమవుతుంది? నేను చెప్పానని అడుగు ఏమి చెప్పగలడో మరలా చెప్పు" అన్నాడు. మార్టేరు సమావేశం (1987 సం॥)లో జరిగినది వారు నాకు చెప్పగా "మీరు ఆ తర్క, వితర్కల జోలికి వెళ్ళకండి. అవునంటే కాదంటాడు, తప్పించుకొని సంచరించండి. ఆ పండితుడ్ని మీరు ఎదుర్కోనక్కరలేరు" అన్నాను. శ్రీనాన్నగారు రెండు గంటలకుకానీ సమావేశానికి రారు. ఈ విషయం విశ్వమనస్సు ద్వారా గ్రహించి సమావేశం మధ్యలో "ముక్కులో గాలి పోతే 'నేను' పోదు. మరుజన్మకు వస్తుంది. ఈ నేను ఎముకల నుంచి, కిడ్నీ నుంచి రావటం లేదు. సాక్షాత్తు హృదయం నుంచే వస్తున్నది" అని పదమూడు అంశాలు సవివరంగా చెప్పి ఇవి అన్నీ అసూయ వల్ల వస్తున్నాయి అన్న వారి మాటలు కాగితంపై వ్రాసి మిమ్ములను హింసపెడుతున్న వారికి అందించండి అనగా వారు అందిస్తే తలవంచుకుని సమాధానం చెప్పలేక ఇందులో అసూయ ఏముంది? అని ఇంట్లోకి వెళ్ళిపోయారు, భక్తులు ఆనందించారు.

కొంతకాలానికి భాస్కర్‌రాజుకు శారీరక అనారోగ్యం దాపురించింది. చిన్న ప్రేగులు, పెద్ద ప్రేగులు తీసేసారు. ఈ వ్యాధి కోటికి ఒకడికి వస్తుంది అన్నారు రాజమండ్రి డాక్టర్లు. రోజూ హైదరాబాద్ నుండి విమానంలో పౌడరు పేకెట్ వస్తుంది, నీళ్ళలో అవి కలుపుకొని త్రాగటం అంతే. ఆ వ్యాధి వచ్చిన వారిని ఎసిలో పెట్టినా వేడిమంటలు ఆగవు. ఎంతవారైనా అంతులేని వేదనతో ఉంటారు. కానీ భాస్కర్‌రాజు ప్రశాంతంగా శ్రీనాన్నగారి పాదుకలు గల ఫోటో కళ్ళమీద పెట్టుకొని 'నాన్నగారు నాన్నగారు' అనే నిత్యస్మరణ చూసి డాక్టర్లు 'ఎవరీ నాన్నగారు?' అని అడిగారు. విషయం చెప్పారు బంధువులు. విషయం వారి కుటుంబీకులు నాకు చెప్పి మీ ద్వారా ఒకసారి నాన్నగారిని దర్శింపచేయాలి పేషెంట్‌కి అనగా, అది మే నెలలో గాల్పులు నాన్నగారు 'నేను అక్కడికి రానక్కరలేదు, ఇక్కడ నుంచే అనుగ్రహిస్తాను' అన్నారు. అనతికాలంలోనే శరీరం అంతా కుళ్ళిపోయింది, సెంట్లు, అత్తరులు వ్రాస్తున్నారు, స్వగ్రామంలో ఉంచారు. అంతిమ సమయం రానే వచ్చింది. ఉపదేశసారం స్పష్టంగా పాడి ఆనందంగా మరణించాడు. "మీ గురువు నిజగురువు అయితే అంతిమ కాలంలో ఆనందంగా మరణించాలి" అన్న నాన్నగారి మాట అక్షర సత్యమైనది. తదుపరి శ్రీనాన్నగారు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వచ్చారు. పరుసవేది తాకితే తుప్పు పట్టిన ఇనుము కూడా బంగారమవుతుంది. సద్గురువు సంకల్పం వల్ల భాస్కరరాజు పరమపదానికి వెళ్ళాడు. అంత్యకాలంలో ఎవరైతే నన్ను స్మరిస్తారో వారు నా సాన్నిధ్యానికి చేరుతారు అన్నారు వాసుదేవస్వామి.

## 13

మంత్రదీక్ష ఇస్తే శిష్యుని పాపం, బాధలు అన్నీ గురువు స్వీకరించాలి. రామానుజులు గోపురం ఎక్కి పురజనులకందరికీ మంత్రదీక్ష ఇచ్చారు. దానికి అపారమైన దయ ఉండాలి. శ్రీనాన్నగారు అడిగి భక్తులకు వారి వారి ఇష్టదైవం నామాన్ని మంత్రదీక్షగా ఇచ్చేవారు. ఆయనకు ఎంత ముఖ్య కార్యక్రమం ఉన్నా మంత్రదీక్షకే ప్రాధాన్యత ఇచ్చేవారు.

అక్కడవారు బాగుపడటం ముఖ్యం, కృపాశింధులే ఆ సాహసమైన పని చేస్తారు. ఆ ప్రేమ సాగరునిపై ఒక బొట్టు ఆర్తితో కన్నీరు కారిస్తే చాలు. అది ఎంతటి ప్రేమ, ఎంతటి అనురాగం, అది నూటికి నూరుపాళ్ళు ప్రేమ. ఆ ప్రేమ మూర్తి శ్రీనాన్నగారిని భక్తులు విసినకర్రతో విసిరి పరమానందం పొందుతారు. ఆ క్రియలో భక్తులు పోటాపోటీగా పనిచేస్తారు. గురువు ఎవరి ఇంటికి వెళ్ళినా సొంత ఇంటికి వెళ్ళినట్లే భావిస్తారు. శాంత స్వభావం కలిగి అహంకార రహితంగా ఉంటారు. నడకలో ఎక్కడా తొట్రుపాటు లేకుండా ఏనుగు నడిచినట్లు గంభీరంగా నడుస్తారు. సమస్థితిలో ఉంటారు, వారిని చూస్తే ఆ స్థితి మనకూ అంటుకొంటుంది. నిప్పు వెలగటానికి పొగ ఊదినట్లు అంటే ఆయన రూప ధ్యానంలో ఉంటే ఎన్నటికైనా మన అహంకారం అంటుకొని కాలి బూడిద అవుతుంది. ఇది సత్యం – సత్యం – సత్యం.

శ్రీనాన్నగారి దివ్యమంగళరూపం పండు వెన్నెల గనులవంటి ఆ నేత్రాలను ఎంతసేపు చూసినా చూడాలనే ఉంటుంది. దీనిపై ఒక పారిశ్రామికవేత్త శ్రీనాన్నగారితో "మీ మీటింగులో మూడు గంటలుపాటు రెప్పవాల్చకుండా మిమ్ములను చూస్తూనే ఉన్నారు. మీటింగ్ అయినా వెళ్ళక మిమ్ములను చూస్తూనే ఉన్నారు. ఏమిటి కారణం?" అనగా "అది నన్ను అడగవలసిన ప్రశ్న కాదు. వాళ్ళనే అడగాలి" అన్నారు శ్రీనాన్నగారు. దీనిపై ఒకరు "ప్రపంచమంతా వారి గురుదేవుల ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉన్నాయి వాటి సంఖ్యను చూచి అంచనావేస్తారు కానీ క్వాలిటీ చూడరు" అని వ్యాఖ్యానించారు. దీనిపై జిడ్డు కృష్ణమూర్తిగారు "అవగాహన అనేది మానసిక ప్రక్రియ కాదు. అది ఈశ్వరుని నుంచి రావాలి" అన్నారు. అది అక్షర సత్యం. జాన్‌డేవిడ్ శ్రీనాన్నగారితో "సర్ మీ కళ్ళు చాలా అందంగా ఉంటాయి. వాటిలో ఏదో కాంతి ఉంది" అనగా "ఆ కాంతి మనోదేహాలకు అతీతమైనది" అన్నారు శ్రీనాన్నగారు. తిరిగి డేవిడ్ "మిమ్ములను చూస్తూ ఉంటే మాకు ఆనందం

కలుగుతోంది. ఎందుకని?" అనగా "చంద్రుని నుంచి చల్లదనం, సూర్యుని నుంచి కాంతి ఎంత సహజంగా ప్రసరిస్తాయో అంతే సహజంగా జ్ఞాని నుంచి కాంతి, శాంతి, ఆనందం వర్షిస్తుంది" అన్నారు శ్రీనాన్నగారు. జిన్నూరు క్షేత్రంలో పూర్వ నివాసముండే పంచాయితీరాజ్ ఇఓ సుబ్బరాజుగారు శ్రీనాన్నగారితో "మిమ్ములను చూస్తూ ఉంటే మా కళ్ళలో ఆనంద భాష్పాలు వస్తున్నాయి. కారణం ఏమిటి?" అనగా "నేను ధారణలో ఉండటం వల్ల" అన్నారు. శ్రీనాన్నగారు "ఎవరు నిత్యాన్ని పొంది లీలలో కూడా ఉంటారో, మరలా లీలల్లోంచి నిత్యాన్ని చేరుకొంటారో వాడే పరిపక్వమైన జ్ఞాని" అన్నారు. అలాగే ఆచరిస్తున్నారు. గీతలో కృష్ణుడు చెప్పిన సత్యం అదే.

ఒక ఉన్మత్తుడైన సాధకుడు జిన్నూరు రమణక్షేత్రం సభావేదిక ఎక్కి ఎన్నో సిద్ధాంతాలను ప్లానుతో వాటి గొప్పదనాన్ని వల్లె వేస్తూ అదే నిజమైన ఆధ్యాత్మిక మార్గమని, ఈ గురువులు నిజ గురువులు కారని భవిష్యత్తులో ఏర్పడే మహా గురువు కోసం మనం వేచి ఉండాలని ఆ సిద్ధాంతాన్ని రాద్ధాంతం చేస్తూ ఉంటే ఆ వ్యక్తి వేదిక దిగమని ఎంత వేడుకొన్నా ఎవరి వల్ల కాలేదు. నివారించి భక్తులను చేయి ఎత్తి కొట్టబోతున్నాడు. సభ అంతా గందరగోళమైనది. అందరూ ఆందోళన చెందారు. విషయం గ్రహించిన శ్రీనాన్నగారు గది నుంచి వచ్చి ఆ ఉన్మాదిని చేతి సైగతో వెళ్ళిపోమనగా బొబ్బిలి పులిలా తిరగపడ్డవాడు పిల్లి పిల్లలా తలవంచుకొని సింహం ముందు మేకపిల్లలా తల వంచుకొని తోక జాడించి వెళ్ళాడు. సభలో భక్తులు ఈ సంఘటనతో చకితులైనారు. ఇటువంటివి పరమహంసగారి సమక్షంలో భగవాన్ సమక్షంలో జరగటం కద్దు.

కొన్ని కళ్యాణ మండపాలలో శ్రీనాన్నగారి చిత్రపటాలు కనువిందుచేస్తాయి. సమావేశాలకు శ్రీనాన్నగారు రాగానే సభికులు లేచి గౌరవవందనంగా నమస్కరిస్తే

వారు ప్రతినమస్కారం చేయగా ఆనందం పొందుతారు. శ్రీనాన్నగారిని సేవా కార్యక్రమాల సభలకు ఆహ్వానిస్తే వెళ్ళి నిష్కామకర్మ సేవ యొక్క లక్ష్యాన్ని, దాని ఫలితాన్ని విపులంగా చెప్పగా సభికులు "ఔరా నాన్నగారు ఆధ్యాత్మిక విషయాలే కాదు సంఘ పురోగమనానికి వినూత్న రీతుల్లో చెప్పి ఎంతగా మనలను ప్రభావితం చేస్తున్నారు" అని కరతాళ ధ్వనులతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. దేశ భక్తిని పురిగొల్పుతారు. పటేల్, రాజన్‌బాబు, శాస్త్రీజీ, ప్రకాశం గారిని ప్రతిభావంతుడైన రాజాజీ తెలివిని, త్యాగనిరతిని వందలాది కోణాల్లో చూపి దేశ పురగోమనాన్ని, దారిద్ర్యం తొలగాలని, దేశ భక్తి కలగాని, ముఖ్యంగా బాపూ వైభవాన్ని కొనియాడుతారు. పాశ్చాత్యులైన షేక్స్‌పియర్, మిల్‌టన్, లింకన్ ప్రముఖ పారిశ్రామిక వేత్తల వితరణను ప్రశంసిస్తారు. తద్వారా దేశం చైతన్యం కావాలని వారి తపన.

14

జగత్తు - జీవుడు - ఈశ్వరుడు మనో కల్పితమని తెలిపిన అద్వైత శిఖామణి అయిన భగవాన్ సమక్షంలో గుఱ్ఱం సుబ్బరామయ్యగారు 'తారా విలాపం' చదవగా భగవాన్ నేత్రాలు కన్నీళ్ళతో నిండాయి. కంఠం రుద్ధమైనది. భగవాన్ కొంత తమాయించుకొని "ఏమి చేస్తాము? ఎదుట ఏది ఉంటే అదే మనమైపోతాము. ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటే కదా! అంతా మనమే" అని సెలవిచ్చారు. అలాగే శ్రీనాన్నగారి ప్రవచనంలో మహాభారతయుద్ధంలో యుద్ధం చెయ్యనని రథాన్ని మాత్రం తోలుతానని మాట ఇచ్చి అర్జునుని ప్రాణాల కోసం మాటమార్చి భీష్ముల వారిపై రథం నుండి కుప్పించి దూకి రథచక్రం పట్టగా శ్రీకృష్ణపరమాత్మ నగలన్నీ చెల్లాచెదురై ఉద్యమించే సంఘటన చెప్పలేనని సమావేశంలో ఏడ్చారు. వారిలో ఉన్న ప్రగాఢమైన భక్తికి భక్తులు ద్రవించిపోయారు. కొంతసమయానికి తేరుకొని తిరిగి సబ్జక్టులోకి వచ్చారు.

అలాగే మరోసారి శ్రీరమణక్షేత్రంలో కుచేలోపాఖ్యానంలో ప్రాణస్నేహితుడైన

సుధాముడు తన దర్శనానికి పడ్డ శ్రమ, తపన తట్టుకోలేక కిరీటం, కండువా లేకుండా సుధామా అంటూ పురవీధులలో పరుగు పెట్టటం చివరకు కనుగొని మంగళస్నానం చేయించి కొత్తబట్ట కట్టించి తన సోఫాపై కూర్చోబెట్టి అతని కాళ్ళ వద్ద క్రింద కూర్చుని తైలం రాస్తూ 'ఎన్ని దెబ్బలు తగిలాయే' అని వేదన పడిన సంఘటన దేవదైవుడైన పరమాత్మ స్నేహవైభవం సంఘటన శ్రీనాన్నగారు 'నేను చెప్పలేను' అని ఏడ్చి ఏడ్చి చివరకు ఇలా అన్నారు 'నేను ఈ ఘట్టాన్ని గురించి చెప్పలేను. ఇందులో నా ఓటమిని అంగీకరిస్తున్నాను. క్షమించండి' అని కొంతసేపు మౌనంగా ఉండి, ఊరడిల్లి సబ్జక్టులోకి వచ్చారు. శ్రీనాన్నగారి ప్రతీ అక్షరం, ప్రతీ పదం భక్తుల హృదయాలను 'ఆర్ద్రత'తో అంటే భాషకందని భావన, మనస్సును ద్రవింపజేసే స్థితి. ఆయన మధుర స్వభావం, పసిపిల్లాడివంటి కపటం ఎరుగని నైజం భక్తుల హృదయాలపై చెరగని ముద్ర వేసేది. భగవాన్ సమక్షంలో కాశీ నుంచి ప్రసాదం తెస్తే కాశీ నుంచి విశ్వేశ్వరుడు వచ్చాడని వినమ్రతతో స్వీకరించేవారు. మధురై నుంచి ప్రసాదం వస్తే మీనాక్షి వచ్చిందని కళ్ళకు హత్తుకొని తినేవారు. అలాగే శ్రీనాన్నగారు కాశీ నుంచి, రామేశ్వరం నుంచి, తిరుపతి నుంచి, పూరీ నుంచి, అన్నవరం నుంచి వచ్చే ప్రసాదాలను వినమ్రతతో స్వీకరించి భక్తులకు పంచమనేవారు.

మనలోని భక్తిని రగిలించటానికి ఒకనాడు నాన్నగారికి ఒకరు పూరీ జగన్నాథుని చిత్రపటం చూపగా తదేకంగా చూస్తున్నారు. ఆయనకు అంతా శూన్యమైపోయింది. 'ఏమీ లేదు' అన్నారు. దీనినే బుద్ధభగవాన్ శూన్యం అన్నారు. శూన్యమే పూర్ణం. మాండ్యుకోపనిషత్తులో గౌడపాదుల 'కారిక'లో అంతా శూన్యమే అన్నారు. శ్రీనాన్నగారు పరమ దయాళువు, అహేతుక కృపాసింధు. భక్తులపట్ల అవ్యాజ్యమైన ప్రేమను కురిపించేవారు. వారి సమక్షంలో జీవుడి అహంకారం ఉన్నప్పటికీ అది ఎక్కువ కాలం నిలువబోదు. చూర్ణమైపోతుంది. కారణం ఆయన

అహంకార శూన్యులు. వివేకానందతో రామకృష్ణుడు "నాకు ఒక్కొక్కసారి సర్వం శూన్యం. దేవుడు, గీవుడు ఎవ్వరూ లేరు అనే భావన జనిస్తున్నది" అనగా వివేకానంద పరమహంసగారితో 'నాకు అటువంటి భావనే జనిస్తున్నది' అన్నారు. పై కోవకు చెందినవారే శ్రీనాన్న గురుదేవులు.

భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్న సమయంలోనే స్కందాశ్రమంలోనూ ఉన్నారు. రెండు సంఘటనలను సాక్షిగా చూసి ఒకరు "ఏమిటి స్వామీ! రెండు ప్రదేశాలలో ఒకేసారి ఒకే సమయంలో ఎలా దర్శనమిచ్చారు?" అనగా భగవాన్ "అప్పుడే చెప్పకపోయావా. ఆ దొంగ సంగతి తేలుద్దుము కదా!" అని మర్మగర్భంగా అన్నారు. అలాగే పాల్‌బ్రంటన్‌కు లండన్‌లో దర్శనం ఇయ్యటం రాసలీలలో పరమాత్మ పదహారువేలమందికి పదహారువేల శరీరాలు ధరించటం. దీన్ని సూక్ష్మ శరీరం ధరించటం అంటారు. అలాగే శ్రీనాన్నగారు 1987లో స్కందాశ్రమం నుంచి విరూపాక్ష గుహకు వెళుతున్నారు. ఒక భక్తుడు "ఈరోజు జిన్నూరు మీటింగ్‌లో ఉండవలసినవారు ఇక్కడికి ఎలా వచ్చారు?" అని టౌన్‌కు పోయి ఎస్‌టిడి ఫోన్ చేసి ఒక భక్తుని అడుగగా 'నాన్నగారు ఇక్కడ ప్రవచనం చేస్తున్నారు' అని చెప్పారు. దీనికి సైన్సు ఏమి సమాధానం చెపుతుంది? ఆధ్యాత్మికం తర్కానికి లొంగదు అంతే. అంతా దైవలీల. అంతే.

ఒక తియోసాఫికల్ సొసైటీ (సొసైటీ అనేది అనిబిసెంట్ నడిపే సంస్థ) భక్తునకు మూడు కోరికలు ఉండేవి. ఒకటి భగవాన్ ఒంటరిగా ఉన్నప్పుడు కలవాలి, రెండు తమ సంస్థ తీరు ఎలా ఉంది? మూడు నేను అర్హుడనని తోస్తే మీ స్వరూపం చూపండి. మొదటిది నెరవేరింది, రెండవ ప్రశ్నకు అడగకుండానే మీ సంస్థ కార్యక్రమాలు బాగానే ఉన్నాయి. మూడవ దానికి ఆ భక్తుడు 'అయ్యా! నేను అర్హుడని తోస్తే మీ స్వరూపం తెలపండి' అని ప్రార్థించగా భగవాన్ శరీర రూపం

మాయమైనది. దాని స్థానంలో అదే ఆకృతితో ఒక వెలుగు కొద్ది నిమిషాలు కనిపించింది. తదుపరి భగవాన్ శరీరం కనిపించింది. దీనిపై భగవాన్ "నాకు రూపం లేదు. నీవు చూసింది దృశ్యం మాత్రమే" అన్నారు. ఈ సంఘటన లాంటిదే 1988 ప్రాంతంలో భగవాన్ ఆశ్రమంలో శ్రీనాన్నగారికి ఒక కాటేజీ ఇచ్చేవారు. అందులో ఉండగా భాను ప్రసాద్ గారికి శ్రీనాన్నగారు తన శరీరాన్ని విడిచి అందు ఒక వెలుగుగా మారారు. భానుప్రసాద్ చెంతనే ఉన్న కెమెరాలో ఆ దృశ్యాన్ని క్లిక్ చేయగా, కెమేరా జడం కాబట్టి శ్రీనాన్నగారు యదార్థంగానే కనిపించారు. ఆ చిత్రాన్ని భానుగారు నాకు చూపగా శ్రీనాన్నగారు కళ్లజోడు ఫ్రేమ్ నుంచి ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. దీని అంతరార్థం ఒక్కటే. నీ బుద్ధిని మార్చే శక్తి నాకు ఉందని శ్రీనాన్నగారు తెలపటం మాత్రమే. ఇది సిద్ధి కాదు. బుద్ధుడు కూడా తాను చెప్పే అంశం సారాంశం భక్తునకు అర్థమయేటట్లు సిద్ధి ప్రదర్శించేవారు. అది శిష్యుని క్షేమానికే. ఈ సంఘటన కూడా ఆ కోవకు చెందినదే.

## 15

శ్రీనాన్నగారిని గురించి భక్తులు ఇలా అనుకొంటారు "మనలను ఉద్ధరించటానికై మానవరూపం ధరించిన ఆ దేవుడేనని. వారిని దర్శించుకొని మన జీవితం సార్థకం చేసుకొందామని". సత్సంగ సమావేశాల రోజున హడావుడిగా ఉంటారు. శ్రీనాన్నగారు "బ్యాటరీ ఛార్జింగ్ లాంటిదే ఈ సమావేశాలు" అని అంటారు. భీమవరం భక్తురాలు తన కుమార్తెతో "నీవు స్కూలుకు వెళ్ళేటప్పుడు ఆంజనేయ స్వామి గుడిలో కొబ్బరికాయ కొట్టి వెళ్ళు, నాకు సమయం లేదు శ్రీనాన్నగారి ప్రవచనం దాటిపోతుంది" అంది. ఆ గడసరి కూతురు ఇలా అంది "నిజమైన దేహంలో ఉన్న దేవుని చూచే ప్రయాణంలో ఈ రాతి దేవుని గొడవ ఎందుకు?" అనగా "తప్పు. అలా అనకు. నాకు పొరుగూరు వెళ్ళేటప్పుడు గుడిలోకి వెళ్ళటం ఆనవాయితీ" అని మందలించింది. జిన్నూరు

రమణ క్షేత్రానికి వెళ్ళింది. లైనులో ఉన్న ఆమెతో శ్రీనాన్నగారు "గుడికి వెళ్ళకుండా సరాసరి ఇలా వచ్చేసారా?" అనగా బిత్తరపోయిన ఆమె లోలోపల ఇలా అనుకొన్నారు "సర్వాంతర్యామి గురు దేవులు. విశ్వ మనస్సు ద్వారా మనలను నిత్యం కనిపెడుతూ ఉన్నారు. మనకు ఏ లోటూ లేదు, రక్షకుడు ఉండగా" అనుకొని పరమానందం చెందారు. భక్తులపాలిట ఇటువంటివి కోకొల్లలు. అన్నీ చెప్పాలంటే పెద్ద గ్రంథమే అవుతుంది. ప్రస్తుతం ఇటువంటివి ఏమీ అనటంలేదు. వాళ్ళు గుర్తిస్తే ఏమిటి? గుర్తించకపోతే ఏమిటి? అని ఆ భక్తుల విషయంలో మన పని ఏదో మనం నిశ్శబ్ధంగా చేసుకొనిపోదామని ఉంటున్నారు. కానీ గమ్యానికి చేరుకొనే మార్గం ఏమిటో ఆయన అందరికీ విశదపరుస్తారు ఉపమానాలతో. సమావేశంలో భక్తుల నడవడిలోని పొరపాట్లను సరిజేసి చెబుతూ ఉంటే భక్తులు "గుండెల మీద చేయి వేసుకొని ఔరా నా గురించే చెబుతున్నారు" అనుకొని సత్ప్రవర్తన మార్గంలో ఉంటారు. ఈ మాటలు ఇతరులకు కూడా ఉపయోగపడుతుంది. ఆ అనంత ప్రేమమూర్తి, ప్రసన్నమూర్తి ప్రేమను వేనోళ్ళ తలచుకొని మురిసిపోతారు. శ్రీనాన్నగారు ఒకరిపై ఎందుకు కోప్పడతారో, మనకు ఎన్ని చివాట్లు పెడతారో తెలియదు. మనలో తెలియని ఏదో లోపం ఉందని, అది తన తప్పేనని మరలా వారి దగ్గరికే వెలతాము. ఒక్కొక్క సంస్కారం తొలగటానికి అలా వ్యవహరిస్తారు. మరుసటిరోజు అంతా మర్చిపోయి ప్రేమతో లాలనగా మాట్లాడతారు. ఇది భక్తుల అనుభవమే. భగవాన్ "పులినోట్లో పడ్డ మాంసపు ముక్క" అన్నారు. మనలను ఇన్ని మాటలు మాట్లాడారు వారితో మనకు పనిలేదని బింకాలు, కోపతాపాలు అక్కడ నిలబడవు. శ్రీనాన్నగారిని మనం తెలుసుకోగలమా! ఒకోసారి మనం ఆయన్ని మంచిగానో, ఒకోసారి చెడుగానో భావిస్తాము. ఆయన మనలను మహా మాయలో పడేస్తారు. కొందరు గత జన్మల్లో అనుబంధం అంతగా లేనప్పుడు శాశ్వతంగా దూరమై మరో మంచి గురువును ఎంచుకొందామని వెళ్ళిపోతారు.

గురు తిరస్కారం తూరీయాన్ని తాకనియ్యదు. దీనిపై షిరిడీ సాయిబాబా "మామిడి చెట్టు పూతలో మంచుకు చాలా రాలిపోతాయి. ఉదుకు పిందెలు కొన్ని రాలిపోతాయి, కొందరు రాళ్ళతో కొట్టి వేరుచేస్తారు. కోతులు, పక్షులు కొన్ని తింటాయి. చెట్టుని అంటిపెట్టుకున్నవి కొన్ని మాత్రమే ఫలించి మధుర ఫలాలుగా తయారవుతాయి. అలాగే గురువుని అంటిపెట్టుకొన్నవారు మాత్రమే తరిస్తారు" అన్నారు.

16 కొందరికి సంసార విషయంలో భార్య వల్ల భర్తకు, భర్త వల్ల భార్యకు వచ్చే క్లేశాలను భరించలేక జీవితం మీద ఏవగింపు కలుగుతుంది. గురుదేవులను కడసారి చూచుకొని శరీరాన్ని వదిలించుకొందామని నిర్ణయించుకొంటారు. భగవాన్ సమక్షంలో ఒక టీచరు ఈ ఉద్దేశ్యంతో రాగా భగవాన్ కుట్టుడాకు కుడుతూ "మాష్టారు ఈ ఆకు తయారైనది, దీనితో భోజనం చేసి పారవేస్తే పొరపాటు లేదు. భోజనం చెయ్యకుండా పారవేస్తే ఏమి జరుగుతుంది" అనగా 'మరో ఆకు కుట్టుకోవాలి' అనగా భగవాన్ 'భగవంతుడు ప్రసాదించిన జీవితాన్ని అంతం చేసుకోవాలి అనుకోవటం వచ్చే జన్మలో వారే సిద్ధమై మనల్ని పీడిస్తారు. ఆత్మహత్య పరిష్కారం కాదు' అన్నారు. అలాగే శ్రీనాన్నగారు వద్దకు ఒక అమ్మగారు ఆత్మహత్యా ప్రయత్నంలో గురుదేవులను దర్శించి ఆ పని చేసుకొందామని రాగా సర్వాంతర్యామి అయిన ఆయన 'నేను నీ సమస్యను సరిజేస్తాను' అని స్వయంగా యజమానిని కలుసుకోగా ఆయన పూర్వపు బాహ్యామైన విపరీత భావాలు శ్రీనాన్నగారి చూపుతో చెరిగిపోయాయి. ఆ అమ్మగారి జీవితం సాఫీగా సాగిపోతున్నది. ఇది గురువు చూపు వైభవం. ఇలాంటి అభాగ్య జీవుల సంసారం అంతా సౌభాగ్య జీవితాలుగా మారిపోతున్నాయి. రమణులు మనకు ఏమి బోధించారు "నీ ఆలోచనల యొక్క మూలమును కనుగొనుటకై అన్వేషణ జరిపి మనస్సును నశింపచేసుకొనవలెను తప్ప శరీరమును నశింపజేయరాదు. ఈ శరీరము ఇన్నాళ్ళు మీకు సేవలందించినది. అటువంటి శరీరంపై కక్ష

తీర్చుకోవటం ఎందుకు?" అన్నారు. ప్రత్యక్ష ప్రమాణం చెప్పమంటే అది అత్యంత గోప్య విషయాలు. దానివల్ల సంసారాల్లో మరల అల్లకల్లోలాలు ప్రారంభమౌతాయి. అది అంతే. ఇలాంటి ఒక అమ్మగారు పాలకోడేరు గ్రామం ప్రాంతం వారు ఒక సమావేశం తరువాత భావోద్వేగం ఆపుకోలేక శ్రీనాన్నగారి రెండు చేతులు తన తలపై ఉంచుకొని భోరుభోరున ఏడుస్తూ "ఈ జన్మకు ఈ హితబోధ చాలు, నా కళ్ళు తెరిపించారు" అని కళ్ళనీళ్ళు తుడుచుకొని ప్రశాంతంగా వెళ్ళిపోయింది. నాటి ప్రవచనం తరచి చూడగా ఆత్మహత్య ప్రయత్నమని నిశ్చయించుకొన్నాను, ఇది నేను ప్రత్యక్షంగా చూచిన విషాద దృశ్యకావ్యం. ఈ సంఘటన 1988వ సంవత్సరంలో జరిగింది.

17 ఒక ఉన్మాది ఉద్రేక స్వభావం గల వ్యక్తి శ్రీనాన్నగారు ఒంటరిగా ఉన్న సమయంలో వారి ఇంటికి వెళ్ళి "అయ్యా నేను నా భాగస్వామిని చంపి నా ఇంటి ప్రాంగంణంలో గొయ్యి తవ్వి పాతిపెట్టాను. ఎవరకీ ఆచూకీ తెలియలేదు. మూడు సంవత్సరాల తర్వాత ఆ ఇల్లు అమ్మగా ఆ కొన్నవాడు ఇంటిని పడగొట్టి మంచి ప్లానుతో మరో ఇల్లు కట్టడానికి పునాదులు తీస్తుండగా ఎముకలు బయటపడ్డాయి. నామీద ఎవరికీ అనుమానం రాలేదు. చేసిన పాపం జ్ఞానికి చెప్పుకుంటే పోతుంది అంటారు. నన్ను క్షమించండి" అని కన్నీరు పెట్టుకోగా శ్రీనాన్నగారు "నాతో చెప్పారు సరే. ఎవరి వద్ద అనకండి" అని ఈవిషయం చెప్పి పంపారు. జన్మాంతరంలో ఏదో సత్కర్మ చెయ్యటం వల్ల గురుదేవులకు తెలిపి సంతృప్తిగా వెళ్ళిపోయాడు. ఇటువంటి సంఘటనలు జరుతాయి. పాప పరిహారానికి ప్రాయశ్చిత్తానికి మించిన మందు మరియొకటి లేదంటారు. నిజమే మరి. "తప్పు చెయ్యటం మానవ సహజం, కానీ తిరిగి ఆ తప్పును మరలా చెయ్యకూడదు" అంటారు శ్రీనాన్నగారు. ఒక స్త్రీ అనాచారంగా జీవించటం పాపంకాదు, అది ఒక పొరపాటు అంటారు. బుద్ధుడికి వైశాలి నగరంలో

అమ్రపాలి అనే వేశ్య, ఏసుకు మేరీ మేగ్దలిన్, భగవాన్‌కు తారసపడినా వేశ్యను ఏవగించుకోలేదు. వారి చూపుతో పాపపంకిలమైన జీవితంపై రోత కలిగి సత్‌ప్రవర్తనలో జీవించి తరించారు. అది గురు వైభవం.

## సాధనా రహస్యాలు

18 గురువు కళ్ళలోకి చూస్తూ వారి కళ్యాణ గుణాలను స్మరించగానే రోమాంచితం కావటం నవవిధ భక్తి మార్గాలను నారదులు తెలిపారు. కళ్ళలో నుంచి అశ్రుధారలు స్రవించటం, నవవిధభక్తి మార్గాలను నారదభక్తి సూత్రాలలో సవివరంగా తెలిపారు. ఇవి అన్నీ భగవదనుభూతుల లక్షణాలు. గురువుపట్ల శుద్ధభక్తిని పొందటానికే, సత్యాన్ని తెలుసుకోవటానికే. దీనినే శరణాగతి మార్గము ప్రపత్తి మార్గం అంటారు. ఇందులో 'ఆర్తి' ప్రక్రియ అత్యంత ప్రముఖ పాత్రను పోషిస్తున్నది. శ్రీనాన్నగారు "ఏసు భక్తులకు బైబిల్ ఎటువంటిదో, రమణ భక్తులకు అక్షరమణమాల అటువంటిది. అక్షరమణమాలలో ప్రతీ ద్విపదలో 'ఆర్తి'ని శిష్యులు అలవరుచకోవాలి" అన్నారు. శ్రీనాన్నగారు సాధనామార్గం అంతా ఈ కోవకు చెందినదే. వారి పెంకుటింటిలో వీధి గదిలో సాయంకాలం భోజనం చేసిన తరువాత తలుపులు మూసుకొని భగవాన్ కళ్ళలోకి ఆర్తితో చూస్తూ రాత్రి 2 గంటల సమయం వరకూ అలా ఉండగా వారి కళ్ళ నుంచి గంగ, యమునలా ఆనంద భాష్పాలు రాలేవి. ఇవి ఆ రోజుల్లో శ్రీనాన్నగారి ఆంతరంగిక భక్తులు తెలిసిన విశేషాలు. ఈ సాధనతోనే తాను భగవాన్ అనుగ్రహానికి పాత్రులైనా, తరచు సమావేశాల్లో పదే పదే తన అనుభవాన్ని రమ్యంగా రంగరించి చెబుతూ ఉండేవారు. మనం వారి అనుభవ వచనాలను ఆర్ద్ర హృదయంతో తెలిపే తీరు ఆచరిస్తే మనలో బండరాళ్ళు వంటి విషయ వాసనలు కానియ్యండి మరో వాసనలు కానియ్యండి గూడుకట్టుకున్న రాళ్ళు కరిగిపోతాయి.

శ్రీనాన్నగారి సాధనా ప్రక్రియను నిత్యం మనం అలవర్చుకోవాలి. ఇది అత్యంత తేలికైన భక్తిమార్గం. విచారణాభూతం మనలను కడతేరనియ్యదు. ఆయన పట్ల పసిపిల్లల వంటి హృదయాన్ని అలవర్చు కోవాలి. తల్లి మాటను బిడ్డ విశ్వసించినట్లు మన లోపల నుండి సత్యానుభవానికై వ్యాకులత రావాలి. అది ఒక్కటే కావాలని వాంఛించాలి.

పరమహంసగారు సాహిత్యంలో "తల్లి ప్రక్క ఇంటి ఆవిడతో కష్టసుఖాలు మాట్లాడుతూ ఉంటే చిన్నారి బిడ్డ తల్లి కొంగు పట్టుకొని ఐస్‌క్రీమ్ కావాలి, డబ్బులు ఇయ్యి అని అదే లోకంగా మారాం చేస్తే తల్లి "అది చెడ్డ ఆహారం, మీ నాన్నగారు తిడతారు. నేను నీకు డబ్బులు ఇయ్యను" అనగా బిడ్డ ఎక్కి ఎక్కి ఏడిస్తే ఆ గోలను భరించలేక తల్లి ప్రక్క ఆవిడతో మా అబ్బాయికి డబ్బులు ఇచ్చి వస్తాను అని వెళ్ళి పైసలు ఇస్తుంది. అలాగే గురువును మనం "నేను జ్ఞానహీనుడను, సాధనాహీనుడను, భక్తిహీనుడను. నాకు ఏమీ తెలియదు. దయచూపి నీ నిజదర్శనం ఇచ్చి తీరవలసినదే అని ఎక్కి ఎక్కి ఏడవాలి" అన్నారు పరమహంసగారు. శ్రీనాన్నగారు "మనం మన పిల్లలకోసం ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాము వాళ్ళ జీవితాల గురించి, భగవంతుని కోసం ఎక్కి ఎక్కి ఏడ్చేవారు ఎంతమంది ఉన్నారు?" అన్నారు. ప్రేమ సుధను పంచిపెట్టే మన గురువును మనం రాత్రి పగలు తీరిక దొరికినప్పుడెల్లా వారికి ప్రేమదాసులుగా మారాలి. ఆ ప్రక్రియలో గ్లిజరిన్‌తో కన్నీళ్ళలా కాకుండా, తెచ్చిపెట్టుకొన్నట్లు కాకుండా సహజమైన ఆర్తితో ఏడుస్తూ "ఓ దీనబంధూ!" అని మొరపెట్టుకోవాలి. వారి ప్రేమ సంతలో ఆనంద దుకాణాలు అన్నీ తెరువబడి కావలసినంత ఆనందాన్ని పొట్టనిండా జుర్రుకోవచ్చు. దీనికి ముందు భోగాలను మనం సంపూర్ణంగా త్యజించాలి. అప్పుడు ఆ ప్రసాంత భావ పారవశ్యము పరిపక్వమైతే మహా ప్రేమ స్వరూపంగా గురువుగా మారిపోతాము. దీనినే పెద్దలు 'భ్రమర కీటక న్యాయం' అంటారు. ఈ ప్రక్రియలో కృతార్థులైతే 'ఏమి చెప్పగలం, ఆ ఆనందాన్ని ఎంత

చెప్పగలము?' అంటారు పెద్దలు. దీనికి గురువుపై కడవలకొద్దీ కన్నీటి ఆనంద భాష్పాలను కృతజ్ఞతతో అంజలి ఘటించాలి. ఏ ఋణమైనా తీర్చగలం కానీ ఇరువది నాలుగు గంటలు కంటికి రెప్పలా కాపాడే సద్గురువు ఋణం ఎన్ని జన్మలు ఎత్తినా తీర్చలేమని నిజ భక్తుల వేదన, ఆవేదన. గురు ప్రేమలో ఫలాపేక్ష లేదు, "ప్రేమించే మాతృ హృదయాన్ని వికసింప చెయ్యటంలో ఎంత శ్రమనైనా లెక్కచెయ్యక విసుగు విరామం లేకుండా తన పని తాను చేసుకొనిపోతారు – మనలను సత్యదర్శనం చేయిస్తారు" గురుదేవులు.

19 ఎవరి జీవితం వేదమయమై ఒప్పారుతుందో, ఎవరి నోటి నుండి వెలువడే వచనాలు అన్నీ వేదాంత విషయాలు అవుతాయో, ఎవరి ముఖతా భగవంతుడు మాట్లాడుతున్నాడో, ఎవరి వచనామృతం భగవతాదులుగా అలరారుతున్నాయో, ఆ కృపా సింధుడైన పురుషుడే గురు రూపంలో శ్రీనాన్నగారు మాట్లాడుతున్నారు. వారి ప్రవచనం అంతా వేదానికి సరితూగుతుంది. వారి ప్రవచనంలో ఒకోసారి ప్రకృతి మనుషుల నడవడిక, ఒకోసారి చోటు చేసుకొంటాయి, అవి భక్తులకు అమాయకత్వం పనికిరాదని, తెలివి కావాలని, వ్యవహారంలో దయ పనికి రాదని తెలుపుతారు. ఆ సందర్భంలో రాజకీయ నాయకుల లోపాలను ఎత్తి చూపుతూ ఉంటే శ్రీనాన్నగారు అంటారు 'సబ్జక్టు నుంచి తప్పుకొన్నందుకు భగవాన్ నా తలపై మొట్టికాయ పెడుతున్నారు' అనేవారు. భగవాన్ సమక్షంలో ఒకరు హరిజన పత్రికలో గాంధీజీ అన్న ఈ మాటను "నేను ఈ రాజ్‌కోట ప్రయాణానికి ఎందుకు వెళుతున్నానో నాకే తెలియదు? నా సంకల్పాలు, నా ఊహలు అక్కడ చెల్లవు. ఈశ్వరుడే నడిపిస్తున్నాడు" అన్నారు. "ఆ మాట యదార్థం" అని భగవాన్ అన్నారు. అంటే జ్ఞాని బుద్ధిని ఈశ్వరుడు వినియోగించుకొంటాడని అర్థం. శ్రీనాన్నగారికి కూడా పై విషయం ముమ్మాటికి వర్తిస్తుంది.

సమావేశాలకు కొందరు భక్తులు ఆలస్యంగా వస్తే శ్రీనాన్నగారు హాలు బయటకు వచ్చి వారితో అపారమైన కరుణతో విషయాన్ని సంక్షిప్తంగా తెలుపుతారు. ఆ భక్తులు ఆనందపడతారు. భగవాన్ సమక్షంలో బెంగాల్ ప్రముఖ గాయకుడు దిలీప్ కుమార్ రామ్ పాటలు పాడేవారు. అలాగే శ్రీనాన్నగారి సమక్షంలో కర్ణాటక సంగీతంతో నిష్ణాతులుగా పేరుపొందిన తెలుగువారు మధురైమణి అయ్యర్ సత్సంగాలలో త్యాగరాయ కృతులు, పంచరత్న కీర్తనలు ఆలపించారు. అలాగే మరో ఆమె భారతదేశంలోనే వీణలో ఎమినెంట్ ఆర్టిస్టు పుట్టు గుడ్డి అయిన గాయత్రి వీణతో తిరువణ్ణామలైలో భగవాన్ హాలులో శ్రీనాన్నగారి సన్నిధిలో అత్యంత మధురంగా వీణానాదం చెయ్యగా శ్రీనాన్నగారు "నేను పూర్తి సంతృప్తి చెందాను" అనగా కృతజ్ఞతతో వందనం చేసారు. దీపం వెలుగుతూ ఉంటే పురుగులు గుంపులు గుంపులుగా వాటంతట అవే వస్తాయి, పిలవవలసిన అవసరం లేదు. అలాగే సద్గురువుకు వశీకరణ శక్తి ఉంటుంది. దానితో భక్తులు వారంతట వారు పరుగులిడి వస్తారు ముందు కూర్చోవటానికి. భక్తి గల రాజకీయ నాయకులు, సంపన్నులు పళ్ళు, మిఠాయిలు, ధనం, శాలువాలు సమర్పిస్తారు. భక్తులలో ముఖ్యమైన పాలకోడేరు రామచంద్రరాజు అందమైన పళ్ళు ప్రేమపూరితంగా సమర్పిస్తే ఎప్పుడూ ఆ పళ్ళు చూడనట్లు తదేకంగా ముచ్చటగా చూచి దగ్గర ఉంచుకొంటారు, కొన్ని భక్తులకు ప్రసాదంగా అందిస్తారు. రామచంద్రరాజు అంతిమకాలంలో వారిని చూడటానికి హైదరాబాద్‌నుంచి ట్రెయిన్‌లో వస్తూ భీమవరంలో దిగారు. అప్పటికే రామచంద్రరాజు మరణించాడు. వారి పార్థివదేహాన్ని మోసే నలుగురిలో ఒకరిని తప్పుకోమని తాను కొంతదూరం మోసారు. అది రామచంద్రరాజుపై వారికి ఉన్న అపార ప్రేమ. ఇటువంటి గురుప్రేమికులు చాలా అరుదుగా కనిపిస్తారు.

20 పశ్చిమ గోదావరి జిల్లా 'చిమటం' దిగంబర మాత సాధకురాలుగా కటిక దరిద్రం అనుభవించింది. తాగుబోతు భర్త తన కూలీ పని సొమ్ములను లాగి వెళ్ళిపోయేవాడు. ఒక బిడ్డ ఆకలితో కాలం చేసింది. కలుపు తీస్తూ ఉంటే తన స్నేహితురాలు "వేల్పూరులో కురుమద్దాలం పిచ్చెమ్మగారు వచ్చారట. నీ కష్టాలు ఆమెతో చెప్పుకో" అనగా "నా దగ్గర డబ్బులు లేవు" అనగా కొంగున ఉన్న పది రూపాయలు ఇయ్యగా వెళ్ళి అమ్మతో తన కష్టాలు తెలుపగా ఆమె "అన్నీ మర్చిపో" అని మూడుసార్లు గట్టిగా అంది. పరిపూర్ణ పక్వ స్థితి వస్తే జ్ఞాని యొక్క ఒక్కమాట, ఒక్క చూపు, ఒక్క స్పర్శ చాలు తరించటానికి అంటారు. వంద గజాలు నడిచి ఆత్మానుభవం అయినది, ఈ శరీరం నేను కాని దానికి చీర ఎందుకు అని విసర్జించి అవధూతగా ఎంతో పేరు ఉండేది. రేపల్లె చిన్నమ్మగారు, మాముడూరు బుచ్చెమ్మగారి సమకాలీకులే. వారి జీవిత చరిత్రలు భరద్వాజ గారి సాహిత్యం తెలుసుకోవచ్చును. అలాగే బ్రాహ్మణచెరువు సమీప గ్రామంలో శ్రీనాన్నగారి మీటింగ్ జరుగుతోంది. చేలో కలుపు తీస్తున్న ఒక స్నేహితురాలితో ఒకామె 'నీకు నాన్నగారంటే ప్రాణం కదా! మీటింగుకు వెళ్ళు' అంటే 'నా దగ్గర డబ్బులు లేవు' అనగా కొంగున ఉన్న పదిరూపాయలతో కేరేజీలో అన్నం తిని, ఖాళీ కేరేజీతో మీటింగుకు వచ్చింది. సమావేశం అనంతరం మాతో ఈ విషయం ఆర్తితో చెప్పింది. శ్రీనాన్నగారి దర్శనమైనదని పరమామనందంతో మాతో అంది. ఇది ఏ జన్మాంతర బంధమో, ఏమిటో? పఠనం కంటే శ్రవణం గొప్పది. దానికంటే గురుదర్శనం, గురుముఖతా విన్నది హృదయానికి హత్తుకుంటుంది. ఎర్రనీళ్ళలో ఇండిపకాయ కలిపితే మడ్డి దిగి స్వచ్ఛమైన నీరుగా పైకి తేలుతుంది. మనం వివేక, వైరాగ్యాలతో ఉంటే స్వచ్ఛతను పొందుతాము. శ్రీనాన్నగారి అమృతవచనాలను కొందరు వ్రాతపూర్వకంగా నిక్షిప్తం చేసుకొంటారు అపురూపంగా. కొందరు సెల్‌లో మూటకట్టుకొని తరగని నిధిలా ఇంటికి వెళ్ళి

తరచుగా చూసుకొంటూ అందరికీ ఆ సందేశాన్ని పంచిపెడుతూ ఆనందిస్తారు. శ్రీనాన్నగారి రూపంలో మాటల్లో కారుణ్యం ఉట్టిపడుతుంది. వారిది సహజమైన, సరళమైన బోధ.

21 రామకృష్ణ పరమహంసగార్కి కాశీలో శివ దర్శనం అయినది. మరోసారి అక్కడే బంగారంతో రూపొంది ఉన్న అన్నపూర్ణాదేవి దర్శనమైనది. భగవాన్ని ఒకరు 'మీకు ఎప్పుడైనా కలలు వస్తాయా?' అనగా 'వస్తాయి. గుళ్ళు, గోపురాలు' అన్నాయి. శ్రీనాన్నగారు కడప ప్రయాణం అవుతూ ఉంటే నేను 'ఒంటిమిట్ట రామాలయాన్ని దర్శించండి' అన్నాను. అలాగే కారు అక్కడ ఆగింది. బోర్డులో ఒంటిమిట్ట రామాయణం అని ఉంది. అక్కడ వాసుదాసుగార్కి రాములవారు ప్రత్యక్షమై వాల్మీకి రామాయణాన్ని తెలుగులో వ్రాయి అని కాగితాలు, కలం ఇచ్చారు. ఆయన అక్కడ 'మందరం' వ్రాసారు, వైష్ణవులకు అది అత్యంత ప్రమాణ గ్రంథం. శ్రీనాన్నగార్కి అర్చక స్వాములు సత్కరించారు. శ్రీనాన్నగారు శ్రీరాముల వారి రాతి విగ్రహం అరిగిపోయింది, ముసలిదిగా ఉందని అనిపించగా రాములవారు శ్రీనాన్నగారితో 'నీవు విగ్రహాన్ని చూస్తున్నావా? నన్ను చూస్తున్నావా?' అని సందేశం అందించగా విషయం గ్రహించి చిరుమందహాసంతో మౌనంగా ఉండిపోయారు.

22 శ్రీనాన్నగారికి దిll 30-03-2006లో రాత్రి 2 గంటలకు కలలో కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి పరమాచార్యులవారి కలలో దర్శించారు. ఆయన అంటే నాకు ఇష్టం. ఆయన రెండు పళ్ళు నాకు ఇస్తూ ఉంటే నేను తీసుకోవటానికి సంకోచిస్తూ ఉంటే నాతో "ఈ రెండు పళ్ళు ఏమిటి అనుకొంటున్నావు. ఒకటి అందం, రెండు సత్యం. ఈ రెండూ ఉంటే కోటి జన్మల కర్మఫలం కూడా నాశనమౌతుంది. ఇవి రెండూ ఒకటి లేకుండా ఒకటి ఉండవు" అన్నారు. ఇవి రెండూ నాన్నగార్కి

కలిగాయి. దీనినే 'సత్యం శివం సుందరం' అంటారు. లోక క్షేమాన్ని కోరే బుద్ధుడు, రామకృష్ణుని ఆలోచనా వైభవాన్ని స్మరించుకొంటున్నాము.

శ్రీనాన్నగారు ఏ క్షేత్రాన్ని దర్శించినా ఆ క్షేత్రపాలకులు స్వప్నంలో దర్శనం ఇయ్యటం సర్వసాధారణం. షిరిడీలో శ్రీబాబాను దర్శించిన రాత్రి స్వప్నంలో మేలిమి బంగారంతో మెరిసిపోయే ఆంజనేయ స్వామి దర్శించారు, అది అతి సుందర మనోహర రూపం. దానిపై శ్రీనాన్నగారు "నేను బాబాను దర్శిస్తే మీరు ప్రత్యక్షం అయ్యారు ఏమిటి?" అనగా "నా మూల విరాట్ ఇదే. నా ప్రతిబింబమే అది" అన్నారు. నిష్కామకర్మకు ప్రతిరూపమైన ఆంజనేయ స్వామి ఆలయాలు ప్రతీనీలాంటి రేవులోనూ ప్రత్యక్షమౌతాయి. అదే వైభవం కావటం వల్ల ప్రతీ గ్రామంలో బాబా దేవాలయాలు వెలుస్తున్నాయి. శ్రీనాన్నగారు తిరుత్తణిలో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించారు. ఆ రాత్రి తిరుత్తణిలో స్వామి కలలో కనిపించి రేపు నీ ప్రయాణం ఎక్కడికి? అనగా "అరుణాచలం స్వామి" అనగా "అలాకాదు నిన్న నీవు నన్ను వట్టి చేతులతో దర్శించావు. అరుణాచలం ప్రయాణం ఆపుచేసుకొని రేపు ఉదయం స్నానం చేసి, కాఫీ తాగకుండా పళ్ళు సమర్పించి ప్రసాదాన్ని స్వీకరించి వెళ్ళు" అన్నారు. దీనికి అనుగుణంగానే మరునాడు స్వామిని దర్శించారు. శ్రీనాన్నగారు "నేను కాఫీ తాగుతానని వారికి ఎలా తెలుసు?" అన్నారు. నిరంతరం బిడ్డ క్షేమాన్ని చూచే ప్రభువుకు తెలియకపోవటం ఏమిటి అనుకోవాలి.

తమిళనాడులో సుబ్రహ్మణ్య క్షేత్రాలు ఆరు. అవి 1. ఫళని, 2. తిరుత్తణి, 3. తిరుచెందూర్, 4. తిరువణ్కుంద్రం, 5. స్వామిమలై, 6. అలగర్ కోయిల్. పద్దెనిమిది పురాణాల్లో స్కాందపురాణం పెద్దది. స్కందుడే సుబ్రహ్మణ్యుడు. ఆయన్ని పూజించేవారిని 'కౌమారం' అంటారని శ్రీనాన్నగారు తెలిపారు.

శ్రీనాన్నగారు భగవాన్ ఫొటో వంక తదేకంగా చూస్తూ వారితో "మీరు

శరీరంలో లేరు కదా!" అనగా భగవాన్ "లేని మాట నిజమే కానీ నీవెంటే ఉన్నాను కదా!" అనే సందేశం వచ్చింది. అంటే నీ చర్యలను నేను చూస్తున్నాను అని అర్థం అన్నారు శ్రీనాన్నగారు. మరలా "సుబ్రహ్మణ్య స్వామికి నాకు చుట్టరికం ఉంది. ఆయన దేవతా పురుషుడు, మేము మానవులము. ఇది రెలిటివ్‌గా కనిపిస్తుంది. ఆయన విగ్రహం ఎక్కడ కనిపించినా నమస్కారం పెట్టాలని అనిపించదు. అంటే ఇష్టం లేకకాదు, ఇంట్లో వాళ్ళను గౌరవించటం ఏమిటి? అది జన్మాంతర అనుబంధం ఉంది. పూజ చెయ్యకపోయినా నా హృదయంలో అత్యంత సన్నిహితుడు" అన్నారు.

## 23

శ్రీనాన్నగారు సాధకులుగా ఉన్నప్పుడు అంటే ఒక్క ఎస్. రామచంద్రరాజు గారు తప్ప భక్తులు ఎవరూ చేరలేదు. శ్రీనాన్నగార్కి భగవాన్ భక్తుడని సామాన్యమైన పేరు ఉంది. దాన్ని పురస్కరించుకొని పాలకొల్లు రమణ సత్సంగం వారు శ్రీనాన్నగారితో "అయ్యా! భగవాన్ జయంతి పాలకొల్లులో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతున్నది. ఆ సమావేశానికి తమరు వచ్చి నాలుగు మాటలు మాట్లాడాలి" అని ప్రేమతో నిర్వాహకులు పిలిచారు. వారు వెళ్ళిన తరువాత శ్రీనాన్నగారు "మనకు ఉపన్యాసం చెప్పే స్థాయి రాలేదు. తడబడితే నవ్వులపాలౌతాము" అని వెళ్ళకూడదని నిశ్చయించుకున్నారు. భగవాన్ నిర్ణయం మరోలా ఉంది. ఆ రాత్రి భగవాన్ స్వప్నంలో "నీవు పాలకొల్లు మీటింగుకు వెడతావు, మాట్లాడతావు" అంటూ అక్కడ హాలు, భక్తుల సమావేశం అంతా కళ్ళకు కనిపించినట్లు చూపారు. మరునాడు ఆ సమావేశానికి వెళ్ళకూడదని నిర్ణయించుకున్నారు కానీ మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రేమతో పిలిచారు మౌనంగా కూర్చుందామనుకొని వెళ్ళారు. మీటింగ్ హాలు భక్తులతో నిండిపోయింది. మనలను మాట్లాడమని అనకుండా ఉంటే అదే పదివేలు అని ఒకచోట కూర్చుని ఉండగా మైకులో జిన్నూరు వాస్తవ్యులు శ్రీ లక్ష్మీనరసింహ రాజుగారిని వేదికపైకి వచ్చి ప్రవచనం చేయవలసినదిగా పిలుపు రాగా బాగోదని

కొంత ధైర్యం తెచ్చుకొని మైకు ముందు నిలబడ్డారు. ఇది చికాగోలో సర్వమత సభలో వివేకానంద సంకట స్థితిలో ఉండగా పరమహంసగారి ప్రేరణతో మాట్లాడినట్లు ఉంది. ప్రేరకుడు వారి గురుదేవులే. ఇక్కడ భగవాన్ బిడ్డయైన శ్రీనాన్నగారు మాట్లాడారు అంతే తేడా. పరమహంసగారు "ఎలాంటి వ్యక్తులు ఇక్కడికి వస్తారో వారు రావటానికి ముందే అమ్మ నాకు వెల్లడించబడుతుంది" అన్నారు. ఇక్కడ శ్రీనాన్నగార్కి భగవాన్ తెలిపారని తెలుస్తుంది. పరమహంసగారు "హృదయపూర్వకంగా జపధ్యానాలు చేసినవారు అందరూ ఇక్కడికి వచ్చితీరుతారు" వివేకానందతో పరమహంసగారు "నీవు జనానికి బోధిస్తావు" అనగా "నా వల్ల కాదు" అనగా "నీ నరాలు, ఎముకలు బోధిస్తాయి. నీ ద్వారా పలు గొప్ప కార్యాలు నిర్వహించబడాలి. నాలోని ఆ శక్తిని నీకు ప్రసరింప చేస్తాను" అన్నారు. ఇది శ్రీనాన్నగార్కి భగవాన్ శక్తిని పూరించి పనిచేయిస్తున్నారు అని తెలుస్తున్నది. శ్రీనాన్నగారు మూడు గంటల సేపు వారి వచనామృతాన్ని విని భక్తులు ఆనందించారు. అప్పటి నుంచి భక్తులు వారి ప్రవచనానికి ఆత్రుత కలిగి ఉంటారు. భగవాన్ మాట ముందు శ్రీనాన్నగారి శపథాలు చెల్లుబాటు కాలేదు. తదనంతర కాలంలో శ్రీనాన్నగారు అనే దివ్యమంగళ నామంతో అలరారారు.

24 పాలకొల్లులో మద్యం దుకాణం ప్రారంభోత్సవానికి రావలసినదిగా ప్రేమతో ప్రాధేయపడితే అంగీకరించి వెళ్ళి రిబ్బన్ కత్తిరించారు. చూసేవాళ్ళకు ఇదేం పని? వారు ఒప్పుకోవటం ఏమిటి? అని మల్లగుల్లాలైపోయారు భక్తులు కొందరు. కానీ శ్రీనాన్నగారి ఉద్దేశ్యం అక్కడ వారు ఆర్థికంగా బాగుపడటం ముఖ్యం. ప్రేమ దాసుల పలుకులు ఆకాంక్షించటమే దైవీ విధానం అని, నిజంగా అది ఒకటికి రెండింతల అతీతమైనది అంటారు పెద్దలు. గురువు గురించి వివేకానంద "నా గురువు కల్లు దుకాణానికి వెళ్ళినా సరే ఆయన నిత్యానంద స్వరూపుడే" అన్నారు. భారతంలో ధర్మ వ్యాసుడు మాంసం

అమ్మే కులం, కుల ధర్మాన్ని ఎవరు కించపరిచినా లేక్క చెయ్యరు. బ్రాహ్మణుడు కూడా వారి ధర్మాన్ని తెలుసుకొని సంతోషించిన సంఘటన మనం అర్థం చేసుకోవాలి. శ్రీనాన్నగారిని బట్టల షాపులకు, ఆటో మొబైల్ షాపులకు ప్రారంభోత్సవానికి తీసుకొని వెడతారు. శ్రీనాన్నగారికి బట్టలు బహూకరిస్తే వాళ్ళ గల్లా పెట్టెలో నాలుగింతల రూపాయలు పెట్టి వస్తారు. అది యజమానికి ఆనందం. అలాగే పాలకొల్లులో ఒక టవర్ ఓపెనింగ్‌కు పిలిస్తే దానిపై ఇలా ఉంది 'శ్రీనాన్నగారి టవర్స్' అని. 'ఆ పేరు చూసి నాకు ఆనందం కలిగితే నేను జ్ఞానిని కాను' అన్నారు. జ్ఞానికి పేర్లు బహుమతులు బంధించ జాలవు. వారికి ఇచ్చినవి తిరిగి భక్తులకే పంచిపెట్టి వట్టి చేతులతో ఇంటికి వస్తారు. బంధం లేదు - బాధ లేదు. శ్రీనాన్నగారి ప్రారంభోత్సవాలకు కూడా భక్తులు వెడతారు. ఒక జ్ఞాన సంబంధమైన మాట కోసం వెడతారు. ఆ ముద్దులొలికే ఆ ముక్తాక్షరంబులు "ఓ సౌశీల్య - సౌజన్య నిధి మాకొసంగు నీ నిర్మల జ్ఞానము, శుద్ధ భక్తిని, శుద్ధ ప్రేమను, పూర్ణ ప్రశాంతిని మాపై ప్రసరింపచేయుము. నీ చరణాలయందు భక్తిని ఒసంగుము" అంటారు. శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలిలో "నాభి పరిమళం కస్తూరి గలదని నీవా కస్తూరిని మృగమునకే విధి తెలిపెదవు - ఏ విధి బోధన చేయుదువు. దారి చూపెడు సద్గురుని సాయము లేక - మనుజుడు తిరుగుతు లోకమున బుద్ధిలేని కస్తూరి మృగము వలె అంధ ప్రాయముగ భ్రాంతి చెందుతూ" అంటారు.

రామకృష్ణుడు నరేన్‌తో "ఆ పరమాద్భుత దరహాసాన్ని నా జ్ఞాపకాల సొరుగు గుహల్లో గోప్యంగా తాళం వేసి ఉంచుకొంటాను. నావంటి దురదృష్టవంతునికి ఇది ఒక పెన్నిధి. ఆ దరహాసం నుండి జాలువారిన అమృతకణం లక్షలాది మానవ జీవితాలను సుదూర యూరప్ దేశాలకు సైతం ఎలా మధురానుభూతిని చేస్తుందో ఊహిస్తేనే నా హృదయం ఆనందంతో ఓలలాడుతున్నది. నాకే అలా అనిపిస్తూ ఉంటే నీవు ఎంతటి భాగ్యశాలివో నీకే ఎరుక" అంటారు. అలాగే శ్రీనాన్నగారి

దరహాసం నుంచి అమృతకణం ప్రపంచమంతా ఎలా మధురాతిమధురం చేస్తుందో శ్రీనాన్నగారి ప్రపంచ భక్తులకు అందరికీ ఎరుకే. బ్రిటన్‌లో శ్రీనాన్నగారిని ఒక సభలో రోజరు సంభోదిస్తూ "చైల్డ్ ఆఫ్ భగవాన్, క్రౌడ్ పుల్లర్" అని భగవాన్‌ని. చలం ఇలా అన్నారు "నీవు రావు. నన్ను పోనివ్వవు. మత్తెక్కించావు, మధుర గానాలతో లాలించావు. నీ ఆశ, నీ చూపు వెలుగులో ఏ చాటున ఉన్నదో నీకా శక్తి తెలియదు" అన్నారు. శ్రీనాన్నగారికి ఇది పూర్తిగా వర్తిస్తుంది. మనలను పోనివ్వరు, మత్తెక్కిస్తారు. ఆత్మ తత్త్వంలో ఆ స్వీట్ వాయిస్‌తో భక్తులను లాలిస్తారు. వారి చూపు వెలుగులో ఏ చాటు ఉందో వారికి ఆ శక్తి మనకు తెలియదు అనిపిస్తుంది. ఒక తల్లితో ఆమె బిడ్డ అమ్మా నాన్నగారి స్వీట్ వాయిస్ వినిపించు ఆనందంగా నిద్రలోకి వెళ్ళిపోతాను అంది. అలాగే మరోచోట ఒక భక్తుల ఇంటికి వెళ్ళి కొద్దిసేపు మాట్లాడి వెడుతూ ఉంటే మూడ సంవత్సరాల ముద్దుబిడ్డ అదే లోకంగా నాన్నగారు వెళ్ళనీయకండి అంటూ ఒకటే ఏడుపు. నాన్నగారు ఆ బిడ్డ ఏడుపును ఆపటానికి పదిమిమిషాలు ఆగి ఆతని అంగీకారంతో వెళ్ళారు. దీనిపై శ్రీనాన్నగారు "ఏ పూర్వసంబంధమో ఏమిటో?" అన్నారు. కానీ ఆ సంబంధం నాన్నగారికే ఎరుక అనుకోవాలి.

## సమత్వమే జ్ఞానం

25 తూర్పుగోదావరి జిల్లా కత్తిపూడి సమీపంలో శాంతి ఆశ్రమం ఉంది. భారత దేశంలోనే పెద్ద ఆశ్రమం. ఏడు వందల ఎకరాలలో విలసిల్లుతుంది. పూర్వం ఓంకార స్వామి స్థాపించారు. అంతా అడవి. శ్రీనాన్నగారిని ప్రవచనం కోసం అక్కడ మాతాజీ ఆహ్వానించగా వందల్లో భక్తులు వచ్చారు. ఓంకార స్వామి సమాధి హాలు అపూర్వంగా, ఉన్నతంగా ఉంది. అందు కార్యక్రమంలో మొదట 'వస్త్రదానం' అనే

అంశాన్ని ప్రకటించి శ్రీనాన్నగారితో ఆ కార్యక్రమం జరుగుతుందని అనగా శ్రీనాన్నగారు మైకు అందుకొని వస్త్రపూజ అనాలని అక్కడ నిమ్నజాతికి చెందిన బహుపేద అయిన చాలీ చాలని చిరిగిపోయిన మాదిగవంశానికి చెందిన వానికి వస్త్రాలను అందజేసి అతని కాళ్ళకు నమస్కారం చేయగా అక్కడ ఆ స్వామి భక్తులు "ఔరా ఎంత కురణ. శ్రీనాన్నగారు అంటే ఏమిటో అనుకున్నాము. వారే నిజమైన జ్ఞాని" అంటూ ఆడిటోరియంలో భక్తులు కళ్ళనీళ్ళు తెచ్చుకున్నారు. అంటే దరిద్రనారాయణుడు అని శ్రీనాన్నగారు తెలిపారు. నేను శ్రీనాన్నగారి శిష్యులు ప్రత్యక్ష సాక్షులము. సమత్వాన్ని నూరుశాతం పాటించారు.

భీమవరం సమీప గ్రామంలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరు కావటానికి కారు వెళ్ళని ఇరుకు వీధిలో ఆగి నడిచి వెళ్ళాలి. డోరు తీసి దిగుదామనుకున్న సమయంలో రాంగ్ రూటులో వెనుక నుంచి కారు డోరును గుద్దాడు బఠానీలు, వేరుశనగ కాయలు సైకిలపై అమ్ముకునేవాడు. డోరును గుద్ది పడిపోయాడు. సరుకు అంతా దుమ్ములో నేలపాలైనది. శ్రీనాన్నగారు కారు దిగి కూర్చుని అయ్యో ఎంత కష్టం జరిగిందని సరుకును రెండు చేతులతో ఎత్తి పట్టుకొని బుట్టలో వేస్తున్నారు. పెళ్ళి కోసం వచ్చిన అతిథులు పరుగు పరుగున వచ్చి శ్రీనాన్నగారితో అయ్యా మీరు ఎత్తటం ఏమిటి? అనగా శ్రీనాన్నగారు "ఎవరైతే ఏమిటి లెండి?" అన్నారు. అక్కడ కూడా సమత్వం పాటించగా వచ్చిన పెద్దలు ఆశ్చర్యపోయారు. దీనికి మా సోదరుడు రామరాజు ప్రత్యక్ష సాక్షి.

అరుణగిరి ప్రదక్షిణంలో ఒక ముదుసలి నడుం వంగిపోయి కర్రసాయంతో ఆకలితో అల్లాడుతూ "అరుణాచలా" అంటూ మూలుగుతూ నడుస్తూ ఉంటే భగవాన్ ఆతని సమీపానికి వెళ్ళి నీతో భోజనం చెయ్యాలని ఉంది, ఆశ్రమానికి రావాలని చేయి పట్టుకొని తీసుకొని వచ్చి ప్రక్కన కూర్చోబెట్టుకొని ఇది రుచిగా ఉంది అంటూ

ఒక్కొక్కటీ తినిపిస్తూ కడుపునిండా భోజనం పెట్టారు. నీవు దరిద్రుడవు తిను అనలేదు. అదే కరుణ, సమత్వం.

26 బ్రిటీష్‌వారు ఇండియాకు స్వాతంత్ర్యం ఇస్తామని పాకిస్తాన్‌తో కానీ, వేరుగా కానీ అని ప్రతిపాదించారు. ఒక్క రోజు గడువులో నిర్ణయించుకోండి అనగా బాపూజీ అధ్యక్షతన సేవా గ్రామం ఆశ్రమంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతోంది. కాంగ్రెస్‌కు సంబంధించిన అతిరథమహారథులు పటేల్, నెహ్రూ, సరిహద్దు గాంధీ, రాజన్‌బాబు, సిఆర్ తమ తమ అభిప్రాయాలను తెలుపుతున్నారు. వారి నిర్ణయం ఎలా ఉంటుందో అని దేశ ప్రజలు, ప్రపంచం ఎదురు చూస్తున్నది. ఆ అతిముఖ్యమైన సమావేశంలో బాపూజీ కూర్చున్న కిటికీ దగ్గరకు ఐదు సంవత్సరాల బాలికి మేక పిల్లతో వచ్చి "బాపూజీ ఈ రోజూ నాతో వ్యాహ్యాళికై వస్తావా?" అనగా సమావేశం ఆపుచేసి ఆ పిల్లతో బాపూ "అమ్మా ఈ రోజు పని ఉంది. నేను రాలేను, ఏమీ అనుకోకు నీవు వెళ్ళు" అన్నారు. అందరూ బాపు ప్రవర్తనకు చకితులైనారు. అదే సమత్వం.

పోడూరు గ్రామానికి చెందిన ఇద్దరు అమాయకపు సోదరులు శ్రీనాన్నగారి రూములోకి చొరవగా వెళ్ళి శ్రీనాన్నగారితో "మేము తాటాకు ఇల్లు తీసి పెంకుటిల్లు కట్టుకొన్నాము, కరెంటు పెట్టుకున్నాము, మా ఇంటికి రావాలి" అనగా శ్రీనాన్నగారు వారితో "మీరు ఏమి చేస్తూ ఉంటారు?" అనగా "కూలి పని చేసుకుంటాము" అనగా "ఫేన్ పెట్టుకున్నారా? క్రిందదా, పైన బింగించినదా?" అనగా "పైన బిగించినదే" అనగా ఆ గ్రామానికి చెందిన కృష్ణవేణి అనే ఆమెతో మీ గ్రామానికి వచ్చినప్పుడు వారి ఇంటికి వెళ్ళి చూసి వద్దామని అలాగే చూసి వచ్చారు. అలాగే వెలివర్రు గ్రామానికి చెందిన శుద్ధ అమాయకుడు శ్రీనాన్నగారితో అతి చనువుగా దగ్గరకు వెళ్ళి నమస్కరించేవాడు. మా గ్రామం రావాలి, దానికి అలాగే అని

చేతితో సైగ చేసేవారు. పూర్వజన్మలో ఏపాప కర్మ వారిని బుద్ధిహీనులుగా చేసింది? ఏ పుణ్యకార్యమో శ్రీనాన్నగారి దర్శనభాగ్యం కలిగిస్తున్నది. తోలు క్రింద రాతను శ్రీనాన్నగార్కి తెలియాలి. శ్రీనాన్నగారు "ఏ జ్ఞాని కామన్‌మెన్‌కు దూరం కాదు" అన్నారు. దాన్ని ఆయన ఆచరిస్తున్నారు. జీవన్ముక్తుని మనః స్థితిని అర్థం చేసుకోవటం అతి కష్టం. ఒకవేళ అర్థం చేసుకొన్నా సరిగా వ్యక్తీకరించడం అసాధ్యమే. జాగ్రత్తగా సూచన మాత్రంగా వాడే ఎటువంటి పదజాలమైన సరే అందమైన అబద్ధాలేమో అని అనిపిస్తుంది తప్ప అసలు స్థితిని బుద్ధికి అందించజాలదు.

## జ్ఞాని వైభవం

27 శ్రీనాన్నగారు "ఈ శరీరం చనిపోయినా ఇంకో శరీరంలో ఉన్న మీకు గురువు పట్ల సజీవ విశ్వాసం ఉంటే మీ విశ్వాసం మిమ్ములను మీ గురువు దగ్గరకు తీసుకొనిపోతుంది. ఈ విషయం మాటల ద్వారా సరిగా చెప్పలేకపోతున్నాను అని అనిపిస్తుంది" అన్నారు. మహేంద్రనాధ్ గుప్తతో శ్రీరామకృష్ణులు "ఎవరినీ ఇక్కడికి బలవంతం పెట్టి తీసుకొనిరాకండి, సమయం రాకుండా ఏమీ జరుగదు" అన్నారు. ఆయనే కథామృతం 2వ భాగంలో 410వ పేజీలో "ఆంతరంగిక శ్రేణికి చెందిన వారు ముక్తి పొందుతారు. నేను వాయువ్య ప్రాంతాన మరోసారి శరీరాన్ని ధరించవలసి ఉంది" అన్నారు. శ్రీనాన్నగారు "ఇక్కడికి ఎవ్వరినీ బలవంతంగా తీసుకొని రాకండి, వాళ్ళు వచ్చినా నిలువరు. తరువాత (తగువులు) సమయం రావాలి" అన్నారు. 1987 ప్రాంతంలో శ్రీనాన్నగారి ఆంతరంగిక భక్తులతో "నేను వచ్చే జన్మలో తమిళనాడులో శరీరం ధరించవలసి ఉంటుంది. కానీ బ్రహ్మచారిగా జీవిస్తాను" అన్నారు. అదే సమయంలో మీటింగ్‌లో శ్రీనాన్నగారు "పూర్వం మనం అరుణాచల వాసులమే, ఇక్కడా అక్కడా పడ్డాము. మరలా అరుణాచలంలోనే కలుస్తాము" అన్నారు. ఒక సమావేశంలో

శ్రీనాన్నగారు "మీకు ఆత్మానుభవం అయింది అనుకోండి మీశరీరం కూడా మధురంగా ఉంటుంది. భగవాన్ శరీరం చూచేకొలది చూడాలని అనిపిస్తుంది. ఎందుచేతనంటే బ్రహ్మం తాలూకూ లైట్‌ను ఆ కళ్ళు వ్యక్తం చేస్తాయి. మీరు సాధనాపూర్వకంగా ఎక్కువ ఏమీ చెయ్యనక్కరలేదు. దట్ ఇట్ సెల్ఫ్ ఈజ్ బిగ్గెస్ట్ సాధన" అన్నారు.

28 జిడ్డు కృష్ణమూర్తిగారు "మహాత్ముల జీవిత చరిత్రల పరిశీలనలో ఒక అవగాహన నిస్తుంది. ఆ అవగాహన స్ఫురణగా నిలుస్తుంది, ప్రేరణనిస్తుంది. ఆ ప్రేరణ పరివర్తన కలిస్తుంది. అది ఆశక్తి శ్రద్ధ నిజాయితీలపై ఆధారపడి ఉంటుంది" అన్నారు. భగవాన్ "మహాత్ముల జీవిత చరిత్రలు చదవటం వల్ల వారి అనుగ్రహానికి పాత్రులమౌతాము" అన్నారు. ఇది నా స్వానుభవం. ఎందరో మహాత్ముల చరిత్రలు చదివి వారి అనుగ్రహానికి ప్రాతుడనైనాను.

శేతాశ్వతర ఉపనిషత్తు "జ్ఞానికి కళ్ళు, చేతులు లేకపోయినా అతడు వేగంగా పోగలడు, పట్టుకోగలడు. కళ్ళు లేకపోయినా చూడగలడు, చెవులు లేకపోయినా వినగలడు, తెలుసుకోగలిగినది అంతా ఆయనకు తెలుసు. కానీ ఆయన్ని తెలుసుకొన్నవాడు లేడు. ఆయనే ప్రథముడని అనంత 'సత్తా'యని చెబుతారని" అంది. అక్షరమణమాలలో "కన్నుకు కన్నయి కన్నులేకనుని౯ గనువారు గను మరుణాచలా" అన్నారు. చలంగారి తెలుగు సేత నుంచి "నువ్వు కన్నుకు కన్నువై కన్ను లేకుండా చూచే నిన్ను చూడగలవారెవ్వరు అరుణాచలా" అని తాత్పర్యం. శ్రీనాన్నగారు విశ్వ మనస్సు ద్వారా భక్తుల మనోభావాలు తెలుసుకొన్న సంఘటనలు ఎన్నో నిజమైన భక్తులందరికీ తెలుసు. శ్రీనాన్నగారు "మీరు కాలినడకన వెళితే మీ కూడా వస్తాను. కారు, రైలు ఎక్కినా మీ కూడానే ఉంటాను, మీరు సినిమాకి వెళితే మీతో నేను వస్తాను - సినిమా నాకు ఇష్టం కాదు, మీ ఇష్టమే నా ఇష్టమని

వస్తాను" అన్నారు. మన ఉద్ధరణకోసం మన స్థాయికి దిగివచ్చి మన పరివర్తనను గమనించి సమావేశంలో మాటతో మనం సరియైన మార్గాన్ని సూచించడానికి అనంతమైన కరుణ కావాలి. ఆ కరుణను ఎన్ని జన్మలు ఎత్తినా తీర్చుకోలేము. ఉదాహరణకు 1990లో పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర సమితి ప్రెసిడెంటు గారి అత్తగారితో శ్రీనాన్నగారు వారి యోగక్షేమాలు మాట్లాడుతూ వారిలోని వాసనలు అన్నీ తీసేస్తున్నారు. దీన్ని సమీపంలో ఉన్న రోజర్ తెలుపగా శ్రీనాన్నగారు రోజర్‌ని ఉద్దేశించి "క్లీన్ అబ్జర్వర్" అన్నారు. ఒక సందర్భంలో ఈ విషయంలో మాట్లాడుతూ శ్రీనాన్నగారు "ఆపరేషన్ చేసేటప్పుడు పేషెంట్‌కు ఆ మాటలు, ఈ మాటలు చెబుతూ నొప్పిని రోగికి తెలియకుండా పనిపూర్తి చేసినట్లు గురువు మీతో మాట్లాడుతూ మీలో సంస్కారాలను రహితం చేస్తాడు" అన్నారు. ఈ విషయంలో మహాపండితులకు కూడా అర్థం కాదు. అరుణాచలంలో ఒక పండిత అహం బ్రహ్మాస్మిని యోగక్షేమాలు అడుగగా ఆమె అన్నారు "కుటుంబ విషయాలు నాకు వద్దు, నాలుగు మంచి మాటలు తెలపండి" అనగా శ్రీనాన్నగారు మౌనం వహించారు.

29 నాడు శ్రీకృష్ణుని వేణుగానం వినగానే ఇంటి పనులు అన్నీ వదిలేసి కుటుంబ సభ్యులు, ప్రజలు ఏమనుకుంటారో అనే భయం లేక పరుగు పరుగున గోపికలు పరమాత్మను కలిసి ఆనందించేవారు. అలాగే నేడు శ్రీనాన్నగారి ప్రవచనం వినటానికి జిల్లా నలుమూలల నుంచి, ఇతర జిల్లాల నుంచి పరుగు పరుగున వస్తారు. ఇంటికి వెళ్ళినప్పుడు భర్తలు ఏమనుకుంటారో అనే భయం లేదు. ఆ ఇబ్బందులను భర్తలు భరిస్తారు. కొందరు కొంగుచాటు కృష్ణులు ఉంటారు. భార్యలను ఏమీ అనలేక శ్రీనాన్నగార్కి ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాస్తూ "సాయంకాలం నాలుగు గంటలకు ప్రవచనం ఆపకపోతే బాంబులతో మిమ్ములను పేల్చి వేస్తాము" అని. ఆ లేఖపై శ్రీనాన్నగారు సత్సంగములో "బాంబులకు ఎవరూ భయపడరు. న్యాయమైన సూచనలు ఏమైనా

ఉంటే పరిశీలిస్తాము. బెదిరింపులకు లొంగేది లేదు" అంటూ భక్తులతో "మీరు నన్ను వదలలేకపోతున్నారు. నేను మిమ్ములను వదలలేకపోతున్నాను. కాలం నాకు తెలియటం లేదు. మీ గురించి ఏదైనా భరిస్తాను. గాంధీజీని జాతిపిత అన్నవారు ఉన్నారు, జాతి పీత అన్నవారు ఉన్నారు. అతి మంచితనాన్ని లోకం భరించలేకపోవటం వల్లనే ఇటువంటివి జరుగుతున్నాయి. నా అనుగ్రహం లేదనుకోండి మిమ్ములను ఇక్కడికి ఎవరు తీసుకొని వచ్చారు? నా దయలేకపోతే మీరు ఇక్కడికి రారు. మీరు గురువును ఎన్నుకొంటే అమావాస్య రోజున ఒక గురువును, పౌర్ణమినాడు ఒక గురువును మార్చేస్తారు. అదే గురువు మిమ్ములను ఎన్నుకొంటే ఆత్మానుభవం కలిగేవరకూ వదలరు" అన్నారు. కోహెన్‌తో భగవాన్ "ఏ అనుగ్రహమైతే నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చిందో అది ఎప్పుడు ఉంటుంది, నీవు తరించేవరకూ నిన్ను వదిలిపెట్టదు. సందేహించకు" అన్నారు. పూర్వం ఒక సమావేశంలో "నలుగురు విరోధుల మధ్య ఇలా జీవిస్తున్నాను అంటే భగవాన్ అనుగ్రహ గొడుగు నాపై పూర్తిగా ఉంది" అన్నారు నాన్నగారు. దొంగలు దార్మికుల ప్రవచనాలను వినరు, సద్గురువులను కూడా హింసించటానికి వెనుకాడరు, వారి ఆరోపణలు ఏ అసూయతతో మాట్లాడుతున్నారో జ్ఞానికి తెలుసుకాబట్టి నిర్మలంగా ఉంటారు. ఏసుక్రీస్తును ముప్పై నాణాలకు అమ్మిన జూడాస్ ఇక్రిసేట్ వంటివారు ప్రతీ జ్ఞానికి తారసపడతారు. భగవాన్ ఆశ్రమానికి ఒక ఫ్యాన్సీ కొట్టు యజమాని వచ్చి భగవాన్‌తో "మీకు పౌడర్లు, స్నోలు వగైరాలు కావాలని ఒకరు వచ్చి పట్టుకెళ్ళారు. బిల్లు ఇదిగో" అనగా ఆశ్రమ అధికారిని "వారికి డబ్బు ఇచ్చేయండి" అన్నారు. భగవాన్ అవి వాడతారా? ఒక సమావేశంలో శ్రీనాన్నగారు "ఎంతో నమ్మకంతో మనకు సేవ చేసినట్లు నటిస్తారు గడ్డిపరకలాంటి పది పైసల విలువగల దాన్ని మీరు మర్చిపోయారని ఇస్తాడు. దానిపై మనం 'ఎందుకయ్యా ఇంత చిన్న విషయానికి ఇంత డబ్బు ఖర్చు పెట్టి తెచ్చావు?' అంటాము. బాగా నమ్మకంగా ఉంటున్నాడని

పొరుగూరు వెళుతూ ఇంటి తాళాలు అతని చేతిలో పెడితే మనం వెళ్ళగానే బంగారాన్ని మూటకట్టుకుని ఉడాయిస్తాడు. మోసపోయే ప్రారబ్ధం ఉన్నప్పుడు ఎవ్వరూ ఏమీ జాగ్రత్త పడలేరు" అంటూ "నాకు ఏదైనా క్లేశం కలిగిన సంఘటన జరిగింది అంటే దానికి నేను వేదన పడితే మీ మొహం మీద పేడ వ్రాసినట్లే" అన్నారు. అది జ్ఞాని వైభవం. ఒక విద్యాధికురాలైన భక్తురాలు తల్లితండ్రుల సూచన మేరకు శ్రీనాన్నగారిని విశాఖపట్నంలో ట్రెయిన్ బయలుదేరుటకు సిద్ధంగా ఉన్న సమయంలో ఆ పెట్టెలో ప్రవేశించి "శ్రీనాన్నగారు ఎవరు?" అంటూ అందరినీ అడుగుతూ చివరికి నాన్నగారినే అడిగింది. దానిపై శ్రీనాన్నగారు తన శరీరాన్ని చూపుతూ "దీన్ని నాన్నగారు" అంటారు అన్నారు. నేనే నాన్నగారిని అనలేదు. శ్రీనాన్నగారితో ఆమె అంది "మీ ప్రవచనం టేపులో విన్నప్పుడు ఒకే వాక్యాన్ని మూడుసార్లు ఎందుకు ఉచ్చరిస్తారు? ఒక్కసారే పలకవచ్చు కదా!" అనగా ఆ మాట ఆమె బుద్ధికి అందదని నిర్మలంగా ఉన్నారు. బుద్ధుడు మూడుసార్లు అనేవారు. దీనిపై ఆయన సరియైన సమాధానం చెప్పారు ఇలా "మొదటి మాటను భక్తులు సాధారణంగా వింటారు, రెండవసారి అన్నప్పుడు ఇది మన గురించే చెబుతున్నారు అని అలర్టు అవుతారు. మూడవసారి విన్నప్పుడు అది మీ హృదయంలో నాటుకుపోతుంది" అన్నారు. శ్రీనాన్నగారు కూడా బుద్ధుని భూతదయలా వారి ప్రవచనంలో మూడుసార్లు అంటారు. అనంతమైన ప్రేమతో అన్న మాటలు అవి.

# శ్రీనాన్నగారి జీవన శైలి

30

శ్రీనాన్నగారు యుక్త వయస్సులో తల్లిగారితో "అమ్మా! పాలకొల్లు వెడుతున్నాను" అనగా పది రూపాయలు చేతిలో పెట్టేవారు. మామూలు సైకిల్‌పై వెళ్ళి ఐదు రూపాయలు ఆధ్యాత్మిక సాహిత్యం కొని, మిగిలిన ఐదు రూపాయలు ముష్టివాళ్ళకు ధర్మం చేసి వచ్చేవారు. జాలి స్వభావం, ఇతరులకు ధర్మం చేసే స్వభావం చిన్నతనం నుండి అబ్బింది. జిన్నూరులో యాచకులు వారానికి ఒకసారి వచ్చేవారు. ఒక తాటాకు బుట్టలో కుంచుడు బియ్యం పెట్టుకొని వచ్చిన వారికి దోసెడు నిండా బియ్యం ఇచ్చేవారు. ఆత్మానుభవం కలిగిన తరువాత ధనం ప్రవాహంలా వచ్చేది. "నేను నాన్నగార్కి ఇంత ధనం ఇచ్చాను" అనే అహంకారంతో ఇచ్చేవారి దగ్గర స్వీకరించకుండా మర్యాదగా "ప్రస్తుతం డబ్బు అవసరం లేదని వచ్చినప్పుడు చూద్దాము" అని అనేవారు. ఒక ముదుసలి భక్తురాలు జంగారెడ్డిగూడెం నుంచి అంటే సుమారు వంద కిలోమీటర్ల నుంచి బస్సులో వచ్చి నాన్నగారి సమక్షంలో కూర్చుని మూడు పొట్లాలు విప్పి ఇరువది రూపాయలు ఇచ్చింది. దానిపై శ్రీనాన్నగారు "ఎందుకమ్మా! ఈ రూపాయల కోసం అంత దూరం రావాటం" అంటే "ఏమి చేసుకోను ఈ డబ్బు" అని కోపంతో కళ్ళు ఎఱ్ఱ చేసింది. భక్తుల కోపానికి భయపడతాడు పరమాత్మ. తీసుకోక తప్పలేదు. మరో భక్తురాలు కేవలం భర్త గేదెను పాలకోసం మేపితే ఆ పాలతో జీవిస్తున్నారు. ఆమె ఒక వెయ్యి రూపాయలు శ్రీనాన్నగారికి బిడియపడుతూ ఇచ్చింది. ఆ సొమ్ము తీసుకొని గదిలోకి వెళ్ళి ఐదు వేలు తెచ్చి ఆమె చేతిలో పెట్టి "అమ్మా! నీవిచ్చిన సొమ్ము డిబ్బీలో దాచుకొన్నాను. ఈ ఐదు వేలు భగవాన్ ప్రసాదమని" చెప్పారు. ఆమెను కించపరచకుండా సమాధానపడేలా ప్రవర్తించారు. అలాగే కొందరు భక్తులు కవరులో పెట్టి ఇయ్యగా పుచ్చుకొని భగవాన్ ప్రసాదమని వారి జేబులో పెట్టేవారు.

వారి వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అలా వ్యవహరించేవారు.

31 రామకృష్ణ పరమహంసగారు చిన్నతనంలో గదిలో ఒక మూల కూర్చుని "అనరా బాబు శరీరం, మనస్సు గోవిందుడే అని అనరా బాబు ప్రపంచమంతా గోవిందుడే అని అనరా బాబు. ఎన్ని దుర్గుణాలు ఉన్నా సత్సంగం చెయ్యరా బాబు" అని పాడుకునేవారు. శ్రీనాన్నగారు చిన్నతనంలో అరుగు మీద కూర్చుని కృష్ణుడి మీద పాటలు పాడుకొనేవారు. ప్రక్కన తండ్రి, పినతండ్రులు వ్యవసాయ విషయంలో మెలకువలు, సమాజం తీరు గురించి మాట్లాడుకుంటూ ఉంటే తల్లిగారు శ్రీనాన్నగారిని పిలిచి "పెద్దలు మాట్లాడే విషయాలు వినక ఆ కృష్ణుడి పాటలు ఏమిటిరా?" అని అన్నా ఆ మాటలు లెక్కచెయ్యక ఒక మూలు కూర్చుని ఆ పాటలే పాడుకొనేవారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అంటారు. అదేమరి. పూర్వజన్మ పుణ్య సంస్కారం అలా పాడించేది. కానీ తల్లిగారు అనుకొనేవారట "వెఱ్ఱి గొల్లవాడమ్మ! ఏమీ తెలియదు" అని జాలిపడేవారట. భక్తి మార్గంలో నిజాయితీగా ప్రార్థిస్తే ఎంతో శక్తి వస్తుంది అంటారు. యశోద కూడా అలా అనుకొనేది అతని అల్లరిని చూచి. శ్రీనాన్నగార్కి 1987 సంవత్సరం ప్రాంతంలో విపరీతమైన అనారోగ్యం వచ్చింది. డాక్టర్లు ఎవ్వరూ నిర్ధారణ చెయ్యలేక ఏమీ లేదు అనేవారు. దానిపై తల్లిగారు బయట భక్తులతో "మా అబ్బాయికి దిష్టి దోషం తగిలిందమ్మ" అని విచారించేవారట. ఎంతైనా తల్లి ప్రేమ కదా! కడుపు కోత కదా!

32 శ్రీనాన్నగారు పరమ పవిత్రమైన భక్తులు ఏదైనా తీసుకొని వచ్చి మంచి పనులకు ఉపయోగించండి అని ప్రార్థిస్తే ఆ సొమ్మును ప్రక్కన ఉన్న రామచంద్రరాజు గారి చేతిలో పెట్టి ఇది ఫలానా కల్యాణ మండపానికి ఇస్తామన్నాము కదా వారికి అందచెయ్యండి అనేవారు. గుడికి

వెళితే పూజార్లకు ఘనంగా సంభావనలు ఇచ్చేవారు. గుళ్ళకు, గోపురాలకు, సత్రములకు, వృద్ధాశ్రమాలకు, చదువుకొనే పేద విద్యార్థులకు సాయం చేసేవారు. వారి చదువు పూర్తి అయితే అధికార భక్తుల పరిచయంతో ఉద్యోగాలు కల్పించేవారు. గ్రామ అభివృద్ధికి రహదార్లు, వంతెనలకు రాజకీయ నాయక భక్తుల సాయంతో పనులు పూర్తిచేసేవారు. మరియు విద్యా సంస్థల నిర్మాణానికి ఎంతో ఆర్థిక సహాయం చేసేవారు. కాశీలో సత్రమునకు, అరుణాచలంలో భక్తుల వసతి సౌకర్యంకోసం ఆశ్రమాలు నిర్మాణం చేసేవారు. భక్తులు కూడా వారి సౌకర్యం కోసం గదులు నిర్మించుకునేవారు. కర్మమార్గాన్ని వితరణశీలత్వమును భక్తులకు అలవాటు చేసేవారు. శ్రీనాన్నగారు "సంతృప్తి కలిగిన భక్తులకు భగవంతుని ఆశీస్సులు లభిస్తాయని, జాలి స్వభావంతోపాటు ఉదారత కలిగి ఉండాలని, కనికరం గలవాడు పోగొట్టుకొనేది ఏమీ లేదు" అని అనేవారు. అలాగే నిజ జీవితంలో వ్యవహరించారు. ఊడ్పులలో ఒక గంట ముందు కూలీలను పంపేసేవారు. వారితో "మీరు ఇంటికి వెళ్ళి వంట చేసుకోవాలి కదా!" అని పంపేసేవారు. దానితో తల్లిగారు ముందే వచ్చేసారు అని తెలిసి శ్రీనాన్నగారితో "అబ్బాయి నీవు పొలం వెళ్ళనక్కరలేదు. అరుగు మీద కూర్చుని భక్తులకు వేదాంతం చెప్పుకో చాలు. నేను ఒక రాజుగారిని 'నిగామణి'తో వ్యవసాయం చేయించుకుంటాను" అనేవారు. నాన్నగారు పొలం వెళితే భక్తులు అక్కడికి కూడా వచ్చేవారు. పని మనుషుల పని తీరును పరిశీలించే అవకాశం ఉండేది కాదు. ఒక సమావేశంలో "మాది బ్రాహ్మణుల వ్యవసాయంలా తయారైనది" అన్నారు.

నేను నాన్నగారిని కలిసిన మొదటి రోజుల్లో ఒక గ్రామంలో మీటింగ్ అయిన తరువాత నిర్వాహకులు నాతో "నాన్నగారితో మీరు సహపంక్తి భోజనానికి ఇంటికి వెళ్ళకుండా దయచేసి, భోజనం చెయ్యండి" అన్నారు. వారి ప్రేమకు కాదనలేక భక్తితో నాన్నగారి సరసన కూర్చున్నాను. నా భోజనం పూర్తి అయినది, నాన్నగారు

నా విస్తరి వంక చూసి "రామకృష్ణం రాజుగారు మీరు భగవాన్ విస్తరిలా చేసారు" అన్నారు. (అంటే భగవాన్ విస్తరిలో ఒక్క మెతుకు కూడా విడిచిపెట్టక విస్తరిని ఖాళీ చేసేవారు అని అర్థం) నాన్నగారు ఒక అమాత్యుని మాటలు "అంత దరిద్రంలా తినటం ఎందుకు?" అన్న మాట అనగా ఒక భక్తుడు ఫకాలున నవ్వగా నా మనస్సు అంతులేని బాధ కలిగి ఈ భోజనానికి ఎందుకు వచ్చానా అనిపించింది. నా వేదనను గ్రహించి నాతో "మీరు ఉపనిషత్తులు అన్నీ బాగా అధ్యయనం చేసారు. నేను ఏమీ చదవలేదు" అన్నారు. అది నా బాధకు ఓదార్పు మాటలు అని గ్రహించాను. ఇలా నా ఈ విషయంలో ఎవరు నన్ను కించపరిచినా తత్వంలోకి వెళ్ళి సమాధానపరచటం మామూలే. నా సాహిత్య పిపాసనా ఆత్మానుభవానికి ఆటంకమే. అనుభవ జ్ఞానం ఉన్నతమైనది, సాఫల్యతను పొందేది అని నాకు తెలుసు. సాహిత్య జ్ఞానం భక్తులను ఎడ్యుకేట్ చేస్తుంది. దాని విలువ దానికి ఉంటుంది. ప్రయోజనం లేదనబోము.

తమిళనాడులో కామరాజా నాడార్ జిల్లాలో ఉన్న 'రాజపాలయం' పట్నంలో జీవించే నారాయణరాజుగారు భగవాన్ భక్తులు. ఆ టౌనుకు చెందిన స్త్రీ, పురుష భక్తులు చాలా మంది రమణాశ్రమానికి తరచుగా వస్తూ ఉంటారు. ప్రొఫెసర్ నారాయణరాజుగారు మూడు ఇంజనీరింగ్ కాలేజీలకు గైడుగా పనిచేస్తూ వాలంటరీ రిటైర్‌మెంట్ అయినారు. సంస్థలు ఎంతగా వేడుకొన్నా ఒప్పుకోలేదు. ఆయన సింపుల్ లైఫ్, హై థింకింగ్ కలవారు. రాజపాలయంలో కుటుంబంతో నాలుగు నెలలు గడిపితే రమణాశ్రమంలో ఎనిమిది నెలలు గడుపుతారు. రోజూ రెండుసార్లు గిరి ప్రదక్షిణ చేస్తారు. ప్రఖ్యాత రమణ భక్తులైన స్వామినాధన్‌గారి చిన్నకూతురు 85 సం॥ల వయస్సులో రిటైరై శివసన్నిధి మూలలో సొంత ఇంట్లో ఉంటున్నారు. పై అంతస్థులో నారాయణరాజుగారు ఉంటారు భోజన వసతి కోసం. శివసన్నిధిలో స్వర్ణగదిలో నాకు వారితో పరిచయం ఏర్పడింది. వారికి నాన్నగారు సద్గురువు అన్న

విషయం తెలియదు. గదిలో ఫొటోల వల్ల ఆయన ఒక డోనర్ అనుకొంటున్నారు. నాన్నగారి వైభవం తెలుపగా ఆశ్చర్యపోయారు. నేను వారిని నాన్నగారి ఆశ్రమంలో నాన్నగారి గదిలోకి తీసుకొనివెళ్ళి వారిని పరిచయం చేసాను. వారు నాన్నగారి పాదాలకు నమస్కారం చేసారు. నాన్నగారు వారి బుగ్గలను నిమురుతూ "నారాయణరాజు గారు మీకు ఈ జన్మలోనే ఆత్మానుభవం కలుగుతుంది" అన్నారు. తదుపరి వారు నాన్నగారిని చాలాసార్లు కలిస్తే వారు భుజం మీద చేయి నిమురుతూ అనుగ్రహించేవారు. వారి పూర్వ చరిత్ర శ్రీకృష్ణ దేవరాయలు దక్షిణ పథాన్ని అంతా ఏలినప్పుడు తన ప్రతినిధిగా విజయ నగర రాజును తన ప్రతినిధిగా అక్కడ ఉన్న రాచ కుంటుంబాలను రాజపాలయం పంపమన్నారు. కొన్ని కుటుంబాలను అక్కడ నివాసం ఏర్పరచుకొన్నారు. అందులో నారాయణరాజుగారి కుటుంబం ఒకటి. వారు 400 సం॥ల నాడు అక్కడ నివాసం ఏర్పరచుకొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యరాజు నాన్నగారిని 'మా పట్నం'లో ప్రవచనం చెయ్యాలి అని కోరారు. నాన్నగారు సరే అన్నారు. కానీ వెళ్ళలేకపోయారు. అలా అక్కడ భక్తులు అడిగారు. ఆంధ్రలో తమిళనాడు కలిసి ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా కుమారస్వామి రాజాగారు ఉన్నారు. వారు ఆ రాజులే. ఆ రాజులు నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. అబద్ధాలు ఆడరు. కోర్టులకు పోలీసు స్టేషన్‌కు వెళ్ళరు. సంవత్సరానికి ఒక రోజున గ్రామ చావడి అనే హాలులో సమస్య ఉంటే పెద్దల తీర్పుకు కట్టుబడి ఉంటారు. విడాకులు వారి నిఘంటువుల్లో లేదు. వారి జీవన శైలిని నాన్నగారు ఇష్టాగోష్ఠి సమావేశంలో తరచుగా మెచ్చుకుంటారు. అక్కడి ప్రజలు రాజపాలయం రాజుల సాక్షిగా ప్రమాణం చెయ్యి అంటారు. మనం భగవంతుని సాక్షిగా అంటాము.

## 33

శంకరాచార్యులవారు అంతిమ కాలంలో శిష్యులతో ఇలా అన్నారు "నేను ఇరువది రెండు సంవత్సరాలు చేసిన బోధకు నా మీద మీకు భక్తి ఉంటే ఇతరులకు మీరు చెప్పండి" అన్నారు. అలాగే

శ్రీనాన్నగారు బోధార్హుల బోధకు భక్తులను ప్రోత్సహించి తత్వమార్గంలో ప్రచార రథాలుగా మార్చారు. భీమవరానికి చెందిన నిర్మలచిత్తులు పార్వతమ్మగారు. జిన్నూరుకు చెందిన పార్వతమ్మ గారు తన జీవిత అనుభవాన్ని తత్త్వంతో రంగరించి బోధించే నిర్మలచిత్తులు. తణుకుకు చెందిన టీచర్ సత్యవతిగారు, భర్త కూడా టీచర్. నిష్కామకర్మకు ప్రతీక సత్యవతిగారు. నిరాడంబరంగా జీవితంలో జీవిస్తూ శ్రీనాన్నగారి తత్త్వబోధను ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన అరుణగారు ఆర్తితో సుస్వరంతో, భక్తులకు ఆసక్తిగా వినే నేర్పుకూర్పులతో భక్తులను కట్టిపడేస్తున్నారు. అలాగే సౌగంధికగారు. రమణభాస్కరలో శ్రీనాన్నగారి ప్రవచనాలను ఎడిట్ చేయటంలో బేబి నేర్పుగలవారు, అందరినీ ఆకర్షింపచేస్తున్నది. శ్రీనాన్నగారి భక్తుడైన నితిన్ హైదరాబాద్ నివాసి, వెబ్‌సైట్ ఇంటర్వ్యూలోను శ్రీనాన్నగారు జీవించి వుండగా ఆయన వైభవాన్ని ఈ జన్మలోనే నీకు సత్యానుభవం కలుగుతుందని ఎన్నోసార్లు అన్నారు. అది నాన్నగారి సత్యవాక్కు ఫలించి భక్తులకు పరమ శ్రేయస్సు కలుగుతుంది. నా జీవన శైలి ఆయనది ఒకటేనని పూర్ణంగా విశ్వసిస్తున్నాను. ఇలా చెప్పుకుపోతే మరో పెద్ద గ్రంథమౌతుంది. ఎందరో బోధకులు ఉన్నారు, వారి వారి పరిధిలో తత్త్వాన్ని బోధిస్తున్నారు. పూర్వం నా మనస్సులో ఈ ఆలోచన వచ్చింది. శ్రీనాన్నగారి భౌతికదేహం విడిచిపెట్టిన తరువాత జిన్నూరు క్షేత్రానికి ఎవరు వస్తారు? ఈ వైభవం అప్పుడు ఉంటుందా?" అని తదుపరి సమావేశంలో శ్రీనాన్నగారు "ఈ దేహం వాడినా ఈ ఆశ్రమం ఇలాగే కొనసాగుతుంది" అన్నారు. భవ్యమైన సమాధి ఏర్పడింది. గురుపూర్ణిమ, శ్రీనాన్నగారి పుట్టినరోజుల్లో పూర్వంలాగే భక్తులు వస్తున్నారు. భోజనాలు అన్నీ మామూలుగానే జరుగుతున్నాయి. కమిటీ పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తున్నది.

ది॥ 29-07-2012లో జిన్నూరు రమణక్షేత్రంలో శ్రీనాన్నగారి ప్రవచనం ఇలా ఉంది "వర్మ నా మనుమడు, మూగవాళ్ళకు కూడా అర్థమయ్యే విధానాన్ని

కంప్యూటర్‌తో కనిపెట్టాడు. వెబ్‌సైట్‌లో "విష్ణు తరంగం" అని దానికి నామకరణం చేసాడు. ఇది ప్రపంచంలో ఎవరూ కనిపెట్టని విధానం. పత్రికా విలేఖర్లు ఎలా కనిపెట్టారు అనగా మా విద్యార్థులు ముగ్గురు కనిపెట్టారు అని తన పేరు చెప్పటానికి ఇష్టపడక. కానీ టివి వాళ్ళు విద్యార్థులను అడుగగా సమాధానం చెప్పలేకపోయారు. శ్రీనాన్నగారి ఆదేశంతో విషయాన్ని వాళ్ళకు వివరించటానికి జిన్నూరు నుంచి భీమవరం వెళ్ళవలసి వచ్చింది. ఇది "శుభవార్త" అని సత్సంగంలో తెలిపారు. వర్మ విష్ణు కాలేజీలో పనిచేస్తున్నారు. తాతగారైన శ్రీనాన్నగారిని తాతగారిలా కాకుండా పరమాత్మగా చూస్తారు. శ్రీనాన్నగారి కల్యాణగుణాలన్నీ పుణికి పుచ్చుకున్న రత్నం. ప్రచారం అక్కరలేదు. పని ముఖ్యం. వృత్తిని దైవంగా భావించే స్వభావం. భక్తిని రహస్యంగా ఉంచుకొనే భక్తాగ్రేసరులు. శ్రీనాన్నగారి తెలుగు వెబ్‌సైట్ భీమవరం నుంచి నడుపుతున్నారు. దీనివల్ల శ్రీనాన్నగారి భక్తులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ఇంటి వద్ద దర్జాగా కూర్చుని శ్రీనాన్నగారి ప్రవచనాన్ని వారి మంగళకరమైన ముఖారవిందాన్ని ప్రత్యక్షంగా చూడటమే కాదు ముందు తరాల భక్తులకు ఇది కల్పవృక్షంగా, కామధేనువుగా మారింది. అలాగే హైదరాబాద్‌లో ఒక అమ్మగారు శ్రీనాన్నగారి వెబ్‌సైట్‌ను ఇంగ్లీషులో నడుపుతున్న పుణ్యాత్మురాలు. వీరిని శ్రీనాన్నగారి తత్త్వ ప్రచార రథాలుగా అందరూ భావిస్తున్నారు. శ్రీనాన్నగారి ఆశీస్సులు పై వారి అందరిలోనూ అండటం వల్ల శ్రీరమణక్షేత్రం దిగ్విజయంగా సాగుతున్నది. ప్రతీ సద్గురువు ప్రేమ స్వరూపుడే, బోధ స్వరూపుడే.

# 34

ఈ సందర్భంలో భగవాన్ విరచితమైన "అక్షరమణమాల"లో "ప్రేమతో నీ నామమాలించు భక్త భక్తుల భక్తునిగా బ్రోవు మరుణాచలా; తా॥ ప్రేమతో నీ నామం ఆలకించే భక్తుల, భక్తులకు భక్తునిగా నన్ను కాపాడు అరుణాచలా" అన్న ద్విపద నాకు ప్రాణప్రదమైనది. దీనినే సంస్కృత భాషలో ఒకచోట "భృచ్ఛతే, భృచ్ఛతే, భృచ్ఛతే" అని భక్తులు

గుక్కతిప్పుకోకుండా ఆలపిస్తారు. దీనివల్ల అహంకారం పెరగకుండా ఉండటమేకాదు, వినయాన్ని కలుగజేస్తుంది అని నా పరిపూర్ణ విశ్వాసం. శ్రీనాన్నగారు "ఒక్క వినయం ప్రాక్టీస్ చేస్తే చాలు అన్ని కల్యాణ గుణాలు వాటంతటఅవి వరిస్తాయి" అన్నారు. వేమన "వినయ మబ్బుట చాలా కష్టంబురా" అన్నారు. అసాధ్యమనలేదు. ఈ విషయంలో భక్తులు మాయలో పడతారు. "నేను బాగా మాట్లాడతున్నాను, నా రచనలతో నన్ను అందరూ మెచ్చుకుంటున్నారు" అనే ప్రమాదంలో పడకుండా ఉండటానికి ఉపకరిస్తుంది. మనలో చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే మన ప్రయత్నం సఫలమౌతుంది. దీనినే పెద్దలు "సౌలభ్యము నీ సొంతమురా" అంటారు. రామకృష్ణ పరమహంసగారి శిష్యులు, భక్తులు ఎవరైనా చెప్పులు విడిచిపెట్టరానిచోట పెడితే వారి శిష్యులు ఆ చెప్పులను తలపై పెట్టుకొని వేరేచోట పెట్టేవారు. భగవంతుడు భక్తులను ప్రేమిస్తాడు, మనం కూడా ఆ భక్తులను భగవంతునిగా భావించటమే నిజమైన వినయం. భక్తులనే మనం ప్రేమించకుండా వారిపై కోపాన్ని ప్రదర్శించటం అన్యాయం. శ్రీనాన్నగారు "మీరు భక్తులనే ప్రేమించక వారిని కోపంతో వ్యవహరిస్తే మీరు భక్తులు కాదు. భక్తులనే ప్రేమించలేనివారు భగవాన్‌ని ప్రేమిస్తున్నాను అంటే మీ భక్తి బూటకం" అన్నారు. ఇది సత్యం – సత్యం – సత్యం. "ఐదు నిమిషాలు భగవంతుని కోసం రోదిస్తే ఒక గంట ధ్యానంతో సమానం. రోదనలో మనస్సు భగవంతునిలో లీలమై మనస్సు తేలిక అవుతుంది. మనస్సులో మలినాలను కన్నీటితో కడిగినప్పుడు నిష్కపటమైన ఆనందం కలుగుతుంది" అన్నారు పరమహంసగారు. కబీర్ "భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మన క్షేమాన్ని చూచేవాడు ఒకడు ఉన్నాడు అని రెండు కన్నీటిచుక్కలు రాలిస్తే అవి కాశీలో నున్న గంగకన్నా పవిత్రమైనది" అన్నారు.

# 35. శ్రీనాన్నగారు "గురువైభవం" గురించి చెప్పిన అంశాలు

☞ "భగవాన్ మౌనం ముందు లోకంలో ఉన్న గ్రంథాలు అన్నీ దిగదుడుపే" అన్నారు మురుగునార్. జ్ఞాని సన్నిధిలో మాటలు రాయగలం కానీ అశాంతిని గురించి చెప్పలేము.

☞ ముప్పది సంవత్సరాల బాధానుభవాన్ని సద్గురువు 2 గంటలలో స్వప్నంలో అనుభవింపచేసి ముందుకు తీసుకొనిపోతాడు. ప్రారబ్ధం అనుభవాన్ని అలా తొలగిస్తాడు.

☞ బుద్ధుడు అవసానదశలో ఉండగా ఒకడు విలపిస్తూ ఉంటే కారణం ఏమిటి అంటే "దీపం ఆరిపోతున్నది". బుద్ధుడిలా జీవిస్తే ఆ దీపం నీవే అవుతావు. శ్రీనాన్నగారు దేహం వదిలే ముందు, తరువాత భక్తులు కన్నీరు కార్చారు. పై ఉదాహరణ "నాన్నగారిలా జీవిస్తే ఆయనలా అవుతాము. ఇది నిశ్చయం".

☞ మీ అహంకారాన్ని మీరు వదులుకోలేరు. మీ గురువును ధ్యానం చెయ్యటం వల్ల మీ అహంకారాన్ని పాతాళలోకానికి తొక్కేస్తాడు. మిమ్ములను అమృతస్థితికి తోలుకొనిపోతాడు. మీ సాధన మీ స్వయంకృషి ముందు గురువు చేసేదే ఎక్కువ.

☞ మీరు నిర్మల స్థితిలో ఉంటే నీ గురువే నీకు బోధిస్తాడు. ఆ బోధ సక్రమంగా ఉంటుంది.

☞ అమాయకంగా ఉండకుండా వ్యవహారజ్ఞానం కూడా గురువుకు ఉండాలి.

- ☞ మీ గురువుకు మీరు చెప్పే ప్రారబ్ధపు క్లేసాల మాటలను వింటూ "అలాగా అమ్మా" అంటూ మీకు తెలియకుండానే కాలాన్ని, దూరాన్ని, మీ కర్తృత్వ బుద్ధిని దాటించి తనలో కలుపుకుంటాడు.

- ☞ మీరు చేసే ప్రాణాయామాలు, ధ్యానాలు, పూజలు, జపాలు కంటే గురుపాదాల మీద భక్తి చాలు మనం ఉద్ధరించటానికి. ఆ పాదాలే మనలను అమృతస్థితికి తీసుకొనిపోతాయి.

- ☞ మీరు ఎన్ని యాత్రలు చేసినా, ఎన్ని నదులలో మునిగినా ఒక్క బ్రహ్మజ్ఞాని యొక్క దయలేకుండా బ్రహ్మజ్ఞానం కలిగే అవకాశం లేదని శాస్త్రం చెబుతున్నది.

- ☞ గురువు ఒక కాలానికి, ఒక దేశానికి, ఒక దేహానికి పరిమితమైనవాడు కాడు.

- ☞ శ్రీనాన్నగారు "మీ ఎడబాటును సహించలేక ఈ రోజున ఈ శరీరం అసౌకర్యాన్ని లెక్క చెయ్యకుండా సహించవలసి వస్తున్నది. ఉన్న సత్‌పదార్థం ఉందా లేదా అనే సందేహం కలుగుతూ ఉంటే, గురువు కళ్ళను చూస్తూ ఉంటే అది ఉన్నదని నిశ్చయించుకోగలము.

- ☞ రామకృష్ణుడు వివేకానందతో "నీవు కిటికీలోంచి వీధిలో ఉన్నవి ఎలా చూస్తున్నావో అలాగే నా ద్వారా సత్యాన్ని చూడు" అన్నారు. అది గురువు వైభవం.

# స్వవిషయం

## కడసారి చూపులో - కరుణ

36 నా భార్య రంగమ్మ జాతకరీత్యా జరిగే మరణాన్ని ఎనిమిది సంవత్సరాలు పెంచారు. మరణం రోజు వస్తోంది నాకు వసంతాలు పూర్తిచేసుకొని భీష్మాలు రాబోతోంది. నా భార్య జిన్నూరు రమణక్షేత్రంలో నాన్నగారి ప్రవచనం ప్రారంభమైనది. ముందు వరుసలో నాన్నగారికి అతి సమీపంలో కూర్చున్నది. ప్రవచనం జరిగిన రెండున్నర గంటలు నా భార్య ముఖంవైపు చూస్తూ కరుణతో ప్రసంగించారు. మిగతా భక్తులవైపు ఒక్కసారి కూడా చూడలేదు. ప్రవచనం ముగిస్తూ ఆమెకు అభయహస్తాలు చూపి తమ గదిలోకి వెళ్ళిపోయారు. నా చిన్న కూతురు శాంత భీమవరంలో ఉంటోంది. అంతకుముందు తల్లితో "అమ్మా నా ఇంటి వద్ద ఉండటం లేదు, రెండు నెలలు నా ఇంటి వద్ద ఉండాలి" అన్నది. ఆ మాట నాకు నా భార్య చెప్పగా అనాలోచితంగా అపభ్రంశమైన మాట దొర్లింది "అయితే నన్ను విడిచిపెట్టేస్తున్నావా?" అని. "బెంగ పెట్టుకోకండి, నాలుగు రోజులు ఉండి వచ్చేస్తాను" అంది. కూతురు ఇంటికి తీసుకొనివెళ్ళింది. కూతురుతో "ఈ రోజు ప్రవచనం అంతా నా కళ్ళలోకే చూసారు, ఎప్పుడూ ఇలా జరగలేదు, ఆశ్చర్యంగా ఉంది" అని పదే పదే పరవశించి చెప్పటం జరిగింది. మూడవరోజు బిపి ఎక్కువై తలనరాలు చిట్లి రక్తం ముక్కు ద్వారా, నోటిద్వారా వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయింది. తదుపరి 12 గంటలలో మరణించింది. ఆమె జాతకంలో రక్తసంబంధమైన వ్యాధి వల్ల మరణిస్తుందని ఉంది. సరే మరణం ఎప్పటికైనా తప్పదని నేను సమాధానపడ్డాను. మా ఇంటికి వచ్చి శ్రీనాన్నగారు మా కుటుంబాన్ని సముదాయించి వెళ్ళారు. నా భార్య కళ్ళలోకి చూడటం అంటే "మిమ్ములను నా హృదయంలో ఉంచుకుంటాను" అని సారాంశము.

భార్య ఎడబాటు నాకు కష్టమనిపించలేదు. కారణం ఎనిమిది సంవత్సరాలుగా అనేక ఉపమానాల ద్వారా సమాధానపరుస్తూ ఉండటం వల్ల. ఒక ఉపమానం "భగవాన్ వద్దకు నిడుబ్రోలు కాలేజీ ప్రిన్సిపాల్ భార్యతో కలిసి పది రోజులు ఉండి వెళుతూ అయ్యా భగవాన్ నాలుగు నెలలలో మరలా వస్తాము" అనగా భగవాన్ మర్మగర్భంగా "మీరు వస్తారు లెండి" అన్నారు. వారు అనుకొన్నారు నా భార్యకు పని వత్తిడి వల్ల రాకపోవచ్చు అనుకొన్నారు. అనతికాలంలోనే ఆమె మరణించింది. సుబ్బరామయ్యగారు తదుపరి భగవాన్ దగ్గరకు రాగా భగవాన్ "ఎలా ఉన్నారు?" అనగా "నా భార్య కలలో కూడా కనిపించలేదండి" అని వేదన పడ్డారు. భగవాన్ ఆయన భార్యను కలలో ఆ రాత్రి కనిపించేలా చేసారు. మరునాడు భగవాన్ "ఎలా ఉన్నారు?" అనగా "నా భార్య అరగంటే కలలో కనిపించింది" అని మరలా చింతాక్రాంతులు అవ్వటంతో భగవాన్ "సుబ్బరామయ్యగారు ఈ జీవలక్షణాలను ఎలా భరిస్తున్నారండి? అవి ఎంత బరువండి, ఎలా మోస్తున్నారు?" అన్నారు. ఈ మాటలు శ్రీనాన్నగారు ప్రవచనం చెబుతూ ఉంటే ఈ మాటలు భవిష్యత్తులో నేను భార్య ఎడబాటు వల్ల వేదన పడకుండా చేస్తున్నారు అనిపించింది. "భార్య ఎడబాటు సామాన్యమైనది కాదు, నవవిధ సేవలు చేసే భార్య పోవటం వల్ల మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ రెండు సంవత్సరాలు బాధపడ్డారు" అన్నారు శ్రీనాన్నగారు. అది అంతా గురువైభవం.

37 అలాగే హైదరాబాద్ వాస్తవ్యులు ఇంజనీర్ శ్రీరామకృష్ణంరాజుగారు పరమ పవిత్రులు. శ్రీనాన్నగార్కి అత్యంత ప్రేమ పాత్రులు. అరుణాచలంలో ఆంధ్ర ఆశ్రమానికి ప్లాన్ డిజైన్ చేసింది వారే. వారి గురించి మరింత విస్తారంగా చెప్పటం ధర్మం. రమణభాస్కర పత్రిక శ్రీనాన్నగారి ప్రవచనాలు అందిస్తున్న "బేబి" తండ్రి. వారి పుట్టిల్లు పశ్చిమ గోదావరి జిల్లా

పెదనింద్రకొలను పెద సోమరాజుగారి కుటుంబము. జ్ఞాన స్వరూపులైన సయ్యపరాజు సీతమ్మగారు (మా అమ్మమ్మగారు) ఆ కుటుంబమే. ఈ విషయం బేబి కుటుంబం తెలియకపోవచ్చును. విషయానికి వస్తాను. ఇంజనీరు రామకృష్ణంరాజుగారు జిన్నూరులో శ్రీనాన్నగారి అరుగు మీద వారికి ఎదురుగా కూర్చున్నారు. వారిని ప్రేమగా పలకరించారు. శ్రీనాన్నగారు లేచి రామకృష్ణంరాజు గారిని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి మరలా రెండుసార్లు ఆలింగనం చేసుకొన్నారు. భక్తులకు అది అంతుపట్టలేదు. సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఏమో ఎంత భక్తులో అనుకొన్నారు. రామకృష్ణంరాజుగారు కూడా "ఏమిటీ ఈ విశేషం. ఎప్పుడూ ఇలా జరగలేదు. భక్తులు ఏమనుకొంటారు" అని లోలోపల అనుకొన్నారట. ఒక గంట తరువాత శ్రీనాన్నగారు రామకృష్ణంరాజుగారు "మీ హైదరాబాద్ ప్రయాణం ఎప్పుడు?" అనగా "ఈరోజే నండి" అన్నారు. దానిపై శ్రీనాన్నగారు "రేపటికి వాయిదా వేసుకోరాదా?" అనగా "రేపు టిక్కెట్లు దొరకవు కదండీ" అన్నారు. శ్రీనాన్నగారు అభయహస్తాలు చూపుతూ సాగనంపారు. ఒంటరి ప్రయాణం. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి బయటికి వచ్చి ఒక ఖాళీ బెంచిమీద పడుకొని అంతిమ శ్వాస విడిచారు. ఇలా చాలా సమయం అయింది. ఇంటి నుండి ఫోన్ వచ్చింది. జేబులో ఉన్న రామకృష్ణంరాజుగారి సెల్ రింగ్ అవుతున్నది, ఎత్తటానికి ప్రాణం లేదు కదా! ఒకరు ఔదార్యంతో ఫోను స్వీకరించి మీ తాలూకు వారు మరణించినట్లు ఉన్నారు, ఆ ప్రదేశాన్ని చెప్పగా కొద్ది సమయంలోనే ఇంటి వారు వచ్చి ఆ శరీరాన్ని ఇంటికి తీసుకొని వెళ్ళారు. ఈ సంఘటన చూస్తూ ఉంటే నాకు ఇలా అనిపించింది "అరుణాచలేశ్వరుడు బాల భగవాన్‌ని తన సన్నిధికి చేర్చుకున్న ఘట్టాలు గుర్తుకొస్తున్నాయి. నేడు శ్రీనాన్నగారు ప్రాణం ట్రెయిన్‌లో కాకుండా బయటకు వచ్చేవరకూ ఆపుచేసి బెంచీమీదకు చేర్చి ఇంటికి పంపటం అంతా శ్రీనాన్నగారి ప్రత్యక్షవీక్షణం జరిగింది" అనిపిస్తున్నది. ఇంటి వద్ద కౌగిలించు కోవటంలో మర్మాలు

తరువాత భక్తులకు తెలిసింది. ప్రశాంతచిత్తంతో రామకృష్ణం రాజుగారు దేహాన్ని వదిలారు. శ్రీనాన్నగారి హృదయంలో చేరారు. కనిపించిన సంఘటనలు ఇవి. కనబడని సంఘటనలు ఎన్నో ఎవరు చెప్పగలరు గురుకరుణామయుని గాథలు?

38 భగవంతుని లీలలు చూద్దాము. శ్రీనాన్నగారిపై తిరువన్నామలైలో ఒక ఉన్మాది నాన్నగారి ఆశ్రమంలో డ్రయినేజీ నీరు దిగువ ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తున్నదని సివిల్, క్రిమినల్ కేసులు పోలీసు స్టేషన్‌లో పెట్టాడు. పైసలకోసం బెదిరించే వ్యక్తిపై మీరు కూడా ఆంధ్రప్రదేశ్‌లో కేసు పెట్టండి అని చెన్నై డిఎస్‌పి శ్రీనాన్నగారికి సలహా ఇచ్చారు. కానీ దానికి నాన్నగారు ఒప్పుకోలేదు, కారణం భవిష్యత్ పరిణామాలు వారికి అంతా తెలుసు కాబట్టి. చెన్నై డిఎస్‌పి వారే తిరువన్నామలై డిఎస్‌పి గారికి ఫోన్ చేసి "నాన్నగారు 78 సంIIల వయస్సులో ఎవరినీ చంపరు. చంపే శక్తి లేదు. ఆయన ముసలాయన. ఆ కేసును పరిగణనలోకి తీసుకోకండి" అని సలహా చెప్పారు. దేనికైనా కాలం, ఖర్మం కలసిరావాలి కదా! అక్కడ ఉన్న డియంకె, అన్నా డియంకె మరియు కాంగ్రెస్ సభ్యులపైనా కేసులు పెట్టగా మూడు పార్టీలవారు కూడబలుక్కుని మార్నింగ్ వాక్‌లో ఉన్న ఆ ఉన్మాదిని జిఎన్‌టి రోడ్డులో కత్తులతో పొడిచివేసారు, రోడ్డు అంతా రక్తమయమైపోయింది, చనిపోయాడు. ఇది రమణాశ్రమానికి కూతవేటు దూరంలో జరిగింది. పోలీసులు రోడ్డు ప్రమాదంలో మరణించాడని వ్రాసుకొని కేసును కొట్టివేసారు. తిరువన్నామలై ప్రజలు పండుగ చేసుకున్నారు. శ్రీనాన్నగారు అతడిని పొడిచే సమయంలో జిన్నూరులో ఉదయం 6 గంటలకు మంచం మీద నుంచి జారి పడ్డారు. ఏమిటి ఈ వింత సంఘటన అనుకోగానే ఉదయం 8 గంటలకు ఆతని మరణవార్త ఫోనులో శ్రీనాన్నగారికి తెలిసినది.

# 39

"24 మహాత్ములతో నా మధుర స్మృతులు" అనే గ్రంథాన్ని ఆంగ్ల మూలము శ్రీగణేశన్‌గారు వెలువరించారు. తెలుగుసేత శ్రీరమణపాద రేణువుగారు. ప్రచురణ శ్రీరమణనిలయ ఆశ్రమము, వేల్పూరు - 534 222, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఆ సౌజన్యంతో అతి సంక్షిప్తంగా వ్రాయటానికి ఎన్నుకొన్నాను. గ్రంథం పరిణామం ఎక్కువ అవుతుందని భావించాను. పూర్తిగా వ్రాయనందుకు పాఠకులు క్షమిస్తారని విన్నవించుకుంటున్నాను. గణేషన్ గారు శ్రీనాన్నగారిపై ఉన్న మధుర భావాలు :

"మనము ఇప్పుడు నాన్నగారితో ప్రయాణము ప్రారంభిద్దాము. ప్రపంచం మొత్తములో ఆయన భక్తులందరూ ఆయనను 'నాన్నగారు' అని పిలుస్తారు. పసిబిడ్డ వంటి అమాయకత్వము, యవ్వనమునందలి శక్తి, నిస్వార్థమైన స్వచ్ఛమైన ప్రేమ, హాస్యచతురత, జ్ఞానము అనువాని యొక్క సమ్మేళనము ఆయన. గృహస్థ జీవితము ఆధ్యాత్మిక సాధనకు, సాక్షాత్కారమును పొందుటకు ఎన్నటికీ అవరోధము కాదు అని ఋజువు చేసారు. భగవాన్ యొక్క స్వచ్ఛమైన బోధను అందజేస్తూ వారి అహంకారమును నిర్మూలించే సునామీగా తనను తాను నిరూపించుకున్నారు.

1934 సెప్టెంబరు 23వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలోని తన మాతామహుల గ్రామమైన 'కొమ్మర'లో శ్రీ బి.వి.ఎల్.ఎన్. రాజుగారు జన్మించారు. వారి స్వగ్రామం జిన్నూరు. ఆయన పూర్వీకులు వ్యవసాయదారులు. వారు ఔదార్యము, మానవత్వము, భక్తి కలిగియుండెడివారు. వారిది గౌరవనీయమైన కుటుంబము. ఆయన బాల్యములోనే తండ్రిని కోల్పోయారు. ఆయన తండ్రిగారి పేరు సూర్యనారాయణరాజు గారు. ఆయన తల్లిగారైన రాజాయమ్మగారు, అమ్మమ్మ గారైన సీతాయమ్మగారు.

20 సంవత్సరముల వయస్సులో ఆయన తన అమ్మమ్మగారితో కలిసి

ఉత్తర యాత్ర చేసారు. హృషీకేష్‌లోని స్వామి దయానంద గారి ఆశీర్వాదములను అందుకొన్నారు. నాన్నగారికి స్వంత జీవితము అనునది లేదు. సమానత్వమే ఆయన ఊపిరి. చాలామంది కేవలం ఆయన దర్శనము ద్వారానే పరిపూర్ణతను పొందినారు. శ్రీనాన్నగారు ఆధ్యాత్మిక ఆకాశంలో ప్రచండ సూర్యుని వలె వెలిగారు. ఆయన నామం జపించుటయే శుభప్రదమైనది. ఆయన మహాత్ములందరిలోకి మహాత్ముడు.

నాన్నగారు 1959 జనవరిలో శ్రీరమణాశ్రమమును తొలిసారి సందర్శించారు. అప్పటినుండి ఆయన జీవితం భగవాన్ సేవకు అంకితం చేసారు. తరచుగా నాన్నగారు "నా కోరిక వలన భగవాన్ నా జీవితంలోనికి ప్రవేశించుట జరగలేదు. ఆయనే నన్ను తన పరిధిలోనికి తీసుకొని పుష్కలంగా తన ఆశీర్వాదములను నాకు అందించారు" అనేవారు. శ్రీనాన్నగారి మాటల్లో విందాము "భగవాన్ ఆధ్యాత్మిక హృదయమునకు సహస్రారమునకు మధ్యగల మార్గమును తెరిచారు. అమృతనాడి జాగృతమగుటను నేను అనుభూతి చెందాను. అప్పటి నుండి 'ఆనందము' అనుభవించబడుతున్నది. ఇది నూతన ప్రారంభము". తాను అనుభవించుచున్న శాంతి, తమ ద్వారా ఇతరులకు కూడా ప్రసరింపజేయుచుండెను. ఆ విధముగా ఆయన ఆనందముతో కూడిన శాంతిని ఇతరులకు అందజేసెడి వాహనముగా మారుటయే గాక బాధపడుచున్న వారికి ఉపశమనమును కల్గించు చుండెను. శ్రీభగవాన్ అనుగ్రహమును నాన్నగారి ద్వారా పొందుతున్నట్లు భక్తులు తరచుగా అనుభూతి చెందుచుందురు.

ఆయన ప్రవచనము శక్తివంతముగా ఉండుటయేకాదు ఆయన మౌనము కూడా చెవులు చిల్లులు పడునట్లు చేయును. ఆ మౌనమునకు వినెడివారి (శ్రోతల) యొక్క ఆలోచనలు తొలగించి వారి మనసులను, ప్రశాంతముగా నుండునట్లు

చేయగలదు. కారుణ్యముతో నిండిన ఆయన చూపు బాధలలో ఉన్న వారి దుఃఖమును ఉపశమింపజేయును. నాన్నగారు భక్తులకు లభించిన అపురూపమైన పెన్నిధి. గురువుగారు శరీరములో ఉండిన ఉండవచ్చును లేదా శరీరములో మట్టిలో కలిసిన కలువవచ్చును. కానీ అన్నింటికంటే మించినది ఏమనగా మా సంపూర్ణ విశ్వాసము ఆయనపై ఉంచుటయే కాదా! ఆధ్యాత్మిక సాధనలో అతి నిశ్చయముగా ఇంతకంటే ఉన్నతమైనది అసలు లేనే లేదు.

నాన్నగారు ప్రఖ్యాతి చెందిన మానవతావాది. మానవసేవా పరాయణులు. ఆయన ఆధ్యాత్మిక తత్త్వవేత్త. ఒక విశిష్టమైనటువంటి గురువు. మార్గదర్శకులు. ఆయన దాదాపుగా ప్రతీరోజూ ప్రవచనములు ఇస్తూనే ఉంటారు. విసుగు విరామము లేకుండా ఆయన సరళమైన భాషలో తన వచనముల ద్వారా భక్తులకు ఎంతో నిజాయితీగా సత్యాన్వేషణ జరిగినట్లు ప్రేరణ కలిగిస్తారు. వారి నిజాయితీతో సత్యాన్వేషణ జరిపేటట్లు ప్రేరణ కలిగిస్తారు. వారి నిజాయితీ వారిని ఆధ్యాత్మిక మార్గంలో పురోగమించునట్లు చేస్తుంది. నాన్నగారిని కలిసినప్పుడు నేను నిజమైన మహాత్మునివద్ద ఉన్నటువంటి అనుభూతి నాకు కలిగింది.

# 40. జిన్నూరు పార్వతమ్మగారి అనుభవాలు

1988 ఏప్రియల్ నెలలో మనసుకు గాలివానంత కష్టం, సముద్రమంత దుఃఖం రెండూ మనస్సుకు చుట్టుకున్నాయి.

ప్రార్థన

**"యుగములు లేనిది, రూపము లేనిది, గురువు లేనిది, శిష్యురాలు లేనిది, అనంతమైన నీ శక్తి కాంతిలో నిండి యున్నది. కరుణించి కాపాడి కాంతిలో లయము చేయి అరుణాచలా! అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ అరుణాచలా!"**

తదుపరి రోజున పార్వతమ్మగారు శ్రీనాన్నగారి వద్దకు వెళ్లారు. శ్రీనాన్నగారు వారిని చూచి "మీ కోరిక ఫలిస్తుంది" అని అభయము ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే శ్రీనాన్నగారి యొక్క అనుగ్రహంతోటి "శాంతికి పాత్రురాలయ్యాను" శ్రీ నాన్నగారి పాదపద్మములకు హృదయపూర్వక నమస్కారములు. నాలోని వాసనలు అనే వృక్షాన్ని తెంచారు అనిపించింది. కన్నీరు మున్నీరుగా ఆనందభాష్పాలతో నిండిపోయాను. "ఎవ్వరూ చెయ్యలేని ఉపకారం గురుదేవులతోటి నేను పొందుతున్నాను" అని అనిపించింది. గురుదేవుల పాదపద్మములకు హృదయపూర్వకముగా నమస్కరించాను.

వారి మాటల్లో ప్రధానమైన విషయం "శాంతికి పాత్రురాలనయ్యాను" అన్నారు. ఇది నాకు ఆత్మానుభవము అయినదని చెప్పకుండా మర్మగర్భంగా చెప్పినారు అని నా ధృడవిస్వాసము. ఎందుచేతనంటే శ్రీనాన్నగారు "ఏ జ్ఞానీ నాకు ఆత్మానుభవం అయినదని చెప్పడు. అక్కడ నేను ఉంది" అన్నారు. వారి ప్రవచనాలు పుస్తకం కూలంకషంగా పరిశీలించాను. ఆ ప్రవచనాలు ఆత్మానుభవానికి సరితూగుతాయి. భాషాపరంగా కొంత పరిపుష్టి లేకపోవచ్చు, శైలిలో కొంత విశాలంగా లేకపోవచ్చును. వారి ప్రవచనాలలో మచ్చుకు ఒకటి ప్రస్తావిస్తాను "జ్ఞాపకాలే కర్మను పోగుజేస్తాయి. మనకు వచ్చే జ్ఞాపకాలను, తలంపులను గుర్తించి, బలీయంగా ఉన్న వాటిని గురువు మాట పట్టుకొని తపించాలి. గురువు మాటను 'లక్ష్యం'గా పెట్టుకొంటే మనం సత్యంవైపుకు ప్రయాణం చేస్తున్నామా? అసత్యం వైపుకు ప్రయాణం చేస్తున్నామా అనేది తెలుస్తుంది" అన్నారు.

శంకర భగవత్పాదులు "నిశ్చల స్థితే జీవన్ముక్తి" అన్నారు. పార్వతమ్మగారి ముఖం చూస్తే వినిర్మలమైన ముఖము, ప్రశాంతత తాండవిస్తున్నది. వారు ముమ్మాటికీ జ్ఞాన స్వరూపులే. శ్రీనాన్నగారి అనుగ్రహం వల్లనే వారు కృతార్థులైనట్లు

నేను భావిస్తున్నాను. శ్రీనాన్నగారి చూపుతో కృతార్థులైనవారు యూరోపియన్‌కు చెందిన వారు ఇద్దరు కృతార్థులైనారు. అజ్ఞాతంగా ఎంతో మంది ఉండవచ్చును. భగవాన్‌పై ఒకరు వ్రాసిన కీర్తన 'రమణ సద్గురు, రమణ సద్గురు, రమణ సద్గురు రాయనే. తల్లి తండ్రివి, గురువు దైవము అన్నీ నీవని తలచితి; చెప్పలేని ఆనంద సముద్రమున ముంచితి; రమణ సద్గురు". ఈ ద్విపద పార్వతమ్మగారికి పూర్తిగా వర్తిస్తుంది.

యోగి వేమన

**"స్వానుభూతిలేక శాస్త్రవాసనలచే**
**సంశయంబు విడదు సాధకునకు**
**చిత్ర దీపమునను చీఁకటి పోనట్లు**

అన్నారు. స్వానుభూతి వల్ల సంశయము తొలగిపోయాయి. పార్వతమ్మ గారికి వారి ప్రవచనాలు చూస్తే ఇది సత్యం అనిపిస్తుంది. పార్వతమ్మగారు నేను కృతార్థురాలైనానని చెప్పరు. "ఏకమక్షరం హృదినిరంతరం బాసతే స్వయం విఖ్యతే కథం" (హృదయంలో ఏకంగా నిరంతరంగా ప్రకాశిస్తున్న సత్యాన్ని వ్రాతతో మాటలతో ఎలా చెప్పగలం?) ఇది శాస్త్ర ఉవాచ. మూడు సంవత్సరాల పసిపాప తల్లితో "అమ్మా! అమ్మా! నేను నీకు ఎలా పుట్టాను?" అనగా తల్లి మైథనంలోని పనులు తెలిపినా అర్థం కావని నవ్వుకొని "నిన్ను ఓ బైరాగివాని వద్ద ఒక రూపాయికి కొన్నాను" అనగా పసిపాప అలాగా అని తృప్తిపడింది. సాధకుడు సాధన బాధలనతో సిద్ధి పొంది ఆ 'నవనీతాన్ని' పసిపాపలమైన మనకు సూచనలు చేస్తారు. మైలు రాళ్ళు మనలను తీసుకొని వెళ్ళవు, గమ్యం ఎంత దూరంలో ఉందో సూచిస్తాయి. అలాగే వేదం, జ్ఞానులు సూచిస్తారు. మూగవానికి మిఠాయి ఇచ్చి రుచి ఎలా ఉంది అంటే ఎలా చెప్పగలడు? మిఠాయి రుచి అందని సాధకులు మనం.

పూరీలో శ్రీకృష్ణ చైతన్యులవారు పూజకోసం పూలు కోస్తూ ఉంటే ఒక సాధకుడు పూలు కోయటంలో సాయం చేస్తూ వుంటే శ్రీకృష్ణ చైతన్యులవారు వాడిని ఉద్దేశించి "బాబూ నీవు ఎవరవు?" అనగా ఆయన "అయ్యా! శాస్త్రాలు, వేదాలు నీవు ఆత్మవు అంటున్నాయి. అది నా అనుభవంలో లేదు. శరీరమే నేను, ఈ పేరే నేను అనుకొంటున్నాను. మీకు నేను ఎలా చెప్పగలను?" అనగా స్వామి నవ్వుకొని "బాగానే చెప్పావు. ఈ పూల మొక్కను ఎవరో నాటి కంచె వేసి రోజూ నీళ్ళు పోసి పెద్దది చేసారు. దాని పూలను, సువాసన మనకు అందిస్తున్నది. అలాగే మనం ఏకాంతవాసం గడిపి పూజ, జపాలతో, ధ్యానాలతో గడిపి సిద్ధి పొందితే అప్పుడు అహంబ్రహ్మాస్మి అని అనవచ్చు" అన్నారు. ఇది సాధకునకు మంచిని చేస్తుంది. నవనీతం అందుతుంది. పార్వతమ్మగార్కి ఆ నవనీతం అందిందని చెప్పగలను. అంతే. కాని పార్వతమ్మగారిని నవనీతం అందింది కదా అంటే, నేను సాధకురాలనే అంటారు నాకు అందిందని అనరు నాకు, నేను అనరు కదా! ఆ మర్మాన్ని మనమే తెలుసుకోవాలి అంతే.

41 అరుణాచలంలో ఆంధ్ర ఆశ్రమములో శ్రీనాన్నగారు విడిది చేసారు. భక్తులతో హాలు కిక్కిరిసిపోయింది. ముందు వరుసలో పారశీక భక్తులు ఉన్నారు. శ్రీనాన్నగారు భక్తులతో ముచ్చటిస్తున్నారు. అనసూయమ్మగారు రచయిత, అనువాదకురాలు, ప్రతిభాశాలి. కన్‌హన్‌గాడ్ రామదాసుగారి ఆశ్రమంలో కొంతకాలం గడిపారు. భగవాన్ జీవించి ఉండగా వారి సమక్షంలో కొంతకాలం గడిపారు. భగవాన్ హావభావాలు, ఆహార్యాలు భక్తులకు చెబుతూ ఉండేవారు. తెలుగువారే కానీ శ్రీనాన్నగారిని సరిగా అర్థం చేసుకోలేదు అని నాకు అనిపించింది. నాన్నగారి హాలులో ప్రవేశించి అందరినీ తొక్కుకుంటూ నాన్నగారి సమక్షంలోకి చేరి పీట వేసుకొని ఎదురుగా కూర్చున్నది. శ్రీనాన్నగారు ఆమెను ఉద్దేశించి "అనసూయమ్మగారు బాగున్నారా? మీ

కుంటుంబమంతా బాగా ఉన్నారా? బాగా సెటిల్ అయ్యారు కదా!" అని అడుగుతూ ఉంటే "ఆ గొడవలు చెప్పటానికి ఇక్కడికి రాలేదు నేను. ఏదో నాలుగు మంచి మాటలు చెబుతారని వచ్చాను" అన్నది. ఆ మాటతో నాన్నగారు మౌనంగా ఉంటూ ఇతర భక్తుల విషయానికి వెళ్ళారు. శ్రీనాన్నగారు ఒక సందర్భంలో "డాక్టరు పేషెంట్‌కు ఆపరేషన్ చేసే సమయంలో రోగితో అసందర్భమైన మాటలు అంటాడు. అది ఎలా అంటే 'మీరు బాగా ధనవంతులు అంట. కారు కొనుక్కోవచ్చు కదా!' అంటే పేషెంటు అంటాడు ఊరుకోండి 'నేను సామాన్యమైన వ్యక్తిని' అని. ఇలా ఎన్నో మాటలతో పేషెంట్‌ను బాధ నుంచి తప్పించటానికి ఎన్నో అంటాడు. డాక్టరు లక్ష్యం పేషెంట్ ఆపరేషన్ వల్ల జరిగే బాధను మరలించడానికి. అలాగే గురువు కూడా భక్తుని యోగక్షేమాలు అడుగుతూ వాని వాసనలు తొలగిస్తాడు. దీన్ని రోజర్ చాలా చోట్ల అన్నారు. ఆ మాటపై శ్రీనాన్నగారు "ఆయన క్లీన్ అబ్జర్వర్" అన్నారు. అది అనసూయమ్మగార్కి తెలియలేదు. భగవాన్ రచనలను, ద్వారకానాథ్ రెడ్డిగారి రచనలను చక్కని శైలిలో తెలుగులో ఎన్నో గ్రంథాలు వ్రాసారు. అందుకే జిడ్డు కృష్ణమూర్తి "అవగాహన అనేది మానసిక ప్రక్రియ కాదు. అది ఈశ్వరుని నుంచి రావాలి" అని అంటారు. నాన్నగారిని అర్థం చేసుకోవటం చాలా కష్టం.

42 రోజర్‌ను ఖండవల్లి సత్సంగంలో నాన్నగారు మాట్లాడమనగా ఆయన ఇలా "మీరు నాన్నగారిని ఎందుకు అంత ప్రేమగా కనురెప్ప వేయకుండా, ఆనందంగా, ఏకాగ్రతతో ఎందుకు చూస్తున్నారు అనగా మిమ్ములను మీరు చూసుకొంటున్నారు కాబట్టి". ఈ మాటలు భక్తులకు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలుగజేసింది. తెల్లవాళ్ళకు గ్రహణశక్తి ఎక్కువ.

43 పూర్వం రమణాశ్రమం హాలులో కొందరు భక్తులు భగవాన్ ఎదుట ఇలా జపం చేస్తున్నారు "రమణా, రమణా, రమణా, రమణా" అంటూ ఉండగానే భగవాన్ భక్తుల జపంతో వంత కలిపారు.

అంటే ఆయనా ఆ జపాన్ని చెయ్యటం చూసి భక్తులు "అయ్యా! మీరు అనకూడదు. మీరు మా నామాన్ని వింటూ ఉండాలి" అనగా భగవాన్ "రమణుడు అంటే శరీరమా? పరమాత్మా?" అంటూ రమణా రమణా అంటూ ఆ నామంలో కలిసిపోయారు. భక్తులకు ఆశ్చర్యము సంబరాలతో నామాన్ని ఆలపిస్తూ ఒకటే నవ్వుతూ ఉన్నారు.

జిన్నూరులో భక్తుల సమక్షంలో శ్రీనాన్నగారు కండువా మెడలో వేసుకొన్న ఆయన ఫొటోకు నమస్కరిస్తున్నారు. నేను ప్రత్యక్ష సాక్షి. శ్రీనాన్నగారు ఆయన ఫొటోలో ఉన్న ఆయన రూపాన్ని పరమాత్మగా ఎంచి నమస్కరిస్తున్నారు. అందరికీ ఆశ్చర్యానందం కలిగింది. అంటే కొద్దిమంది భక్తులే ఉన్నారు. నాన్నగారు పరమాత్మ కదా! ఆ పరమాత్మకు భక్తుడిగా నమస్కారం పెట్టటం. ఇక్కడ గ్రహించవలసింది భక్తిని నేర్పటానికి భగవాన్‌లాగే నాన్నగారు చేసారు. తండ్రి తన బిడ్డలకు భక్తిని రగిలించటం. ఆ ఫొటోలో శ్రీనాన్నగారి కళ్ళు అందరికీ నచ్చుతాయి. ఆ ఫొటోలో రూపం నాకు బాగా నచ్చింది అని ఒక సందర్భంలో నాన్నగారు అన్నారు. నిజమే శ్రీనాన్నగారి ఫొటోలో ఉన్న ప్రతీ రూపానికి నమస్కరించాము. ఇక్కడ ఉన్న నాన్నగారే ఆ ఫొటోలో ఉన్నారు. తేడా ఏమీ లేదు. శ్రీనాన్నగారి రూపం లేకపోయినా ఆ ఫొటోలో ఉన్న రూపం మనకు సత్యానికి దారి చూపిస్తుంది. అందుకేనా ఈ నాటకం అనిపిస్తుంది. అది నాన్నగారికే ఏరుక.

44 భగవాన్‌కు ఒక సందర్భంలో శరీరం ఊగిపోయింది. పడిపోతారేమో అని భక్తులు ఆందోళన చెందారు. తదుపరి సముదాయించుకున్నారు. భక్తులు 'ఎందుకు ఇలా జరిగింది?' అనగా "భగవాన్ గుడిసెలో పెద్ద ఏనుగు దూరితో గుడిసె ఏమౌతుంది?" అన్నారు. అంటే అనంతశక్తి భౌతిక దేహంలో ఒకోసారి ఇమడలేదు అని అర్థం చేసుకోవాలి.

అలాగే నా స్వగృహంలో శ్రీనాన్నగారు మోడామీద కూర్చుని ఉండగా పెద్ద

కుదుపు వారి శరీరానికి తాకింది. శరీరం ఊగింది. భక్తులు పడిపోతారేమో అని ఆందోళన చెందారు. తదుపరి సముదాయించుకొన్నారు. అంటే భగవాన్ శ్రీనాన్నగారికి తన అనంత శక్తిని ఆ దేహంలో ఉంచారు అని అర్థం చేసుకోవాలి. ఇద్దరికీ తేడా లేదనిపించింది.

## శ్రీనాన్నగారి కాలజ్ఞానం

45 పదిహేను సంవత్సరాలకు పూర్వం భీమవరంలో సత్సంగానికి శ్రీనాన్నగారు వెళుతూ ఉండగా, మెట్లు దిగుతూ ఉండగా భీమవరానికి చెందిన ఇ.ఇ. కృష్ణమూర్తి రాజుగారు శ్రీనాన్నగారితో "అయ్యా! టివిలో చూసాను, పెద్ద సునామీ వచ్చింది. బహుశా మనకు తాకుదు" అనగా ఊకొట్టి తదుపరి ఇష్టాగోష్టిలో శ్రీనాన్నగారు ఇలా అన్నారు "రెండు మూడు సునామీలు వచ్చిన తరువాత పెద్ద సునామీ వస్తుంది. అప్పుడు పాలకొల్లు గోపురం ఎక్కినా ఎవరూ మిగలరు" అన్నారు. నాలుగు వందల సంవత్సరాలనాడు ఒక సునామీ తాడేపల్లిగూడెం వరకు వచ్చిందని నాటి పెద్దలు చెప్పగా పరంపరగా అది ఇప్పుడు అనుకొంటున్నాము.

46 భగవాన్ భుజంపై ఒక పిచ్చుక వాలి ఒకటో రోదన చేస్తూ ఉంటే మాధవుని పిలిచి "ఏమిటి విషయం?" అనగా "మీ సోఫా పైన పిచ్చుక గూడు కట్టింది. రెట్టలు, వగైరాలు మీ మీద పడతాయని దాని గూడును నేనే తొలగించాను. మీ మీదే పడేలా కట్టాలా? వేరే చోట కట్టుకోవచ్చు కదా!" అనగా భగవాన్ "మాధవా! ఎంత పని చేసావు? అది తన చిన్న ముక్కుతో శ్రమపడి కట్టుకొంది. మనమే సోఫాను మార్చుకుంటే సరిపోయేది" అన్నారు. సాధారణంగా పిచ్చుకలు మనిషి మీద వాలవు వారు బంధిస్తారని. కానీ భగవాన్ పరమాత్మ అని ఆయన భుజం మీద వాలి గోడు

వెళ్ళబోసుకొంది. ఈ సంఘటన భక్తులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అలాగే పూర్వం శ్రీనాన్నగారి పెంకుటిల్లు అరుగుకు ఎదురుగా గోడకు ఆనుకొని ఎర్రగుత్తుల పూల మొక్క సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో బలంగా కొమ్మలతో ఎదిగి ఉంది. దాని కొమ్మలు నిండా సుమారు పది పదిహేను పిచ్చుక గూళ్ళు ఉన్నాయి. అవి సందడి చేస్తూ ఉండేవి పిల్లలతో. సాధారణంగా పిచ్చుకలు మనుషులకు అందనంత ఎత్తులో గూళ్ళు కట్టుకొంటాయి. పిచ్చుక గూళ్ళు చాలా చిత్రంగా ఉంటాయి. కాకులు లోనికి ప్రవేశించకుండా నిర్మించుకుంటాయి. శ్రీనాన్నగారి పూల చెట్టులో గూళ్ళు చిన్నపిల్లలకు కూడా అందేటట్లు కట్టుకొన్నాయి. నాన్నగారు ఉన్నారు మన జోలికి ఎవ్వరూ రారని వాటికి ధైర్యం. శ్రీనాన్నగారు మనిషి కాదు మనీషి (పరమాత్మ) అని, మన వారే అని ఎవరైనా తన గూటికి వచ్చి తొంగిచూడరు; చూస్తే నాన్నగారు ఊరుకోరని వాటికి ధైర్యం. భక్తులకు ఆ గూళ్ళు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. కొందరి ఇళ్ళలో పిచ్చుక గూళ్ళను కట్టి అందు బొమ్మ పిచుకలను పెట్టుకొంటూ ఆనందిస్తారు. నాన్నగారి ఇంటి పిచ్చుకు గూళ్ళు సహజమైనవి. అది శ్రీనాన్నగారి వైభవంగా భక్తులు భావిస్తారు.

# 47

పూర్వం విజయవాడలో ఒక ఆధ్యాత్మిక సమావేశంలో కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి ప్రవచనం సాగిస్తున్నారు. వాల్మీకి రామాయణంలో ఒక పద్యంలోని మర్మాన్ని, ఆ సంఘటనలోని లోతులను సామాన్య సాధకులకు అర్థంకాని అంశాన్ని విపులంగా విశదీకరిస్తూ ఉంటే ప్రసంగాన్ని విన్న మహాకవి విశ్వనాథ సత్యనారాయణగారు (వేయి పడగలు గ్రంథకర్త) ఆనందంతో ఊగిపోతూ "ఓహో రాముని అంతరంగాన్ని తరచి తరచి మనకు తెలుపుతున్నారు" అంటూ ఉండగా ప్రక్కనే ఉన్న శ్రీనాన్నగారు విశ్వమయం చెందారు. జ్ఞాని హృదయాన్ని జ్ఞానే గుర్తించగలడు. ఇది నగ్న సత్యం.

శ్రీనాన్నగార్కి మహాత్మాగాంధీ అంటే చాలా ఇష్టం. ప్రవచనాలలో వారి వైభవాన్ని తెలుపుతూ ఉంటారు. బాపూ "నన్ను ఎవరైనా తుపాకీతో కాల్చి చంపకపోతే నేను 120 సం॥లు జీవిస్తాను" అన్నారు. రేపు బాపూ చనిపోతారనగా వారి పి.ఎ. బాపూతో "అయ్యా! రేపు మధ్యాహ్నం ఫలానా కార్యక్రమంలో పాల్గొనవలసి ఉంది" అనగా "రేపు బ్రతికుంటే చూద్దాములే, రేపటి గొడవ ఇప్పుడు ఎందుకు?" అనగా ఆయన ఖంగుతిన్నాడు. తరువాత సమాధానపడి యథాలాపంగా అని ఉంటారు అనుకొన్నాడు. బాపూ అంతిమకాలం సమీపించింది. బిర్లా మందిరం నుంచి దిగి వస్తున్నారు. గాడ్సే మహాత్మునితో "అయ్యా! లేటు అయినది" అన్నాడు వెంటనే బాపూ "ఔను. లేటు అయినది" అన్నారు. వెంటనే పిస్టల్‌తో గాంధీజీని కాల్చివేసాడు. బాపూ "హేరామ్ హేరామ్" అనటం నేనలకొరిగారు. బాపూజీ మాటలో "ఔను. లేటు అయినది" అన్న మాటను శ్రీనాన్నగారు ఇలా విశ్లేషించారు "స్వాతంత్ర్యం తీసుకొని వచ్చావు కదా! ఇక ఈ శరీరంతో పని ఏముంది అని ఈశ్వరుడే గాడ్సేతో అనిపించాడని బాపూ భావించారు. గాంధీజీ ఇలా అనుకొన్నారు" అని శ్రీనాన్నగారు తెలిపారు. నిజానికి బాపూ ఏమీ మాట్లాడలేదు. ఇది ఎవ్వరూ ఊహించనిది. శ్రీనాన్నగారు గాంధీజీ హృదయంలో ప్రవేశించి వారి అంతరంగాన్ని తెలుసుకొని చెప్పారు. పైన ఉదహరించిన పరమాచార్యులవారు రాముని అంతరంగంలో భావాలను తెలిపినట్లే శ్రీనాన్నగారు బాపూ హృదయంలోకి ప్రవేశించి తెలిపారు. జ్ఞాని హృదయాన్ని జ్ఞానే తెలపగలరని దీని తాత్పర్యం. ఇది నాన్నగారి ఔన్నత్యం. బాపూ వైభవం తెలుసుకోవాలి అంటే "నా జీవితమే నా సందేశం" అన్న గ్రంథ రాజాలను కొన్ని ఉన్నాయి. వాటిని చదివితే వారి వైభవం మన హృదయానికి అందుతుంది. అది నా అనుభవం. నాన్నగారు దానిని వేనోళ్ల సమర్థించారు.

**48** **మహాజ్ఞానిని గౌరవించి ఆశీస్సులు పొందేవారు ఎలాగైతే ఉంటారో అలాగే దూషించి, అవమానించి, మరలా కోర్టులకు ఈడ్చిన వారు ఉంటారు. ఈ సమాజం మామూలు మనుషులను వదలనట్లే, జ్ఞానులకు పీడకలలుగా వారు వెంటాడుతూ ఉంటారు.**

A హైందవ సాహిత్యంలో రాజులు స్వాములను దర్శించేటప్పుడు సైన్యాన్ని దూరంగా ఉంచి ఒంటరిగా కిరీటం, కత్తులు, పాదరక్షలు వదలి స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి ఒక యాచకుడిలా మీ ఆశీస్సులు కావాలని ప్రార్థిస్తారు. భగవాన్ వద్దకు తిరువాన్‌కూరు మహారాజు, మైసూర్ మహారాజు ఆశ్రమానికి కొంత పైకం సమర్పించి పళ్ళు ఫలాలతో స్వామికి నివేదించి వెళ్ళేటప్పుడు "అయ్యా! నా కట్టుబాట్ల వల్ల తమ దర్శనానికి రాలేకపోతున్నాను. కొద్ది సమయమే మీ సన్నిధిలో ఉన్నా మీ అనుగ్రహం కావాలి" అని అర్థించి దర్శనమైనదని తృప్తిగా వెళతారు. వారిని భగవాన్ పండిన పండు అనేవారు.

B బాధించేవారి విషయానికి వస్తాను. షిరిడీ బాబాకు ఒక దొంగ గొలుసు దొంగిలించి ఇది నాకు బాబా ఇచ్చారని పోలీసుల యెదుట సాక్ష్యం ఇయ్యగా, పోలీసులు కోర్టులో కేసు వేయగా, కోర్టు బాబా పెద్దవారని కోర్టుకు పిలవటం మర్యాద కాదని కమీషనర్‌ను వేయగా ఆయన్ రాకను బాబా గుర్తించి బల్లలు వేయించి అభియోగం తెలిపి "మీరే ఈ దొంగకు గొలులు ఇచ్చారా?" అనగా "ఇస్తే ఇచ్చానేమో" అనగా పరివర్తనకు గురియైన దొంగ "స్వామీ! మీరు ఇయ్యలేదు. నేను బయట దొంగిలించాను" అనగా బాబాపై కేసు వీగిపోయింది. "ఈ విచారణలో నాకు అలసట కలుగలేదు" అన్నారు బాబా.

C ఒక మతోన్మాది ప్రయాణంలో ఉన్న బుద్ధుని నిలదీసి "నీవు హైందవ మతానికి కీడు చేస్తున్నావు" అని దుర్భాషలతో ఊగిపోతూ ప్రతీకారం చాలక కాండ్రించి

మొహం మీద ఉమ్ము వేసాడు. బుద్ధుడు ప్రశాంతంగా అంతా విని ఉమ్ము తుడుచుకొని అతనితో "రేపు ఈ సమయానికి మరలా వస్తాను. ఇంకా ఏమైనా ఉంటే తిట్టు" అని వెళ్ళారు. ఉన్మాదికి రాత్రికి నిద్రపట్టక పరివర్తన చెంది మరుసటి రోజున బుద్ధుని కాళ్ళపై పడి క్షమాపణ చెప్పాడు.

D భగవాన్ రమణాశ్రమ నిర్మాణంలో ప్రభుత్వ అనుతి లేకుండా అటవీ ప్రాంతాన్ని ఆక్రమించారని వారి భక్తుడే ఒకడు ఆశ్రమంలో తన మాట చెల్లటం లేదని ద్వేషంతో కోర్టులో దావా వేసాడు. భగవాన్‌ను కోర్టుకు పిలిపించటం మర్యాద కాదని కమీషనర్‌ను విచారణకు ఆదేశించారు. కమీషనర్ "ఆశ్రమం ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా ఎలా నిర్మించారు?" అని అడుగగా భగవాన్ "ఏదో శక్తి కొండ మీద నుంచి ఇక్కడికి తీసుకొని వచ్చింది" అన్నారు. కమీషనర్ "మీరు డబ్బు స్వీకరించరు. ఈ భవన నిర్మాణానికి డబ్బులు ఎలా వచ్చాయి?" అనగా భగవాన్ "ఎవరినీ అడుక్కోకండి అంటున్నాను. డబ్బు వస్తున్నది. నిర్మాణాలు జరుగుతున్నాయి" అన్నారు. కమీషనర్ "మీరు ఆపమన్నా కమిటీ వాళ్ళు మీ మాట వినకపోతే ఏమి చేస్తారు" అనగా భగవాన్ "నేనే వెళ్ళిపోతాను" అన్నారు. ఈ మాటలతో తృప్తి చెందిన కమీషనర్ వెళ్ళిపోయారు. "ఈ విచారణ భగవాన్‌కు అలసట కలుగలేదు" అన్నారు.

E పాకలపాటి గురువుగారు శ్రీశ్రీశ్రీ దామరాజు వెంకట రామయ్య నామధేయులైన శ్రీబాబుగారిని ఆధ్యాత్మిక మహానుభావులలో ఉన్నతమైన వారు. నర్సీపట్నం అడ్డరోడ్డుకు ఉత్తరంగా ముందుకు వెళితే బాబుగారి ఆశ్రమం ఉంది. పాకలు వేసి నిత్యాన్నదానం చేసేవారు. వారి చరిత్ర ఎక్కిరాల భరద్వాజ గారి సాహిత్యంలో తెలుస్తుంది. అప్పటి పాలనలో ఉన్న బ్రిటీష్‌వారు వీరిపై "నిత్యాన్నదానానికి డబ్బు ఎక్కడ నుంచి వస్తున్నది" అని ఎంక్వైరీ కమిటీ వేసారు.

ఎంక్వైరీకి ముందు భోజనం చేసారు. ఆ మధుర ఆహారం వారికి ఎక్కడా లభించలేదు. అంతులేని ఆనందం కలిగింది. విచారణ మాట వదిలేసి వారికి సెల్యూట్ కొట్టి వినమ్రతతో వెళ్ళిపోయారు. బాబుగార్కి సాంబవీమాత (అన్నపూర్ణా దేవి) అనుగ్రహం పూర్తిగా ఉంది. మహాత్ములతో చెలగాటమా!

F నాకు జాతకాల పిచ్చి ఉన్నదని ముందే చెప్పాను. అది ఆధ్యాత్మిక మార్గంలో రాకపూర్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన డా॥ మర్రి చెన్నారెడ్డి గారి జాతకం ఒకటి వేయమని నా బాల్యమిత్రుడు అమాత్యుడు నన్ను కోరియున్నాడు. వేయించి వారికి పంపాను. సారాంశం ఇది "రెడ్డిగారు పని అయిపోయింది. ఫలానా రోజున దిగిపోతారు. అనతికాలంలోనే గవర్నర్‌గా పదవీ బాధ్యత స్వీకరిస్తారు". ఈ నా లేఖ వారి చేతికి నా మిత్రుని ద్వారా చేరింది. అనతికాలంలో రెండు సంఘటనలు ఖచ్చితమైన తేదీలలో జరిగింది. ఇది ఆంధ్రా ఉద్యమకాలం. ఆయనకు ఆశ్చర్యం కలిగింది. నా పేరు వారి మదిలో చోటుచేసుకొంది.

నేను ఆధ్యాత్మిక మార్గంలో శ్రీనాన్నగారి అభిమానిగా మారినప్పుడు డా॥ చెన్నారెడ్డిగారి పి.ఎ. ఆధ్యాత్మిక సలహాదారుగా ఉన్నారు. ఒక ఆధ్యాత్మిక సభలో రెడ్డిగారు వారి సలహాదారు మాటలను ఉటంకించారు. ఆ సంఘటన పత్రికల ద్వారా గ్రహించి వారి పి.ఎ. గారికి నేను ఇలా వ్రాసాను "రెడ్డిగారి మాటలు పరిణతి చెందలేదు. ముఖ్యమంత్రిగారి మాటల్లో తప్పులు ఉన్నాయి. మా సద్గురు శ్రీనాన్నగారు ఆ అంశంపై ఇలా అన్నారు. మీ అభిప్రాయం సరిజేసుకోండి" అనగా ముఖ్యమంత్రిగారికి అనుమానం కలిగి "అసలు ఈ నాన్నగారు ఎవరు మనలను తప్పుపట్టటానికి?". నాన్నగారిపై ఎంక్వైరీ వేయించాలనుకొన్నారు. చేతిలో పని. ఎస్పిని పిలిచి మన పోలీసుల ద్వారా ఆయన జీవనశైలి ఏమిటో పూర్తి భోగట్టా పంపండి అని హుకుం జారీ చేసారు. ఇది 1990 సం॥ పూర్వంగాని

తరువాత గానీ జరగవచ్చు. నాకు సరిగా గుర్తులేదు.

పోలీసులు ఎక్కడివారో తెలియదు నాన్నగారిని ఎంక్వైరీకోసం బూటుకాళ్ళతో ఇంటికి సిద్ధమైనారు. శ్రీనాన్నగారు ఇంట్లో లేరు, అక్కడున్న నాన్నగారి సన్నిహితులను వారు అడిగిన ప్రశ్నలు "వారు ఏ ఆహారం తీసుకుంటారు? మత్స్య, మాంసాలు, మందు, వగైరాలు తీసుకుంటారా? వారి ఆస్థి ఎంత? వారికి డబ్బులు ఎలా వస్తున్నాయి?" ఇలా ఎన్నో ప్రశ్నలు అడిగారు. ఆంతరంగికులు న్యాయమైన రీతిలో విషయం చెప్పారు.

ఈ విషయం నాన్నగారు గ్రామాంతరం నుంచి వచ్చాక చెప్పారు. దానిపై ఆయన "ఎందుకంత హైరానా. అన్నంలో బీరకాయ పప్పు, మజ్జిగ వేసుకుని తింటారు అనకపోయారు" అన్నారు. అంతటితో ఆ సమస్య అంతరించింది.

కొంతకాలానికి కొందరు శ్రీనాన్నగారితో "మీ మీద ఇన్‌కం ట్యాక్స్ వాళ్ళు రైడ్ చేస్తారట. మీరంటే కిట్టని వాళ్ళు ఉండవచ్చు" అనగా శ్రీనాన్నగారు "రానివ్వండి. వాళ్ళు వచ్చి నాకే డబ్బు ఇచ్చి వెడతారు" అన్నారు. కానీ అటువంటిది ఏమీ జరగలేదు. శ్రీనాన్నగారి ఇంట్లో ఇనుప పెట్టె లేదు. దొంగ సొరుగులు లేవు. ఇల్లు ఖాళీ. జేబులో డబ్బు జరుగుబాటు కోసం ఉంచుకొన్నదే. ఆదాయం అంతంత మాత్రమే. పైన ఉదహరించిన సంఘటనలు శ్రీనాన్నగారిని వదలవని తెలపటానికే పైవి వ్రాయవలసి వచ్చింది. క్రీస్తు, బుద్ధుడు, సోక్రటీస్, బ్రున్ పరిత్యాగ వేదన అనుభవించారు. న్యూటన్ ఎన్నోసార్లు భోజనం చెయ్యలేదు. మొదట వీరు విలువలను చెల్లించి జగదారాధ్యులైనారు. మహాధర్మం పాపులని, తత్త్వవేత్తలని, ప్రవక్తలని, మహాత్ములని ఎవరినీ గౌరవించదు.

G భగవాన్ భక్తురాలు పాటలు పాడేవారు. భగవాన్ సన్నిధిలో కూర్చుని ఉన్నారు. వర్షం వస్తోంది. మబ్బులు గట్టిగా ఉన్నాయని వర్షంలో తడవకుండా

చేసుకోవాలని భగవాన్ వద్ద సెలవు తీసుకొనేందుకు నిలబడింది. ఆమెను భగవాన్ పాటలు పాడమన్నారు. వర్షం కూడా కుండపోతగా ప్రారంభమైనది. ఆమె పాడుతూనే ఉంది. చివరకు భగవాన్ వెళ్ళమని అనుమతి ఇచ్చారు. సరిగ్గా అప్పుడే వర్షం ఆగింది. ఆమె ఇంటికి చేరుకుంది. మరల కుంభవృష్టి. మరునాడు ఆమె భగవాన్ వద్దకు రాగా భగవాన్ చిరునవ్వుతో "ఏమి చెల్లెమ్మా! నీవు వానలో తడిసిపోలేదా?" అనగా చెల్లెమ్మ తనకు వచ్చిన ఆలోచన ఎలా తెసిలిపోయిందో అని ఆశ్చర్యపడింది. ఇటువంటి చిన్న విషయాల్లో భగవాన్ సహజమైన రీతిలో రక్షించేవారు. ఈవిషయం గణేషన్‌గారు "కొన్ని అద్భుత క్షణాలు" అనే గ్రంథంలో ఉంది.

నేను 1987లో చించినాడలో నాన్నగారి పుట్టినరోజున కమలమ్మగారి ఇంటి ఆవరణలో మహోత్సవం జరిగింది. ఆ సమయం బంగాళాఖాతంలో పెను తుఫాను సమయం. పాలకొల్లులో భక్తులు బస్ ఎక్కాము. అప్పటి సమయం చించినాడ గోదావరి వంతెన నిర్మాణం జరుగలేదు. మేడపాడు మీదుగా వెళ్ళేది బస్సు ఎక్కాము చినుకు ప్రారంభమైనాయి. భారీ వర్షం కానీ చించినాడ సభా ప్రాంగణంలో లేదు బస్ దిగిన తరువాత వర్షం ఆగిపోయింది. ప్రవచనం రెండు గంటలు వర్షం రాలేదు. తిరిగి ప్రయాణంలో బస్సు ఎక్కాము. కుండపోత తిరిగి పాలకొల్లు నుండి క్షేమంగా ఇంటికి వెళ్ళాము. తిరిగి కుంభవృష్టి. జ్ఞాని సంకల్పంతో ప్రకృతి ఉపద్రవాన్ని ఆపగలరని, శాశించగలరని. భగవాన్, నాన్నగార్కి ఇది సాధ్యమేనని రుజువు చేసారు. భగవాన్, నాన్నగారిని వర్ణించటం అసంభవం. ఇలాంటి అసంభవాలను నేను ప్రోగుచేసి భద్రపరిచేందుకు ప్రయత్నిస్తున్నాను ఈ సంకలనములో అది భక్తులకు, ముందు తరాల భక్తులకు ఆధ్యాత్మిక పరిణితికి దోహదపడుతుందని నా ఆశ. భగవాన్, శ్రీనాన్నగారు దయాసాగరులేకాదు సర్వశక్తిమంతులైన ప్రభువులు కూడా. ఇదే సంఘటన మైసూరు దత్త స్వామి చరిత్రలో కూడా జరిగింది.



# 49.భక్తాగ్రేస్వరురాలు గుండుగొలను 'స్వర్ణ'

పశ్చిమగోదవారి జిల్లా భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో పుణ్యదంపతులు శ్రీ వేములమండ సత్యనారాయణరాజు, సావిత్రి అమ్మ దంపతుల (అనగా మా బావగారు, అక్క గార్ల) కుమార్తె 'స్వర్ణ'. శ్రీనాన్నగార్కి అత్యంత ఆత్మీయ భక్తురాలు. సంపన్న కుటుంబము. నిష్కామంగా గ్రామంలో పేదల గృహనిర్మాణంలో ధనసహాయం చేసేది. యాచకులకు రోజూ అన్నప్రసాదం అందించేది. రోజూ సత్సంగం తన ఇంటి వద్ద చేసేది. ఆ ప్రాంత భక్తులు ప్రాణప్రదంగా భావించేవారు. వారి ఇంటి ప్రాంగణంలో నాన్నగారు ప్రవచనాలు చాలాసార్లు చేసేవారు. నాన్నగారు, కలెక్టరు రామకృష్ణ గారు అక్కడే మొదటిసారి కలిసారు. శ్రీనాన్నగారు ఒకరోజున అక్కడే మకాం వేసేవారు. సమీప గ్రామ భక్తులకు శ్రీరమణ నిలయం మూడంతస్తుల భవనంలోనే విడిది. సావిత్రమ్మగారితో శ్రీనాన్నగారు "మీకు పెద్ద వయస్సు వచ్చింది. ఆరోగ్యం రీత్యా అసౌకర్యం. మీరు జిన్నూరు రావద్దు, నేనే ఏలూరు వచ్చినప్పుడు ఒకరోజు మీ ఇంట విడిది చేస్తాను" అనేవారు.

భగవాన్ సమక్షంలో కొందరు ఒక పిల్లవానిని తీసుకొనివచ్చి భగవాన్‌తో "అయ్యా! అబద్ధాలు ఆడుతున్నాడు. మీరు మందలించండి" అనగా భగవాన్ ఆ పిల్లవాడిని ఉద్దేశించి "ఓరే బాబూ! మీ పెద్దలు అబద్ధాలు ఆడుతారు, తెలివిగా ఉంటారు. నీవు కూడా అబద్ధాలు చెప్పటం మానకు" అన్నారు. అందరూ ఇదేమి విచిత్రం అనుకొంటారు. దీనిపై శ్రీనాన్నగారు భగవాన్ అంతరంగంలోని భావాలను ప్రవచనంలో ఇలా తెలిపారు "తీసుకొని వచ్చినవారు పవిత్రులైతే వాళ్ళే మందలించ వచ్చు కదా! నా దాకా ఎందుకు? ప్రచారానికే కదా? అని భావన" అన్నారు.

ఒక అమ్మగారు స్వర్ణ సత్సంగమునకు తన కుమారుడిని తీసుకొని వచ్చి "వీడు చదవటం లేదు. అల్లరి ఎక్కువ చేస్తున్నాడు. మీరు కొంత నచ్చచెప్పండి" అన్నది. స్వర్ణ పిల్లవాడిని దగ్గరకు తీసుకొని "బాబూ! అల్లరి చేయక శ్రద్ధగా చదువుకో. నీవు చదువులో పెద్దవాడివి కావాలి" అంది. మరుసటిరోజే పిల్లవాడు అల్లరి చెయ్యటం మాని శ్రద్ధగా చదువుతుండటం చూచి తల్లి అంది "నీవు మారిపోయావు" అనగా పిల్లవాడు "స్వర్ణ ఆంటీ చెప్పారు కదా! అందుకని" అనగా తల్లి ఆనందపడింది. స్వర్ణలో ఉన్న పవిత్రత అది అనుకొన్నది.

స్వర్ణ ఇంట శ్రీనాన్నగారి విడిదిలో కొంచెం దూరంగా ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్ళేటప్పుడు ఆయనకు అసౌకర్యం కలుగకుండా స్వర్ణ నాన్నగారి గుమ్మం దగ్గరే కూర్చునేది రాత్రి అంతా నిద్రలేక. రుచికరంగా వంటచేసి నాన్నగార్కి దగ్గర ఉండి వడ్డించేది.

అరుణాచలంలో భగవాన్ విగ్రహానికి చాలామంది వారి శాంతి, సౌభాగ్యాల కోసం అభిషేకం చేయించుకొనేవారు. స్వర్ణ నాన్నగారి పేరు మీద అభిషేకం చేయిస్తూ ఉండేది. శ్రీనాన్నగారు హాలులో ఉన్న భగవాన్ విగ్రహానికి ప్రదక్షిణం చేస్తూ ఉండగా ఒక భక్తురాలు "స్వర్ణ మీపేరు మీద భగవాన్‌కు అభిషేకం చేయిస్తున్నది" అనగా శ్రీనాన్నగారు చిరునవ్వు నవ్వుకొన్నారు. నిఘూడమైన భక్తి భక్తాగ్రేస్వరురాలు కదా అని భావన కావచ్చు. జిన్నూరు సత్సంగానికి రావటానికి గుండుగొలనులో ఉదయం 7 గంటలకు బస్‌లో బయలుదేరి ఆశ్రమానికి 11 గంటలకు వచ్చేది. నాన్నగారు కూర్చునే కుర్చీకి ముందు కూర్చునేది. తిరిగి ఇంటికి రాత్రి 10 గంటలకు చేరుకునేది. ఆనందమే కానీ శ్రమ లేదు.

స్వర్ణ నాన్నగారితో "అయ్యా! నాకు గర్భసంచి తొలగించే ఆపరేషన్ హైదరాబాద్‌లో చేయించుకుంటున్నాను. మీ దృష్టికి తీసుకొని వస్తున్నాను" అన్నది.

ఆపరేషన్ వల్ల మరణం ఖాయమని తెలుసుకొన్న నాన్నగారు మర్మగర్భంగా "మన భీమవరంలోనే చేయించుకోవచ్చు కదా!" అనగా స్వర్ణ "మా వదిన హైదరాబాద్ రమ్మన్నది. అక్కడికే వెళుతున్నాను" అన్నది. శ్రీనాన్నగారు మౌనం వహించారు. కానున్నది కాక మానదని. అంతిమకాలం సమీపించింది. ఇంజనీరు రామకష్ణంరాజు గారి వ్యవహారంలోలాగే ఇక్కడ జరుగుతున్నది. ఆపరేషన్‌లో రక్తం ఎక్కించటంలో ఆమె గ్రూపు కానిది, వేరే గ్రూపు రక్తం ఎక్కించారు. పేషెంట్ ఉక్కిరిబిక్కిరి అయినా డాక్టరు అతి నిర్లక్ష్యంచేత స్వర్ణ మరణించింది. భర్త, తల్లితండ్రులు, అన్నలు, స్వర్ణ ఏకైక కుమారుడు లండన్‌లో ఎంఫార్మసీ చేసి ఉద్యోగంలో ఉన్నవాడు, బంధుగణం, భక్తులు, గ్రామ ప్రజలు కన్నీరు మున్నీరైనారు. శ్రీనాన్నగారు శ్రీశైలంలో ఉండగా నా మేనకోడలు దర్భరేవు గ్రామవాసి సీతమ్మ స్వర్ణ విషయం తెలుపగా శ్రీనాన్నగారు కన్నీళ్ళు తుడుచుకున్నారు. అంటే అటువంటి భక్తురాలు మరలా చూడలేమని భావన.

జిన్నూరు సత్సంగంలో స్వర్ణ గురించి మాట్లాడుతూ శ్రీనాన్నగారు "పని ఉంటే తప్ప నా ఇంటికి ఎప్పుడూ రాలేదు. సైలెంట్ మైండ్, క్రమశిక్షణను స్వర్ణ నుంచి నేర్చుకోవాలి. తన ఇంటి సత్సంగంలో ముందు గాయకులతో భగవాన్ పాటలు, నా పాటలతో ప్రారంభించేది" అన్నారు. ఆమె ఫొటోను ఆశ్రమంలో వారి గదిలో ఉంచుకొన్నారు.

గుండుగొలను వెళ్ళి స్వర్ణ తల్లితండ్రులతో స్వర్ణ పుణ్య లోకాలలో శాంతంగా ఉంది, దాని గురించి బాధపడకండి అని శాంతింపజేసారు. స్వర్ణ తండ్రి మునసబుగారు స్వర్ణ పేరు మీద కల్యాణ మండపం నిర్మాణానికి పూనుకొన్నానని ఆ ప్రదేశం చూపించి అక్కడ 40 లక్షలతో సత్యనారాయణస్వామి గుడిని తన పెద్ద కొడుకు విశ్వనాథ సుబ్బరాజు సాయంతో నిర్మించారు. ఆ గుడిని ప్రారంభించారు. తదుపరి స్వర్ణ సంస్మరణార్థం సత్సంగం చేసారు. ఇది స్వర్ణ సువర్ణ చరిత్ర.

# 50. అవతార సమాప్తి - పిలిస్తే పలికే శ్రీనాన్నగారు

రాకమృష్ణులు అవతార సమాప్తంలో మహేంద్రనాథ్ గుప్త (రామకృష్ణ కథామృత సంకలన కర్త) తో "నేను గతించాక మీరందరూ కలతచెంది విలపిస్తూ వీధుల్లో తిరుగుతారని తలచినప్పుడు బాధ కలుగుతోంది. ఈ దేహం విడిచి పెట్టటానికి మనస్కరించటం లేదు" అన్నారు.

అలాగే శ్రీనాన్నగారు దేహం ఐదు రోజుల్లో అనగా (వైకుంఠ ఏకాదశి రోజున) జిన్నూరు ప్రెసిండెంట్ లక్ష్మితో ఒంటరిగా ఉన్నప్పుడు "ఈ దేహాన్ని సమాధి చెయ్యకండి. అందరూ దహనం చేసే స్మశానంలో ఈ దేహాన్ని దహనం చెయ్యండి" అన్నారు. గౌతమబుద్ధుని వైరాగ్యజ్వాలలు శ్రీనాన్నగారిలో కనిపించాయి.

చివరి రోజుల్లో భక్తులు దర్శనానికి వస్తే కొంచెం వయస్సు మీరినవారు నమస్కారం పెడితే తిరిగి వారికి నమస్కారం పెట్టేవారు. అంటే ఈ భౌతిక దేహం నుంచి సెలవు తీసుకుంటున్నాను అని అర్థం స్ఫురించేది నాబోటి వారికి. భగవాన్‌లా మనలను రక్షించేవారు. "సంకటంలోనే వెంకటరమణుడు" అనే భక్తులకు కూడా సందేహాలు తీర్చేవారు, రక్షించేవారు. వారి భౌతిక దేహం లేదు, కానీ మనం జీవితం ఇంకా భౌతికదేహాన్ని నెట్టుకురావలసి వస్తున్నది. నిలకడ లేని ఈ ప్రాపంచిక జీవితంలో ఆటుపోట్లను ఎలా అధికమించగలం అంటే వాటిని అభ్యాసవైరాగ్యాలతో శ్రీనాన్నగారు సజీవంగా ఉన్నారు. ఇది ఆశ్చర్యకరమైనది ఏమీ కాదు. శ్రీనాన్నగారి వైరాగ్య జ్ఞానజ్యోతులు మహోజ్వలంగా మనపై ప్రకాశింపచేస్తున్నారు. మనం అభ్యాస వైరాగ్యాలతో వారిపై నిండు విశ్వాసంతో, జై జై శ్రీనాన్నగారు, జై జై శ్రీ గురు మహారాజ్ అంటూ ఉండటం నేర్చుకోవాలి.

త్యాగరాజు "పిలిస్తే పలికే రాముడు వాకిట్లోనే ఉన్నాడు" అన్నారు. అన్నమయ్య తన సంకీర్తనలో "శ్రీ వేంకటపతి చేరువలో ఉండగా భావ కర్మలతో పని ఏలా" అన్నారు. దాన్ని భావనకర్మలు అంటే "రేపు ఏమి జరుగుతుందో ఈ జీవిత సంకటాలను ఏలా అధిగమించాలి అనే ఒకరకమైన డోలాయమాన స్థితి తారసపడితే పిలిస్తే పలికే శ్రీనాన్నగారు చేరువలో ఉండగా మన కర్మల భారాన్ని వారి పాదాలచెంత ఉంచి నిశ్చలంగా ఉండాలంటే, ద్రౌపదికి ఉన్న పిలుపు "హృదయ వాసా" అనగలగాలి. సూరదాసుకున్న 'ఆర్తి', రాధకు కృష్ణునిపై ఉన్న ప్రేమ, సక్కుబాయి – మీరాబాయికి ఉన్న విరహం కొంతైనా అలవర్చుకొంటే చాలు. రుక్మిణికి కృష్ణుని రూపంపై కాకుండా ఆయన కల్యాణ గుణాలపై ప్రేమ, విశ్వాసం ఉంటే చాలు. ప్రయత్నం మన చేతుల్లో ఉంది. నాన్నగారు నాన్నగారు అని ఆర్తితో పిలిస్తే "ఏమి ఏమి" అని పలుకుతారు. నిజభక్తులకు ఇది సాధ్యమే. ఇది నా విశ్వాసం.

సోదర సోదరీమణులారా! సముద్రానికి వెళ్ళి ఆ పవిత్ర నీటిని మనం తీసుకొని వెళ్ళే పాత్ర అంటే చెంబు ఉంటే చెంబు, బిందె ఉంటే బిందె, గుండెగ ఉంటే గుండెగతో ఆ సముద్ర జలాలను ఇంటికి తెచ్చుకోవచ్చు. అలాగే మహాసముద్ర జలాల వంటి శ్రీనాన్నగారి ప్రేమ, వారి కల్యాణగుణాలను చెంబువంటి పరిణామం గల నా బుద్ధికి సేకరించి ఈ సంకలనములో పొందుపరిచాను. అలాగే గుండెగ వంటి పరిణామం గల పెద్దలు చాలామంది ఉన్నారు. ఎందరో మహానుభావులు అందరికీ వందనములు. ఈ పేదవాని ఈ సంకలనాన్ని ఆశీర్వదిస్తారని, తప్పులు ఉంటే పెద్ద మనస్సుతో తెలిపితే సరిజేసకుంటానని ప్రార్థన.

అన్నమయ్య తన కీర్తన చివర వేంకటేశ్వరుని ఇలా ప్రాధేయపడతాడు "దాచుకో నీ పాదాలకు తగనే జేసిన పూజల పుష్పములు అయ్యా నా నాలికపై

నానా సంకీర్తనలు పూని పొగడించినవి వినుతించుట ఎంతవాడ కానియ్యమని కట్టితివి గాని ఏముంచి నా స్వాతంత్రము చెప్పినవాడను కాను, నేరములెంచకు నీ పాద దాసుడా శ్రీ వేంకటేశ్వరవయ్యా" అన్నాడు.

శ్రీనాన్నగారితో పూర్వం ఈ సంకలనాన్ని వ్రాస్తాను అనగా వారు అలాగే, అలాగే రాద్దురుగాని అని చిరునవ్వులు చిందారు. అన్నమయ్య అనట్లు శ్రీనాన్నగారు నాతో పొగిడించుకొన్నారు. నాతో వారి వైభవాన్ని రాయించుకున్నారు. ఇది గర్వంతో కాదు, నాకే స్వాతంత్రం ఉంది, నా కలాన్ని వినియోగించుకొన్నారు, ఇది నా పరిపూర్ణ విశ్వాసం. ఈ సంకలనానికి అనుమతి ఇచ్చిన శ్రీనాన్నగారికి నా ధన్యవాదాలు. అరుణగిరి ప్రదక్షిణలో తమిళ భక్తులు "అన్నాములై ఇరిక్కిరాకం" అంటారు. దాని అర్థం "అరుణాచలా కలకాలం జీవించుగాక" అంటారు. మనం కూడా శ్రీనాన్నగారు కలకాలం మమ్ములను ఉద్ధరించటానికి జీవించుగాక అని ఆర్తితో ప్రార్థిద్దాము. ప్రార్థనే మనకు పెద్ద దిక్కు. అదే జీవిత సారం.


**శ్రీనాన్నగారు**

**శరణాగతి పారిజాతమా**

**జయ మంగళం మీకు సర్వేశ్వరా**

**శుభ మంగళం మీకు సర్వేశ్వరా**

**ఓం తత్ సత్**



అర్ధవరం గ్రామంలో రమణ కేంద్రము మరియు గీతా మందిరం నాలుగు వందల గజాలలో నిర్మించినారు. అర్ధవరం హైస్కూలుకు ఎకరం పొలం కొని ఇచ్చారు. రామాలయంలో ధ్వజస్థంబానికి అక్కడే సత్‌సంగానికి ఒక హాలు నిర్మించారు. **కీర్తిశేషులు కూనపరాజు సూర్యనారాయణ రాజు**గారు, వారి ధర్మపత్ని **సీతమ్మ**గారు (విశాఖపట్నం సుజాతగారి తాతమగారు, అమ్మమ్మ) పుణ్య చరితులు. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలను **కళ్ళేపల్లి రామాలు**గారు ఏడు లక్షల రూపాయల వ్యయంతో ధ్యానమందిరం దానిపై అరుణగిరి నిర్మిస్తున్నారు. అరుణాచల దీపోత్సవానికి నాలుగు వందల మంది భక్తులు దర్శించుకునేవారు. ప్రస్తుతం నిర్మాణం జరుగుచున్నది. నిర్వాహకులకు తెల్లవారుఝామున ధ్యానంలో రామాలగార్కి భగవాన్ కనిపించి నిర్మాణాలకు సూచనలు చేస్తున్నారు.

శ్రీనాన్నగారు ఆశ్రమాన్ని దర్శించి

**"భగవాన్ జిన్నూరు కన్నా ముందే అర్ధవరం వచ్చారు"** అన్నారు.



మా తల్లి సాగిరాజు చిట్టెమ్మ గారు మరియు నా మనుమడు ఆంజనేయరాజుతో నేను



నా సోదరి సావిత్రమ్మ, నా పిప్పర సోదరి అన్నపూర్ణ నా ఇద్దరు కూతుళ్ళు



అరుణాచల కొండపై భగవాన్ కూర్చున్న రాతి మీద శ్రీ నాన్నగారు, వారి ప్రక్క నేను, రామచంద్రరాజు కూర్చున్న చిత్రం. చించినాడ కమలమ్మగారు ఉన్నారు.



**నా ఇంటి ప్రాంగణంలో ఈ ఫొటోలో ఉన్నది నా ధర్మపత్ని, నాకు నవవిధ సేవలు అందించి శరీరాలు వేరైనా మనస్సు ఒక్కటే అన్న రీతిలో సేవలు అందించిన కీ॥శే॥ రంగమ్మ. మంచాన పడ్డ అత్తమ్మకు 6 సం॥లు అంతులేని సేవలు అందించిన పుణ్య చరితురాలుగా ఆమెను మా గ్రామ బంధువులు స్తుతించారు.**



మా ఇంటివద్ద శ్రీనాన్నగారి ప్రవచనానికి ముందు తొలి పాట పాడిన సీతారత్నం దంపతులతో మా దంపతులు



**2005లో అమృతవాహిని మొదటి భాగం జిన్నూరు రమణ క్షేత్రంలో ఆవిష్కరించి నన్ను సన్మానిస్తున్న గురుదేవులు శ్రీనాన్నగారు**





మా చిన్న అమ్మాయి శాంతకుమారి వివాహంలో మా పెద్ద అమ్మాయి దంపతులు వారి పిల్లలు రాధా లావణ్య, నా భార్య రంగమ్మలతో నేను.




పాతాళ మెరక రవివర్మ ఇంట్లో నేను, శ్రీనాన్నగారు, శివవర్మ, రవివర్మ మరియు అతని కుమారుడు రామరాజుగారు ఇతరులు



**1987** సం॥లో నా స్వగృహ ప్రాంగణంలో శ్రీనాన్నగారి తొలి మీటింగులో వారి గురించి తొలి పలుకులు. నా ప్రక్కన నా పెద్దక్క కాంతమ్మగారు.




మా ఇంటి వద్ద తొలి మీటింగులో భక్తులు



భీమవరంలో రామాలయంలో శ్రీనాన్నగారి సత్సంఘంలో నా పలుకులు



శ్రీ కృష్ణుని వేషంలో ఉన్న నా మునిమనుమడు గాదిరాజు రఘువీర వర్మ. శ్రీనాన్నగారి పాదాలను వదలకుండా ముద్దుపెట్టుకునేవాడు. "పూర్వ జన్మ అనుబంధం అది" అన్నారు శ్రీనాన్నగారు.



శ్రీరమణ జిన్నూరు
22-3-93

పూజ్యులు శ్రీ రామకృష్ణంరాజు గారికి
నాన్నగారు నమస్కరించి వ్రాయునది.-
మీరు ప్రేమతో వ్రాసిన కవరు
అందినది. జిన్నూరులో సభ ఈ నెల
23వ తారీఖున జరుగుతుంది. 28వ తా
రీఖున ~~పాలకొల్లు~~ పాలకొల్లు అద్దేపల్లి
వారి సత్రంలో జరు
గుతుంది. 30, 1వ
తేదీలలో భీమవరం
ఆదర్శనగర్‌లో నిర్మిం
చిన రామాలయ ప్రాంగ
ణములో సభలు ఉన్న
వి. సీతారత్నము
గారి అమ్మాయికి
వివాహము నిశ్చయమై
నది.



సౌ|| R రాజు రామకృష్ణంరాజు
రమణ నిలయం
అర్ధవరం పోస్టు
(వయా) పిప్పర
పశ్చిమగోదావరి జిల్లా
पिन PIN

శ్రీ నాన్నగారు ఈ పేదవానికి వారి స్వహస్తాలతో వ్రాసిన పోస్టు కార్డు.



సద్గురు శ్రీ నాన్నగారి దివ్య పాదపద్మములు